డిసెంబర్ 1955

# అభిసారిక

8 అణాలు



## ఈ సంచికలో

భరద్వాజ, 'సులోచన' కె. పి. బాబు. వజ్రపాణి, హేవలాక్ ఎల్లిస్, మొదలైనవారి రచనలూ, లండన్ వ్యభిచారిణి, పురాతన లైంగికాచారాలు, వార్తాప్రపంచం మొదలైన వైజ్ఞానిక విషయాలూ, అవీ, ఇవీ, ఇంకా ఎన్నో—


# అభిసారిక

## డిసెంబర్ సప్లిమెంట్ సంచిక

అనేకమంది పఠితల సందేహాలు తీర్చేవారు లేక గొప్ప సమస్యలుగా నీడలవలె పీడిస్తున్నవి. అట్టి అనేక సందేహాలను తీర్చేందుకు అభిసారిక, డిసెంబర్‌లో వేరే సప్లిమెంట్ సంచికను ప్రచురిస్తోంది. యీ సంచికలో చాలా కాలంగా వేధిస్తూన్న మీ వ్యక్తిగత సందేహానికి జవాబు ఉండొచ్చు; కనీసం మీరు కొత్తగా నేర్చుకునే అనేక విషయాలు సమగ్రంగా చర్చించబడుతవి.

త్రివర్ణ ముఖచిత్రం

40 పేజీలు : వెల 4 అణాలు మాత్రం.

విడుదల : డిసెంబర్ 1-వ తారీకు

చందాదారులకు మాత్రం యీ సంచిక ఉచితంగా పంపబడుతుంది.

సంవత్సర చందా: రూ 6-0-0

6 నెలలకు రూ 3-8-0

అభిసారిక కార్యాలయం, మద్రాసు, 17.

డిసెంబర్ రెండోవారంలో విడుదల!

చౌడేశ్వరీదేవి రచన

# జీవితం!

మానవ జీవితపు లోతుల్ని పరిశోధించి, మనస్తత్వాల్ని పిండి పారేసే రచనలు. ఆకర్షణీయమైన ద్వివర్ణ ముఖచిత్రం.

80 పేజీలు, వెల 8 అణాలు.

జ్యోతి ఏజెంట్ల దగ్గర, హిగ్గిన్ బాధమ్స్‌లోనూ దొరుకుతుంది. లేదా,

జ్యోతి కార్యాలయం, మద్రాసు, 17.



# దేశోద్ధారకుడు

చప్పున ఆమెను బలంగా తనవైపు లాక్కున్నాడు; గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

'తప్పుకాదూ?' అంది మృదువుగా.

ఇది తప్పని తనకు తెలియదా? కాని తప్పును గూర్చి చర్చించేందుకు ఇది సమయంకాదు.

'పర్వాలేదు, నేను పెళ్ళాడతాను!' అన్నాడు అర్థం లేకుండా.

అతను నారీద్వేషి. అతని దృష్టిలో కామం పశుశక్తి, పురుషుల్ని పాపాలకు పురికొల్పటం కోసమే స్త్రీలు జన్మించి వుంటారని అతని నమ్మకం.

అడగండి: ధనికొండ వారి దేశోద్ధారకుణ్ణి

త్రివర్ణ ముఖచిత్రంతో 125 పేజీలు, ఎనిమిదణాలు. మీ న్యూస్ ఏజెంట్లవద్ద దొరుకును.

కళాకేళి: సామర్లకోట.

# అభిసారిక

సచిత్ర విచిత్ర మాస పత్రిక

సంపాదకుడు: ధనికొండ హనుమంతరావు

సంపుటి 3 | డిసెంబర్, 1955 | సంచిక, 6


భారత దేశంలో జరిగే వ్యభిచారాన్నిగూర్చి పరిపూర్ణంగా పరిశీలించేందుకు ఏర్పడిన కమిటీవారు ఆయా కారణాల్ని యీ విధంగా చెపుతున్నారు: ఆర్థిక దుస్థితివల్ల 55.4%, దాంపత్య జీవితంలో పొత్తు కుదరనందువల్ల 27.7%, భర్తలవల్ల అవమానితలవటం, విడవబడటం, విధవరికం మొదలైన వాటివల్ల 16.9 %, వ్యభిచారానికి పాల్పడుతున్నారు. ఇవి గాక మతైకమైన మూఢనమ్మకాలూ, తర తరాలుగా వొస్తున్న ఆచారాలుకూడా కారణాలు.

వ్యభిచారవృత్తిలో వున్నవారిలో నూటికి 66. 5 మంది గ్రామాల నుంచి పట్టణాలకు జేరినవారు. యీ వ్యభిచారిణుల వయస్సులు 10సం.ల నుంచీ 29 సం. ల వరకూ వున్నవి.

ఐతే దీన్ని రూపు మాపేందుకు దేశంలోని ఆర్థికస్థితి పెరగందే లాభంలేదు. దాంతోపాటే యీ కమిటీవారు యీ కింది సలహాలను చేశారు:

భారత దేశమంతటా ఒకేవిధమైన చట్టాలు, వ్యభిచార నిర్మూలనకుగాను వేరే పోలీసు బందోబస్తుతోపాటు, పురజనులైన పెద్దమనుషుల సహాయం, అధోగతిలోవున్న స్త్రీ జనోద్ధారణకుగాను పాటుబడే సంస్థలు, ముఖ్యంగా వయసుకు వచ్చినవారికి లైంగిక

విజ్ఞానాన్నివ్వటం, సామాజికశాస్త్రం, పిల్లలు పెడదార్ల బడకుండా వారినిస క్రమమార్గంలో ఉంచేందుకుగాను విద్యాసంస్థలూ, అత్యవసరం.

వ్యభిచారానికి పాల్పడే స్త్రీలను సంస్థలుమాత్రం ఎంతకాలం పోషించగలవు? అందుకని వీరికి వివాహాలు చేసే ఏర్పాట్లుకూడా ఉండాలి; దీనికి పాటుపడేందుకుగాను వివాహ బ్యూరో అవసరం.

కమిటీవారు సూచించిన సలహాలలో లైంగిక విజ్ఞానావశ్యకత ముఖ్యమైనదనేందుకు సందేహంలేదు. ప్రపంచంలో ప్రతి కాలం లోనూ ఏదో ఒక రూపంలో వ్యభిచారం సాగుతూనే వుంది. దాన్ని అరికట్టాలంటే, కనీసం, వున్నది అంటువ్యాధివలె పాకి దేశీయు లందర్నీ సర్వనాశనం చేయకుండా తప్పించుకోవాలంటే, లైంగికవిజ్ఞానం సామాన్య ప్రజలందరికీ అందుబాటులోకి రావాలి. మార్చి 1955 అభి సారికలో ప్రచురించిన 'స్వీడన్‌లో లైంగిక విజ్ఞానం' అనే వ్యాసం చదు వుతే, ప్రభుత్వం తన బాధ్యతల్ని గుర్తించి, ఏ విధంగా దేశాన్ని ఒక మార్గాన పెట్టగలదో తెలుస్తుంది.

కమిటీవారి రిపోర్టును పరిశీలించి, భారత ప్రభుత్వం ఇప్పటి కైనా కళ్లు తెరిచి, తగిన బందోబస్తులు నిర్మాణాత్మకమైన పద్ధతిలో చేయటం అవసరం.



# వార్తాప్రపంచం

నేటి ఇండియా జనాభా చదరపు మైలుకు 300; మద్రాసు రాష్ట్రంలో చదరపు మైలుకు 1,000 దాకా వుంది!

★

పాకిస్థాన్ ప్రధాన మంత్రి మహమ్మదాలీ భార్య బతికి ఉండగా, మరో వివాహం చేసుకున్నాడని, మహిళా సంఘాలు దుమ్మెత్తి పోసినవి.

'దాంపత్య సౌఖ్యాన్ని పొందేందుకు పశ్చిమ దేశాలవారు విడాకుల పద్ధతిని ఆయుధంగానే ఉపయోగిస్తున్నారు. యీ పద్ధతి మహమ్మదీయుల్లో కూడా వుంది. ఐతే, దీనికన్నా మరో వివాహమే సుఖపెట్టగలదు' అని మహమ్మదాలీ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

★

పరిష్యాలో నల్లమందు భాయీలు ఎక్కువయ్యారు. అంచనాల ప్రకారం నూటికి 10 మందికి యీ అలవాటు వుంది; వీరిలో మూడో వొంతు జనాభా వయస్సు 18–40 సం॥ల మధ్య. ఏటా అపరిపక్వ మరణాలు లక్షకుపైగా, నల్లమందు కారణంగా, ఉంటూన్నవి. ఏటా ప్రభుత్వమే 100 టన్నుల నల్లమందు దిగుమతి చేస్తుంది. ఇదిగాక దొంగ దార్ల నుంచి వొచ్చేది లెక్కే లేదు.

యీ మధ్యనే వారి పార్లమెంట్ నల్లమందు సేవించటాన్ని నిషేధిస్తూ, చటాన్ని నిర్మించింది.

★

అలెగ్జాండ్రియాలో ఉన్నతోద్యోగులైన ఇద్దరు న్యాయాధికారులు అరెస్టు కాబడి, మిలిటరీ కోర్టుకు లాగబడ్డారు. వీరి నేరాలు ఇవి:

వీరిద్దరూ మహమ్మదీయ విడాకుల న్యాయస్థానంలో న్యాయాధికారులు. విడాకుల్ని కోరే స్త్రీలు, వీరి కామవాంఛల్ని తీర్చటంతో, తమకు అనుకూలంగా తీర్పుల్ని పొందటం చాలా కాలంగా జరుగుతోంది.

ఒకానొక యువతి యీ రహస్యాన్ని బైటపెట్టి, వీ రిద్దర్నీ నేరం జరుగుతూండగానే పట్టించింది. యీ నిందితులు నేరస్థు లయ్యేట్లయితే, చట్టప్రకారం ఆ జన్మఖైదు తప్పదు.

★

సెప్టెంబర్ 3-వ తారీకున కడపలో ఒక విచిత్ర వివాహం జరిగింది. వరుడు 25-సం॥ ల యువకుడు, కడప నివాసి, దేవదాసు; వధువు 20 సం॥ ల యువతి నంద్యాల నివాసిని హుస్సేనమ్మ. వీరిద్దరి ఎత్తు 3 అడుగులుమాత్రం. 3, 000 మంది యీ వివాహానికి హాజరయ్యారు.

★

సెప్టెంబర్ మాసాంతంలో -

హైద్రాబాద్‌లో 10 సం. ల వయస్సున్న కుమారి కమల, ఆపరేషన్ కానీ, ఇతర వైద్యసహాయం కానీ లేకుండానే, స్వభావసిద్ధంగా మొగపిల్ల వాడైంది. ఆమెపేరు 'రాంచందర్' అని మార్చవలసి వొచ్చింది.

★

యీ నాటి కీ ప్రపంచంలో 150 సం॥ ల పైబడిన వృద్ధులు ఉన్నారు. వీరిలో అధికభాగం రష్యాలో ఉన్నారు. 1812 లో నెపోలియన్ రష్యామీద దండయాత్ర చేసినప్పుడు, వీరు యువతీ యువకులు!

ఐతే 150 సం॥లు ప్రపంచ రికార్డు అనేందుకు వీల్లేదు. ఆసియా లోని మారుమూలల్లో 200 సం॥ ల వరకూ బతికినవా రున్నారు. వీరిని గూర్చిన రికార్డులు దొరకవు.

అలా రికార్డు లభ్యమైన వాటిల్లో మెక్సికోలోకి, మార్సియల్ పినా అనే ఆయన 149 ఏళ్లు బతికాడు. అతని వారసులు 200 దాకా ఉన్నారు; అతని పెద్ద కొడుకు 107 సం॥ ల వయసున్నవాడు ఇప్పటికీ బతికే ఉన్నాడు. పెరూలో రికార్డయిన టర్కీ దేశస్థుడు హిలిర్ ఆగా 157 సం॥ వరకూ బతికాడు.

ఎక్కువకాలం బతకటంమీద అంచనాలు చూస్తే నార్వే లోని స్త్రీలకు ప్రథమస్థానం వస్తుంది. 1900 సం॥ తర్వాత బ్రిటన్‌లో 116 సం॥ లు జీవించిన స్త్రీదే రికార్డు. స్త్రీలకు బైటి ప్రపంచంలో పురుషులు ఎదుర్కొనే సమస్యల్లాంటివి ఉండవు. కనుక, ప్రశాంతమైన జీవితంలో ఎక్కువకాలం బతికే అవకాశాలు ఉంటవనుకోవచ్చు.

★

నివశించే ప్రదేశంలో వున్న జనాభా ఆధిక్యతకూ ఊపిరి తిత్తులకు వొచ్చే కాన్సర్‌కూ సంబంధం వుందనే అనుమానం కలుగు తోందని అమెరికన్ శాస్త్రజ్ఞు లంటున్నారు. తాను నివశించే పట్టణం జనాభా అధికమైనకొద్దీ యీ వ్యాధికి గురియే అవకాశాలు ఎక్కు వవుతున్నవి. ఇది పురుషుల విషయంలోనేకాని, స్త్రీల విషయంలో కాదు. పట్టణాల్లో విశేషంగా వున్న పరిశ్రమలూ, వాటి తాలూకు పొగ వల్లనే యీ ప్రమాదంవుంది.

ఇతర దేశాల అంచనాలు చూస్తే — ఇంగ్లండ్, వేల్స్, డెన్మార్కులలో పల్లెల్లో కన్న పట్టణాల్లోనే ఊపిరితిత్తుల కాన్సర్ వల్ల మరణాలు ఎక్కువగా ఉన్నవి. ఇంగ్లండ్‌లో జనాభాకన్న, ఇళ్లుదగ్గి రగా ఉండటం మీద యీ వ్యాధి విస్తరిస్తోందని తేలింది.

యీ మధ్య జబ్బల్‌పూర్‌లో ఒక జైన మతస్థుడైన యువకుడు, ఆడపిల్లను అల్లరి పెట్టినందుకు గాను, పంచాయితీ దారుల తీర్పు ప్రకారం, యువకుడు యువతి పాదాలు తాకి, దైవ సాన్నిథ్యంలో ఇకముందు ఆమెను తన సోదరివలె చూస్తానని ప్రమాణం చేశాడు.

★

శిశు పక్షవాత నిరోధనంగా సాల్క్-టీకాలు వేసేపద్ధతిని అమెరికా ప్రవేశపెట్టింది. 70 లక్షలమంది పిల్లలకు యీ టీకాలు వేయటం వల్ల సగటున నూటికి 25 మొదలు 50 వరకూ శిశు పక్షవాత వ్యాధిలో తగ్గుదల కనిపించింది.

★

నేటివరకూ పేల్చబడిన అణుశక్తి ఆయుధాల కారణంగా ప్రపంచంలో 10,000 - 40,000 మధ్యగా మరణాలు సంభవిస్తవని అంచనా వేయబడుతోంది, యీ దెబ్బకు తట్టుకొని బతికినవారు చాలా మొండివాళ్లుగా బతకగలరు. పైన వేసిన అంచనాలో పుటక మొదటి వారంలోనే మరణించే శిశువుల సంఖ్య నాలుగోవంతు వుంటుంది. గర్భస్రావాలూ, ప్రాణ రహితమైన కాన్పులూ జరిగే అవకాశం వుంటుంది.

మధు మేహవ్యాధివ్యాప్తి మానసిక బలహీనతలూ అధికం కావొచ్చు. యీ మరణాలు రెండు శతాబ్దాలలో జరగవొచ్చు; అది 50 శతాబ్దాల వరకూ విస్తరించవొచ్చు. ఐతే అణుశక్తి యుగంలోని ప్రజలు, వారి పూర్వీకులకన్న మొండివాళ్లుగా బతకగలరు.

★

కారణాంతరాలవల్ల యీ సంచికలో 'మగువ మనసు' ప్రచురించలేక పోయినందుకు పాఠకులు మన్నిస్తారుగాక! పై సంచికనుంచీ సీరియల్ నవల తప్పక ప్రచురించ బడుతుంది.

—సం. అభిసారిక.




## వివాహ చరిత్ర : ప్రాముఖ్యత

వివాహ చరిత్ర ప్రపంచమంతటా సంబంధించిందిగానూ, ఒకానొక నగ్నసత్యాన్ని నిరూపించేదిగానూ తోచక మానదు. సంకుచిత దృష్టితో చూస్తే వివాహం ఒక వ్యక్తిగత సమస్యగానూ, సామాజిక కట్టడిగానూ, తాత్కాలికమైన రాజీ పద్ధతిగానూ కనిపిస్తుంది. ఐతే జీవశాస్త్రరీత్యా చూసినప్పటికీ యీ వ్యక్తిగత సమస్య జాతి విస్తరణ బాధ్యతను ఒక పద్ధతిలో నడిపిస్తూ, ప్రపంచంమీద ముఖ్య జీవరాశులకు అత్యవసరమైనదిగా అమలు జరపబడుతోంది.

వందల శతాబ్దాల క్రితం మానవుని మెదడులో యీ వివాహ మెరుపు మెరవకుండా ఉన్నట్లయితే, నేటి సామాజిక జీవనం వేరు విధంగావుండి, సంస్కారం, నాగరికత రూపాలే మారి ఉండేవి. కాని వివాహమనేదాన్ని మానవుడు తీవ్రంగా ఆలోచించి, కొన్ని కట్టడుల్లో దాన్ని బంధించి ఉంచి, జీవిత విధానాన్ని ఒక దారికి పెట్టాడు. ఇదే జరగనట్లయితే, యీ నాడు మనం ఇంత ప్రశాంతంగా ఒక ప్రత్యేక వ్యక్తిత్వంతో, ఒక కుటుంబంగా, సమాజంగా, చివరకు ఒక జాతిగా కూడా రూపొందలేక పోయేవాళ్ళం.

వివాహమనే చిన్న మాటలో ఒక స్త్రీ, ఒక పురుషుడూ కలిసికట్టుగా జీవిస్తూ ఒకరి కొకరు సహాయంగా వుంటూ జీవితాన్ని వెళ్ళబుచ్చటమే కదా అని స్ఫురిస్తుంది; ఇది ఏమంత గొప్ప సమస్య అనే ప్రశ్నకూడా రావొచ్చు. కాని విశాలంగా ఆలోచిస్తే, దీన్ని అంటి పెట్టుకొని, చిలవలు పలవలుగావున్న అనేక సమస్యలు

ఇమిడివున్న విషయం విజ్ఞులందరికీ తెలిసిందే. పెళ్ళికాగానే అది తన వ్యక్తిగత కోర్కెలు తీర్చుకునేందుకే ఏర్పడిందనే అభిప్రాయం త్వరలోనే మాయమై తన సంసారం, కుటుంబ విస్తరణ, దానిపోషణ మొదలైనవి రాకతప్పవు; యీ విధంగా దీన్ని వ్యక్తిగత సమస్య అనటంకన్నా సామాజిక సమస్య అనే పేర్కొనవొచ్చు.

ఇక శాస్త్రీయ దృక్పథంలోకి వెళ్తే వివాహాన్ని అంటిపెట్టుకొనేవంశపారంపర్యత, లైంగిక సమస్యలు, గర్భధారణ, జాతి విస్తరణ శాస్త్రం, లేదా గర్భనిరోధమూ, విడాకులు మొదలైన కేంద్ర సమస్యలు రాకమానవు. కనుక వివాహ చరిత్రకు, జీవశాస్త్రం, మానసికశాస్త్రం, శారీరకశాస్త్రం, జానపద గాథలసారం, ఇంద్రజాలం, ఆర్థిక సామాజికశాస్త్రం, రాజకీయాలు, చట్టం, మతం—మొదలైన వాటన్నిటితోనూ సంబంధంవుంది. తమ ఉనికికీ, తన ఇరుగు పొరుగుల ఉనికికీ ఏ శాస్త్ర ప్రాముఖ్యత నివ్వగలిగినా వివాహాన్ని గూర్చి క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.

## చరిత్ర పరిపూర్ణత్వం

పైన చెప్పుతున్న శాస్త్రాలన్నిటిలోనూ దిట్ట వినవాడే పరిపూర్ణ చరిత్రను మనకు ఇవ్వగలడు; కాని అలాటివాడు ఉండడని లోకజ్ఞానం చెపుతూనే వుంది. కనుక ఒకో రంగంలో ప్రముఖుల తాలూకు అభిప్రాయాలను క్రోడీకరించుకొని వివాహ చరిత్రను నిర్మించుకొనే అవసరం ఏర్పడింది. ఐతే యీ క్రోడీకరణలో కూడా వివిధాభిప్రాయాల ఘర్షణ రాకతప్పదు. మొత్తంమీద వీటి పరిశీలనతో మనం కొత్త అభిప్రాయాలను తెలుసుకొని, ఆలోచించే అవకాశం ఎంతైనా వుంటుంది.

## వివాహం : నిర్వచనం

అసలు వివాహమంటే ఏమిటి? దీన్ని నిర్వచించవలసిన అవసరంలేదని చాలా మందికి తెలుసు. కాని యీ నిర్వచించటంలో ప్రముఖులు సైతం భేదాభిప్రాయాల్ని వెల్లడించి వున్నారు. ఒకోరి అభిప్రాయం, వారి విజ్ఞానంమీదా, సంస్కృతిమీదా, నాగరికతమీదా, వ్యక్తిగత అభిరుచులమీదా ఆధారపడి వుంటుంది. ఐతే యీ విధంగా తలకొక అభిప్రాయం వుండి, తలకోవిధంగా జీవితాన్ని గడపాలని ప్రయత్నించటం కుదరదు; ఒక సమాజమంటూ వున్నాక, సామాజిక శాంతికోసం కొంత కొంతవరకూ వ్యక్తిగతాభిప్రాయాలకు రూపాల్నివ్వకుండానే, కొంత త్యాగం చేయవలసిన అవసరం వుంటుంది. ఇందువల్ల ఆ అభిప్రాయం మారవలసిన పనిలేదు. అందుకని కొంతమంది ప్రముఖులు తమ అనుభవసారాన్ని బట్టి వివాహమంటే వారి కుండే అభిప్రాయాల్ని ఏ విధంగా వెల్లడించారో తెలుసుకోవటం అప్రస్తుతం కానేరదు:

వివాహ చరిత్రమీద విశేషంగా పరిశోధించి రాయబడిన 'మానవ వివాహ చరిత్ర'—వెస్టర్ మార్క్ రచన నుంచి మనం అనేక విషయాల్ని తెలుసుకోగలం. 'మానవ వివాహం—' అనే శీర్షికలోనే ఆయన అభిప్రాయం కేవలం జీవ శాస్త్రానికి సంబంధించి వుంటుందనే సంగతి స్ఫురిస్తుంది. 'ఒక స్త్రీ, ఒక పురుషుని మధ్య వుండే సంబంధాన్ని దృఢతరం చేసేందుకూ, జాతి విస్తరణను మించిన ఆశయంతోనే వివాహం ఏర్పడింది కనుక, సంతానం కలగటంతోనే వారి సంబంధం ఆఖరవటం కాదు—' అంటాడాయన.

ఇంకాస్త సంకుచిత దృష్టితో చూసినట్లయితే, వివాహం సామాజిక, చట్ట నిబంధనల మధ్య జీవితాన్ని గడపట మనిపిస్తుంది; అందుకనే వివాహం సామాజిక వ్యవస్థలో ఒక భాగంగా రూపొందిం దనిపిస్తుంది. యీ అభిప్రాయాన్ని బట్టి వివాహం స్త్రీ పురుషుల లైంగిక సంబంధాల్ని పెంపొందించే నిమిత్తం ఏర్పడినదై, ఆచారాలకూ, ఆంక్షలకూ లోనై వుంటోం దనిపిస్తుంది.

శాస్త్రీయ విజ్ఞాని మెలొనెవిస్కీ 'వివాహం కేవలం లైంగిక సంబంధాల్ని పెంపొందించేందుకు ఏర్పడిందనటం వల్ల ఒక కొత్త పంథాను చూపుతోందనటం పొరపాటు. అనేక సామాజిక సమస్యలు తీరేందుకూ, శాంతియుతమైన జీవితాన్ని గడిపేందుకు వీలుగా వివాహ వ్యవస్థ ఏర్పడింది. యీ సమస్యల్లో లైంగిక సమస్య లున్నప్పటికీ, కేవలం వాటికే ప్రాధాన్యత నివ్వటంలో అర్థంలేదు' అంటాడాయన.

పై అభిప్రాయాన్ని బలపరిచేందుకు న్యూగినియాలోని ట్రోబ్రియాన్డ్ తెగల జీవిత విధానం పరిశీలించదగింది; వారి లైంగిక జీవనంలో విశేషమైన స్వేచ్ఛ ఆమోదించబడింది. సమాజంనుంచి అనేక రకాల అనుమతుల్ని పొంది, లైంగిక తృప్తిని పొందగలుగుతారు; వీటిల్లో ఒకొక్కప్పుడు సమూహ వివాహాలు—అంటే ఒకే స్త్రీతో పలువురు పురుషులు కాపరం చేయటం, లేదా, ఒకే పురుషుడు పలువురు స్త్రీలతో కాపరం చేయటం—కూడా కద్దు. ఐతే యీ విధమైన స్వేచ్ఛాజీవితమంటే త్వరలోనే మొహం మొత్తి, ఒక కుటుంబంగా, బాధ్యతాయుత జీవితాన్ని గడుపుతూ, ఆర్థిక సంపత్తిని అభివృద్ధిచేసుకొని, కుటుంబీకుల సహకారంతో ప్రశాంత జీవితాన్ని గడపటంమీద సహజంగానే వారు మనసుపడి, తమంతట తామే నీతిదాయకమైన వైవాహిక జీవితాన్ని గడిపేందుకు ఉద్యుక్తులవటం సర్వసాధారణం. దీన్నిబట్టి వివాహవ్యవస్థ కేవలం లైంగికమైనదే అని అనటం సాహసమే కాగలదు; ఎందుకంటే ఎంతో లైంగిక స్వేచ్ఛవున్న యీ సమాజంలో కూడా లైంగిక తృప్తినిమించిన దానికోసమై దాంపత్య జీవితానికి ప్రయత్నించటం స్పష్టంగా కనిపిస్తూనే వుంది కదా!

ఆదీగాక దాంపత్య జీవితం ఆరంభంకాగానే, దాంపత్యానికి-బైట లైంగిక వాంఛల్ని తీర్చుకోవటమనేది అనుమతించ బడదు; అంటే అంతకు పూర్వం వున్న

స్వేచ్ఛ అరికట్టబడింది. కనుకనే వివాహం సెక్సుకు సంబంధించిందే అనటం సంకుచిత దృష్టి అనక తప్పటంలేదు.

## చరిత్ర రచనలోని ఇబ్బందులు

వివాహ చరిత్ర రాయటంలో అనేక ఇబ్బందులుంటవి. వివాహమనేది ఏ ఒక్క జాతికి, లేదా తెగకు మాత్రమే సంబంధించింది కాదు. వివిధ సమాజాల వారు, వివిధ రీతుల్లో వివాహాలు చేసుకుంటున్నారు. వారి వారి జీవిత దృక్పథాల్లోనూ, ఆచార వ్యవహారాల్లోనూ ఎన్నో భేదాలు కనిపిస్తవి. ఒక దానికీ మరో దానికీ సంబంధం వుండదు. ఒక సమాజంలో నీతిగా పరిగణించబడేది, మరో సమాజంలో అవినీతిగా రూపొందుతోంది. ఈ కారణంవల్ల వివిధాభిరుచుల్నీ, వివిధ విధానాల్నీ తెలుసుకోవటం అవసరమౌతోంది.

ఇక శాస్త్రీయ దృక్పథానికి వొస్తే, సామాజిక శాస్త్ర దృష్టితోనే దాన్ని పరిశీలించటం వల్ల న్యాయం జరుగనేరదు. వివాహ జీవితానికీ శారీరక శాస్త్రానికీ వున్న గొప్ప సంబంధాన్ని ఎవ్వరూ కాదనలేరు; అంతకన్న నేటి విజ్ఞాన దృష్ట్యా చూస్తే మానసిక శాస్త్రప్రాధాన్యత అమోఘమనీ, దాని పలుకుబడికి తిరుగులేదనీ అర్థంగాక తప్పదు.

ఒకో ప్రముఖుని దృక్పథంలో ఒకో శాస్త్రీయ ప్రాముఖ్యత కనిపించే కారణంవల్ల భేదాభిప్రాయాలకు ఎంతైనా తావుంటుంది. వీటిని తెలుసుకోగలమే కాని, సాహసించి అందరికీ సరిపడే నీతిదాయకమైన వైవాహిక జీవితం 'ఇది' అని చెప్పలేము.

## వైవాహిక సమస్య : విస్తరణ

వివాహానికీ, వైవాహిక జీతానికి మాత్రమే వివాహం సంబంధించిందిగా కనిపించినప్పటికీ, చిలవలు పలవలుగా అనేక చిన్న సమస్యలు బయలుదేరక తప్పదు. ఉదాహరణకు—వివాహం కుటుంబ విస్తరణార్థమే ననుకున్నట్లయితే, మితిలేకుండా సంతానాన్ని బడయటం, కొత్త సమస్యల్ని తెచ్చిపెడుతుంది; ఆరోగ్య సూత్రాలకు భిన్నంగా జీవితాన్ని గడపటం, ఆర్థిక బాధల వొత్తిడి ఆరంభం కావటంతో సంతానాన్ని అరికట్టవలసిన అవసరం ఏర్పడుతుంది. దాంపత్యంనుంచి విరమిస్తే ఇది సాధ్యమనే స్వల్పవిషయం సంసారులకూ, లోకజ్ఞానంవున్న పెద్దల కందరికీ తెలిసిందేకాని, జీవ శాస్త్రరీత్యా లైంగిక తృప్తికూడా అవసరమే కాగలదు. ఈ రెంటినీ సమన్వయించుకోవాల్సిన అవసరం వుంది.

ఈ విధంగా కుటుంబాన్ని తగినంత పెద్దదిగా ఉంచుకొని తలకుమించిన భారమయేట్లు విస్తరించకుండా చూసుకోవాల్సిన కొత్త సమస్య ఉద్భవిస్తోంది

ఇది యీ నాటి సమస్య కానే కాదు. పురాతన మానవుణ్ని కూడా ఇది ఎదుర్కొంది. ఐతే ఆ నాటి మానవుడు యీ సమస్యను పరిష్కరించుకొన్న మార్గం వేరు: ఆనాడు బలాత్కార గర్భస్రావాల దగ్గర్నుంచీ, శిశుహత్యల వరకూ యీ సమస్యా పరిష్కారాలకు మార్గాలు. కాని మానవుడి మేధస్సు శతాబ్దాల తరబడిగా ఆలోచిస్తూ ప్రమాదకరమైన జీవిత విధానంనుంచి, శాంతిదాయకమైన జీవితానికి దారి తీస్తూనేవుంది. ఫలితంగా గర్భనిరోధక మార్గాలు అనేకం కనుగొనబడినవి. యీ విధంగా మానవుడు ప్రతిక్షణమూ సంస్కరించబడుతూ, నాగరికతలో పూసన చేస్తూనే వున్నాడు. విశాలంగా చూస్తే వివాహ చరిత్రలో గర్భనిరోధావశ్యకత కూడా చర్చించబడవలసే వొస్తోంది కదా!

ఇదే విధంగా విడాకులు. స్త్రీ పురుషులు తమ ఇష్టాయిష్టాలమీద ఏ విధంగా దాంపత్య జీవితాన్ని గడిపేందుకు సిద్ధపడుతున్నారో, అదే విధంగా వారు తమ ఇష్టాయిష్టాల ప్రకారం విడిపోవటం కూడా న్యాయం. ఇది సామాజిక శాంతికే కాకుండా, వారి సంతతికి రక్షణనూ, సుఖాన్నీ ఇవ్వగలదు. యీ స్వేచ్ఛ లేని దాంపత్యం ఒక నరకమే అవుగలదు. కనుక విడాకులుకూడా వివాహ చరిత్రలో ప్రాముఖ్యతను ఆక్రమిస్తుంది.

వివాహ పద్ధతిని సమాజం ఏర్పరచగానే సరికాదు; అనేక విషయాలు అనుకూలిస్తేనే కాని యీ వ్యవస్థలో ప్రవేశించి, సభ్యులై జీవితాన్ని గడపటం కుదరదు. ఉదాహరణకు ఆర్థిక దౌర్బల్యం. ఒక పురుషుడు ఒక స్త్రీని జీవితాంతం పోషించే స్థితిలో లేడనుకుందాం; అలాటప్పుడు అతను దాంపత్య జీవితంలోకి జొరబడలేడు. ఐతే అతని కామవాంఛలు స్వభావ సిద్ధంగా తీరవలసిన అవసరాన్ని పొదిలించుకోనూ లేడు.

ఇలాటి పురుషుల మధ్య వున్న స్త్రీకికూడా వివాహార్హత ఉండదు. పురుషుడు తన పోషణ భారాన్ని స్వీకరించే స్థితిలో లేకుండటమే కారణం. వీరిద్దరూ దూర దూరంగావుండి జీవితాల్ని గడపాల్సి వొస్తోంది. ఆమె కామవాంఛలు కూడా తీరవలసిన జీవ శాస్త్రీయ అవసరం ఉండనేవుంది. ప్రకృతే స్త్రీకి పురుషుని అవసరాన్నీ, పురుషునికి స్త్రీ అవసరాన్నీ ఏర్పరచింది. యీ అవసరాలు తీరేందుకు సామాజిక చట్టాలతో సరిపెట్టుకోలేని వారి గతి ఏమిటి? వారు తమస్వంత మార్గాల్ని అన్వేషించి అమలు జరుపుకో సాగుతారు.

కొన్నాళ్ళపాటు కలిసి జీవించటం, లేదా అతను ఆమెను 'ఉంచుకోవటం' ఒక పద్ధతి. ఇందులో కలగబోయే సంతానం తాలూకు ప్రస్తావన లేదు. ఆ సంతానం తల్లికే సంబంధించి వుంటుంది. తనతో దాంపత్యాన్ని నిర్వర్తించినందుకు పురుషుడు ధన రూపమైన ప్రతిఫలాన్ని ముట్టచెపుతాడు; దానికీ తాను పొందిన లైంగికానందానికే సరి! ఆ పై బాధ్యతలు అతనివి కావు.

ఏ పురి స్త్రీకి తగినంత ఆర్థిక సంపత్తీ, వ్యక్తిత్వమూ లేని సమాజాల్లో, స్త్రీకి ఆధారంగావుండే పురుషుడు అత్యవసరం. స్వతంత్రంగా ఒక పురుషుడు, తాత్కాలికంగానే అవునాక, ఆమె పోషణ భారాన్ని వహించలేనప్పుడు, ఆమె పలువురు పురుషులకు దాంపత్య సౌఖ్యాన్నిస్తూ, ఆ పురుషులందరి సహాయంతోనూ జీవితాన్ని వెళ్ళబుచ్చక తప్పదు. విశాలంగా చూస్తే పురుషులు సహకారపద్ధతిన స్త్రీని పోషిస్తున్నారు. యీ విధంగానే వ్యభిచారం పాకింది. వ్యభిచారమనేది వివాహ చరిత్రకు బాహ్యమైన దనుకోవటం శుద్ధ పొరపాటు. దూరం ఆలోచిస్తే వ్యభిచారం వివాహ చరిత్రలో ఒక భాగమే అవుతోంది!

యీ వ్యభిచారం కూడా వ్యక్తిగత సమస్యే అనుకునేందుకు వీల్లేదు. వ్యక్తులు సామాజిక సభ్యులే కనుక, వారి సమస్యలు సమాజానికి సంబంధించే ఉండక తప్పటం లేదు. యీ వ్యక్తులు సామాజిక కట్టడుల్ని అతిక్రమించినప్పటికీ, ఎన్ని చట్టనిబంధనలు ఉన్నప్పటికీ, వారి కోర్కెలూ, వాటిని రాజమార్గాన తీర్చుకోలేక, దొంగదార్లలో తీర్చుకోవటం మొదలైనవి, జీవశాస్త్ర అవసరం కనుక, దాన్ని మార్చేందుకు మానవుల శక్తి సామర్థ్యాలు దమ్మిడీకి పనికిరావు. అందుకని వ్యభిచారాన్ని సమర్థించటంకానీ, ప్రోత్సహించటంకానీ అసలే కుదరదు. వ్యభిచార వ్యాపారం నాగరికతతోపాటే అభివృద్ధి చెందసాగాక, అది తెచ్చిపెట్టే అనేక కొత్త సమస్యలు వొచ్చినవి. అనాథ బాల బాలికలూ, సుఖవ్యాధుల విస్తరణ, అవినీతి ప్రోత్సహించబడటం మొదలైనవి సమాజాన్ని ఎదుర్కొంటూన్నవి. వీటిని ఎదుర్కోవాలంటే ఆ యా వ్యక్తులకు రాజమార్గాల్ని ఏర్పరచాలి. అంటే ఆర్థిక స్థాయి పెరిగితీరాలి. ఇది మాటలతో అయేది కాదు. ఇది జరగకుండా వేదికలెక్కి ఎంత వాగినా, ఎన్ని నీతుల్ని ప్రచారం చేసినా ప్రయోజనం లేదు.

ఏనాడైతే సమాజం యీ వ్యక్తిగత కామవాంఛల్ని గౌరవించి, అవి తీరేందుకు తగిన అవకాశాల్ని కలిగించలేదో, ఆ నాడు నోరు మూసుకోక తప్పదు కూడాను. చట్టాలులేకా, సామాజిక కట్టడులులేకా, అవి తెలియకా మానవులు నేరాలు చేస్తున్నారనుకోవటం ఆత్మవంచనే కాని మరోటికాదు. ఇదంతా తెలిసే ఎందుకు వీళ్ళందరూ పొరబడుతున్నారనే ప్రశ్నవొస్తే, మానవ నిర్మిత చట్టాలకన్న ప్రకృతి సిద్ధమైనవి అతి బలవత్తరమనే సత్యం కళ్ళముందు కనిపిస్తుంది. నదీ ప్రవాహాన్ని మరల్చ వొచ్చేమోకాని, దాన్ని సముద్రంలో పడకుండా అరికట్టటం ఎవడి తరం? అందుకని వ్యభిచారాన్ని సమాజం బాహాటంగా ఒప్పుకోనూ లేదు, సమాజం తీర్చలేని సమస్యల్ని ఎవరికి వారుగా తీర్చుకోకాతప్పదు. ఇందువల్ల సమాజానికి బాధ్యతలు తగ్గుతూన్నవి. వ్యభిచారంలో పాల్గొనే వ్యక్తులు, వారు చెడినప్పటికీ, మిగతా సమాజాన్ని చెరపటం లేదు; అదీ వారి వ్యక్తిగత సౌకర్యార్థం జరుగుతోంది. ఏ వ్యక్తికి ఆ వ్యక్తి-సుఖపడ గలుగుతే, సమాజమే సుఖంగా వుండగలదనే సూత్రాన్ని వారు ఒకపక్క నిరూపిస్తూనే వున్నారు...ఇక వాతావరణం అనుకూలంగా వున్న

ట్లయితే వారుకూడా సమాజం ఆమోదించే దాంపత్య జీవితాన్నే అనుసరి స్తాండేవారు.

## వివాహాలు : మనస్తత్వ శాస్త్రం

వివాహానికీ మనస్తత్వ శాస్త్రానికీ చాలా దగ్గిర సంబంధం వుంది. వివాహాన్ని సామాజిక, ఆర్థిక, శారీరక, నైతిక దృక్పథాల్లోనే గాకుండా మానసిక దృక్ప థంలో కూడా చర్చించవలసిన అవసరం వుంది. లోకజ్ఞానంతో చూస్తే దాంపత్య జీవితంలో మానసిక పరిణామాలే అనేక సంచలనాల్ని కలిగించేందుకూ, సుఖపెట్టేం దుకూ కారణభూత మౌతూన్నవి.

శారీరక సౌందర్యం కంటికి ఇంపుగా ఉన్నప్పటికీ మానసికంగా పరిపక్వ దశ రానిదే, ఆ దాంపత్యం సుఖపడదు. స్త్రీ పురుషులు ఒకరినొకరు ఆకర్షించు కోవటం మొదటి మెట్టులో శారీరకమే అవుగాక; కాని దానికొక విశిష్ట రూపా న్నిచ్చి మానసిక పరిణామాల్ని సమన్వయించుకొండే పరిపక్వమవదు. యీ కారణం గానే వివాహానికి ముందు 'వలపు పెంపు' (Courtship) అవసరమనే దాన్ని అనేక సమాజాలవారు ఒక ఆచారంగానే అమలు జరుపుతున్నారు.

ఇక దాంపత్య జీవితరంగంలో, లైంగిక విషయాలమీదా, దాంపత్య నిర్వ హణ మీదా రాయబడిన పుస్తకాలన్నిటిలోనూ స్త్రీని రతికి సిద్ధంచేయండే ముట్ట రాదనే సూత్రం విధిగా చెప్పబడింది. మేరీ స్టూప్స్ కూడా యీ విషయాన్ని అనేక సార్లు నొక్కి చెప్పింది: స్త్రీ దృష్ట్యా ఆమె చెప్పగలిగిన యీ నగ్నసత్యాన్ని ఎవ్వరూ కాదనలేరు. ఐతే ఆమెను రతికి సిద్ధంచేయటమంటే శారీరకమైన వల పునే గాకుండా, మానసికంగా కూడా ఆమె స్థితిని మార్చవలసి వుంటుంది. ఇది జరగనట్లయితే శారీరకంగా అంగ నిర్మాణ విధానంలోని అనుకూలతవల్ల ఆమె రతికి సిద్ధంగా వుండి, పురుషునికి కామతృప్తిని ప్రసాదించగలిగి నప్పటికీ, నిశ్చలంగానే ఉండిపోతుంది: ఇందువల్ల యోనిలో రతికి అనుకూలంగానూ, సుఖంగానూ ఉండేట్లు చేయగల ద్రవాలు వెలువడవు; బాధాకరంగా కూడా ఉంటుంది. అంతే గాకుండా ఆమె లైంగిక యంత్రాంగం గర్భధారణకు అనుకూలతను చూపదు. యీ ఇబ్బందులన్నిటినీ గడవాలంటే మానసికమైన పరిణామం ఆమెలో రావాల్సిన అవ సరం వుంది.

## చరిత్రకారుడు : శాస్త్రవేత్త

వివాహ చరిత్రను రికార్డుచేసిన చరిత్రకారులు కేవలం చరిత్రనే లిఖించారు కాని, దాన్ని గూర్చిన చర్చలు జరపలేదు; కొద్దిమంది ఆ పనిచేసినా, వారు మానసిక శాస్త్ర దృక్పథానికి ప్రాముఖ్యత ఇవ్వలేదు. ఐతే మానసిక శాస్త్రం అధునాతన ప్రపంచంలో ఒక గొప్ప శాస్త్రంగా పరిణమించి సామాజిక జీవనంలోనేమి, వైద్య

శాస్త్రంలో కూడా నిత్య జీవితమంతటా ఒక విశిష్ట స్థానాన్ని సంపాయించుకుంది. ఇక ఇప్పుడు మనం తెలుసుకునే వివాహ చరిత్రలో మానసికశాస్త్రం కొంతవరకు పాలు కూడా ఉండి తీరవలసిందే!

మానసిక శాస్త్రాన్నిగూర్చి ఇంత గొప్పగా చెప్పుకోవాలిస్న, అవసరం ఏమున్న దనే సందేహం కొంతమందికి పాఠకులకు కలగవొచ్చు. ఉదాహరణగా, కొన్ని కొన్ని సమాజాల్లో నేటికీ యీ డేరిన ఆడపిల్ల, మొట్టమొదట రతి సౌఖ్యాన్ని నిజభర్త నుంచి గాక, పరపురుషుని నుంచే పొందే ఆచారాన్ని తీసుకుందాం. చరిత్రకారుడు యీ ఆచారాన్నిగూర్చి మాత్రమే రాస్తాడు కాని, ఇది ఎందుకు, ఎలా ఏర్పడివుంటుందో చర్చించడు. విజ్ఞానం అభివృద్ధి చెందిన యీ రోజుల్లో ఆచారాన్ని చెప్పినంత మాత్రాన పఠిత కుతూహలం తీరదు; దాన్ని శాస్త్రీయ దృక్పథంలో చూపి చర్చించక తప్పదు. కారణాలు దొరక్కపోతే మూఢనమ్మకం కింద వేస్తాడు; కాని ఆ పూర్వీకులకు యీ నాటి శాస్త్రీయ విజ్ఞానం లేనప్పటికీ, వారి అనుభవం లోకజ్ఞానం ఉండనే ఉన్నవి. వాటి సహాయంతో అతని ఆలోచనలు ఎలా పరిణమించి ఉంటవో చెప్పగలం కదా!

ఐదే చరిత్రకారునికి ఈమానసికశాస్త్రంతో తగినంత పరిచయంలేని కారణంగా దాని జోలికి పోకపోవచ్చు. ఒక శాస్త్రకారుడు దాన్ని శాస్త్రీయంగా చర్చిస్తాడు.

ఉదాహరణకు పై ఆచారం - ఒకని భార్యతో పరపురుషుడు పొందే మొదటి రతి సౌఖ్యం — తీసుకున్నట్లయితే, ఫ్రాయిడ్ తన అభిప్రాయాన్ని యీ కింది విధంగా వెల్లడించి, ఆ ఆచారాన్ని ఆయా సమాజాలవారు ఎందుకు సమర్థించి అమలు జరుపుతున్నారో మనం తెలుసుకునే అవకాశాన్ని కలిగిస్తున్నాడు:

స్త్రీ పురుషుల మొదటి కలయికలో స్త్రీ పొందే మానసిక పరిణామం చాలా విచిత్రంగా వుంటుందనే భావన ఆవాడు కాదు, యీనాటికీ వుంది. యీ మొదటి కలయికలో తగిన జాగ్రతలు తీసుకోనట్లయితే, ఆమె భయపడి పోవటం, ఆ పురుషుడు దాంపత్య సౌఖ్యానికి దూరమవటం జరుగుతుంది కనుక, అతన్ని హెచ్చరించే కామసూత్రాలనుగూర్చి శాస్త్రకారులందరూ హెచ్చరికలు చేసేవున్నారు. సర్వసామాన్యంగా స్త్రీ మొదటి కలయికలో భయపడుతుంది. చిన్నతనంనుంచీ ఆమె పొందిన శిక్షణ, ఆమెను పాపకార్యంవైపు పోనీక, మానసికంగా కుంగదీస్తుంది అలాటి సమయంలో పురుషుడు ఎంత తెలివిగా ప్రవర్తించినా, ఆమె తృప్తికన్న అధికంగా గాబరా పడుతుంది. అదీ, అనుభవంలేని వాడైతే, భయపడిపోయి, ఉత్తరోత్తరా రతి విముఖతను ప్రదర్శిస్తుంది. దాంపత్య సౌఖ్యం భగ్నంకాకుండా, యీ మొదటి కలయికలోని ఇబ్బందుల్ని వేరొకనికి అప్పగించటం మంచిదనే అభిప్రాయంలోనే యీ ఆచారం ఉద్భవించింది.

ఐతే యీ ఆచారం నేటి నాగరికతలో అవినీతిగా భావించబడుతోంది. కన్యను గూర్చిన ఆనాటి మానవుడి అభిప్రాయానికీ, యీనాటి మానవుని అభిప్రాయా

నికీ చాలా భేదంవుంది. ఆనాటి మానవుడు కన్యకు విలువ నివ్వలేదు. ఆమెను తనదాదాన్నిగా చేసుకు నేందుకు శ్రమపడి, తెలివిగా ప్రవర్తించేందుకు ప్రయత్నించలేదు; ఆనాడు సమాజంలో ఎంతో లైంగిక స్వేచ్ఛ ఉండటం ఒక కారణంకావొచ్చు. ఇక యీ నవనాగరికతలో 'నీతి' కి వున్న అర్థాలే తారుమారైనవి. శీలం ప్రధానమైంది; కన్యకే విలువ హెచ్చింది.

ఇక్కడ మనకొక సందేహం రావొచ్చు. ఆనాటి మానవుడు ఇంత తెలివిగా ఆలోచించే ఇలాటి ఆచారాన్ని అమలు జరిపాడా? కాకపోవచ్చును; యీనాటి శాస్త్రీయ దృక్పథంలో దాని అసలు రూపే వేరువిధంగా కనిపించనూవచ్చు. ఐతే ఆనాటి మానవుని అనుభవం లేకపోలేదు; దీనికితోడు మరికొన్ని మూఢనమ్మకాలు కూడా ఉన్నవి.

పైన చెప్పుకున్న ఆచారం ప్రపంచంలోని అనేక సమాజాల్లో వేరువేరు రూపాల్లో వుంది. ఆనాటి మానవుడు కన్యతో కలవటంలో ఏదో గొప్ప ప్రమాదం వున్నదనే భావనలో ఉండేవాడు; యీ ప్రమాదాన్ని పారద్రోలి, దాన్ని తట్టుకో గలిగిన వీరులు కొంతమంది ఉండేవారు. సామాన్యులు యీ వీరుల సహాయాన్ని అర్థించటం జరిగేది. యీ వీరులు మంత్ర తంత్ర సహాయంతో కన్యాత్వాన్ని భంగం చేసిన ప్రమాదాన్నుంచి తమను తాము కాపాడుకో గలిగి ఉండేవారు.

యీ నాడుచూస్తే ఇదంతా మానసికపరిణామమే కాని వేరుకాదనే సత్యం బైటపడకమానదు. ఇక దాంపత్య జీవితంలో మన స్తత్వ శాస్త్రానికి ప్రముఖస్థానం వుందనే సంగతి అనుభవజ్ఞులందరికీ తెలిసిందే కదా!

## వివాహచరిత్ర : పరిణామాలు

వివాహచరిత్రలో శతాబ్దాల తరబడిగా ఎన్నో పరిణామాలు వొచ్చినవి; ఇప్పటి కివి పరిపూర్ణ రూపాన్ని పొందినవనీ ఉత్తరోత్రా మార్పులు రావనీ అనుకోవటం శుద్ధ పొరపాటు. ఒకో తరంలో ఒకో గొప్పమార్పు అవతరిస్తూనే వుంది. గత మూడు నాలుగు దశాబ్దాలలోనూ విధవా వివాహం సంఘ సమ్మతంగా మారిన సంగతి మనకు కొత్తకాదు! కనీసం 40 సం. ల క్రితం విధవా వివాహానికి సంఘ బహిష్కృతే శిక్షగా వుండేది; అలాటిది యీనాడు విధవా వివాహాన్నిగూర్చి ఎవరూ పట్టించుకోకుండా చాలా సామాన్య విషయంగా చూస్తున్నారు.

ఇలాగే ప్రతి తరంలోనూ నూతన భావాలువొచ్చి, ఒకోరకం విప్లవం జరిగి, గొప్పమార్పు వొచ్చిపడుతూనేవుంది. 18-వ శతాబ్దంలో స్విజర్‌లండ్‌లో రేనూ అనే ఆయన 'వలపు వివాహాల్ని' ప్రవేశపెట్టాడు; అదే శతాబ్దంలో ఆయన కృషికి నొవలిక్రి అనే ఆయన దోహదం చేశాడు; పూర్వపు జానపదగేయాల సారాంశాన్ని నిత్య జీవితంలోకి లాక్కొచ్చాడు. సమాజమంతా అట్టుడికినట్టు ఉడికిపోయి యీ కొత్త ప్రణయోపాసకుల్తో కల్లోలిత మైంది.

కనుక వివాహచరిత్రలో యీనాటివరకూ వొచ్చిన, వొస్తూన్న మార్పుల్ని కూర్చి స్థాలీపులాకన్యాయంగా మాత్రమే చర్చించేందుకు వీలవుతుంది.

## వివాహచరిత్ర : భావిపరిణామాలు

ఐతే ముందు జరిగే, మార్పులకు ప్రాతిపదిక యీ నాటి వివాహచరిత్ర రూపమే ఐవుండాలి కదా! తెలివిగా పరిశీలించినట్లయితే ముందురాబోయే మార్పులు ఎలా ఉంటవనేదికూడా కొంతవరకూ అర్థంగాకమానదు. జీవితసత్యాలను విస్మరించి అర్థంలేని ఆచారాల నడుమ స్వభావసిద్ధమైన వాంఛల్ని అరికట్టే ప్రయత్నాలనుంచి, మానవుడు తిరుగుబాటుచేసి గెలుచుకోవటాన్ని ప్రపంచ చరిత్ర చెప్తూనేవుంది; ఇది వివాహంలోకూడా జరిగి తీరుతుందనేది ఎవ్వరూ కాదనలేరు.

వివాహ చరిత్రలోని ముఖ్యమైన మార్పులకు, విడాకులపద్ధతీ, దాన్ని చట్టసమ్మతంచేసిన నాగరికతా కారణం. పూర్వంవలె ఇష్టంవున్నా లేకున్నా ఆ దాంపత్యాన్ని నిర్వహించవలసిన అవసరం లేకుండా వ్యక్తి స్వాతంత్ర్యానికి ప్రాముఖ్యతను ఇచ్చి విడాకుల అవసరాన్ని యీ నాగరికత కలిగించింది. ఏదేశంలో ఐతే విడాకుల పద్ధతిలేదో, దాన్ని యీనాడు నాగరికతవున్న దేశంగా మనం గుర్తించటం లేదు. యీ మార్పు వొచ్చేందుకూ, సమాజ దృక్పథం మారేందుకూ కొన్ని శతాబ్దాలు పట్టింది.

ఒకే జాతిలోని మనుషుల భావాలూ, ప్రవర్తనలూ, తత్వాలూ ఒకేమాదిరిగా వుండవు, ఇద్దరు వ్యక్తులవి ఎంతో భేదిస్తవి. యీ భేదం పెరిగినకొద్దీ వారి సంబంధ బాంధవ్యాలు తృప్తికరంగా ఉండనేరవు. వివిధాభిప్రాయాల సమీకరణే నాగరికత సాధించవలసిన ఘనకార్య మనుకుంటే, ఒకవేళ అది సాధ్యం కానప్పుడు వ్యక్తిగౌరవాన్ని కాపాడవలసిన అవసరం ఏర్పడుతుంది. నిత్య జీవితంలో వివాహానికి వుండే ప్రముఖస్థానం విడాకులకూ ఉండక తప్పలేదు కనుక, దీన్నికూడా వివాహ చరిత్రలో జేర్చవలసిన అవసరం వుంది.

## దేశపరిస్థితులు : వివాహం

వివాహ విధానాల్లోనూ, నైతిక జీవనంలోనూ ఒక్కసారిగా వొచ్చిపడే మార్పులకు రాజకీయాలు పెద్ద కారణం. ప్రభుత్వాలు తల్క్రిందులై, కొత్త ప్రభుత్వాలు స్థాపించబడగానే, కొత్త చట్టాలు అమలు జరుగుతున్నవి. ఇంగ్లండ్‌లో జరిగిన రిఫర్మేషన్ మువ్‌మెంటూ, ఫ్రెంచి విప్లవం, రష్యన్ విప్లవం - ఇవన్నీకూడా వివాహ దృక్పథాల్ని మార్చివేసినవి.

ఇక ఇండియాలో, మొగల్ సామ్రాజ్యం స్థాపించబడినప్పుడు నిత్యజీవితాల్లో జరిగిన మార్పులే వివాహాల్లోకూడా ప్రవేశపెట్టబడినవి. కన్యను ఎత్తుకొనిపోయి,

రాక్షస వివాహంచేసుకునే ఆచారంవున్న ఆరోజుల్లో, మహమ్మదీయులు హిందూ కన్యల్ని దొంగిలించకుండా ఉండేందుకు, బాల్యవివాహాలు జరపటం ముమ్మరంగా సాగినదని చరిత్రకారులు అభిప్రాయ పడుతున్నారు. ఒకపక్క రాక్షస వివాహం చట్టమ్మతమైనప్పటికీ, ఆ నీతిని కంట్రోలు చేసేందుకు మెడలోని మంగళసూత్రానికి గొప్ప విలువ ఇవ్వబడింది. ఆ తరువాత ఇండియాలో బ్రిటిష్ పరిపాలన ఏర్పడిన తర్వాత, మళ్లీ మార్పులు ఆరంభమైనవి. సహగమనంలాంటి దురాచారాల్ని చట్టం ద్వారా నిరోధించారు; చివరకు బాల్య వివాహాల్నికూడా రూపుమాపే చట్టాలు చేశారు. మానవుడు ముందుకు సాగుతూన్నకొద్దీ ఏ దేశంలో కానీ యీ మార్పులు రాక మానవు.

## వివాహం : విడాకులు

ఈ మార్పుల్లో అతి ముఖ్యమైనది విడాకులు. నాగరికత బలిసిన దేశాలన్నిటిలోనూ వ్యక్తి స్వాతంత్ర్యాన్ని గుర్తించి అమలు జరపడం అవసరమైంది; ముఖ్యంగా గత అర్థశతాబ్దంలోనూ స్త్రీలు సాధించిన యీ స్వాతంత్ర్యం అపారం. వైవాహిక సంబంధం ద్వారా స్త్రీ జీవితాంతం బానిసగానే పురుషుని దయాధర్మాలను అర్థిస్తూ పడివుండవలసిన అవసరం లేకుండా ఆమె తనంతట తానుగా బతకగలిగిన తాహతును సంపాయించింది.

స్త్రీ విద్య ప్రతి నాగరిక దేశంలోనూ ప్రోత్సహించబడింది. ఆమె పూర్వంవలె పరదాలచాటున ఉండకుండా బాహాటంగా ఉద్యోగ సద్యోగాలు చేసి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించింది. ఐతే ఆమెకు పురుషుడు అవసరంలేకుండా చేసేందుకు ప్రకృతి సమ్మతించదు. కనుక వివాహ బంధనంద్వారా, మళ్ళీ ఆమె పురుషునితో కలిసి జీవించవలసిన అవసరం ఉండనే వుంది. కాని పూర్వంవలె తన తక్కువతనంలో కాకుండా, పురుషునితో సరిసమాన స్థానంలోనే జీవించగలిగే అవకాశాల్ని నాగరికత ప్రసాదించింది.

ఈమె స్వేచ్ఛను గుర్తించే పురుషుడు కూడా తనదురహంకారాన్నీ, అధికారాన్నీ,చలాయించటం తగ్గింది. అథవా ఇద్దరికీ పొత్తు కుదరకుంటే రభసలేకుండానూ, సంతానానికి హాని జరగకుండానూ విడిపొయ్యే అవకాశాల్ని నాగరికతను ఆరాధించే ప్రభుత్వాలు చట్టాలద్వారా ఏర్పరిచినవి. అంతే గాక యీ విధంగా విడాకులు పొందిన స్త్రీల సామాజికస్థానం, విలువ తగ్గకుండా కాపాడినవి. ఉభయుల అంగీకారంమీదా, వివాహాన్ని రద్దు చేసుకోవటం చాలా తేలిక. ఇందువల్ల వివాహమనగానే ఏదో శాశ్వితమైన గుదిబాడ అనీ, గొప్ప బాధ్యత ఇష్టమున్నా లేకున్నా మోయవలసి వుంటుందనే భావం పోయి, వివాహమాడటం ఎంత తేలికో, విడిపోవటం అంత తేలిక, కనుక బాధ లేనిదిగా తయారైంది.

ఐతే విడాకులు ప్రవేశపెట్టబడ్డాక, వైవాహిక జీవితంపట్ల తేలికభావం ఏర్పడిందనీ, అందువల్ల నైతికంగా మానవుడు దెబ్బతింటున్నాడనే అభిప్రాయం కొంత మందిలో వుంది. అందుకనే యీ విడాకులు తేలిగ్గా సాధించేదికాకుండా, కాస్త చుట్టుతోవలోనూ, సరైన కారణాలు ఉండేట్లు చేయవలసిన అవసరం వుందనే భావం పీడిస్తుంది. కాని విడాకులకు అడ్డంకుల్ని కలిగించటం ఎంత న్యాయమో, వివాహానికి కలిగించటంకూడా అంత అవసరమనే విషయం నిర్వివాదం; యీ పద్ధతి వల్ల త్వరపడి కాలుజారటం, సరిదిద్దుకోవటమనేది, సక్రమమైన ఆలోచన మీదనే జరిగే అవకాశం ఏర్పడి, విడాకుల సంఖ్యను తప్పక తగ్గిస్తుంది.

## వైవాహికజీవనం : ఇబ్బందులు

వివాహానికి ముందుగా ఎంత జాగ్రత్తగా, అనుభవ పూర్వకంగా ఆలోచించినప్పటికీ ప్రతి వివాహము మధురమైనదిగా తయారవుతుందనలేము. వివాహానికి ముందుగా ఎంత పరిచయంవున్నా, ఒకళ్లనొకళ్లు ఎంత బాగా అర్థంచేసుకున్నామనుకున్నా, తీరా దాంపత్యంలో ఏర్పడే విభిన్న దృక్పథాలూ, తత్వాల కలయికలూ రగిలే ద్వేషాలూ మొదలైనవి వారిద్దరికీ అనేక ఇబ్బందుల్ని తెచ్చిపెడుతవి. క్రమంగా యీ దూముడి, పీటముడిగా మారకముందే, ఉభయుల అంగీకారంమీదా విడిపోవటం తప్ప మరో మంచిమార్గంలేదు.

విశాల దృక్పథంలో చూసినట్లయితే, ఇలాటి పెళ్లిళ్లు బొమ్మల పెళ్లిళ్లవలెనే కనిపించి, ఇష్టాయిష్టాల ప్రకారం కలవటం విడిపోవటం జరుగుతోందనిపిస్తుంది. ఉంపుడుకత్తెల వ్యవహారానికీ దీనికీ పెద్ద తేడా వున్నట్లు కూడా తోచదు. వైవాహిక జీవిత పవిత్రత భగ్నమైందని తల బాదుకొనే పెద్దలున్నప్పటికీ, యీ మార్పుల్ని ఎవ్వరూ ఆటంకపరచలేరు; ఎందుకంటే అవసరార్థం, మానవుడు ఏదో విధంగా తన జీవితాన్ని సుఖమతం చేసుకునే ప్రయత్నాలలో ఇదొకటి. పోగా సమాజానికి మిగిలిందల్లా, తాత్కాలిక దాంపత్యాల్ని కూడా గుర్తించి, ఆ సంతానాన్ని కూడా సమాజంలో స్థానాన్ని కలిగించటమే!

## స్త్రీ పురుషుల ఆకర్షణ : దాంపత్య జీవనం

వైవాహిక కర్మకాండ లేకుండానే ఏర్పడే దాంపత్యాలకు సమాజికులు బాహాటంగా ఖండించినప్పటికీ, చాటుగా ఆమోదిస్తూనే వున్నారు; వారు ఖండించినంత మాత్రాన అవి రూపు మాయవు. లోగడ చెప్పుకున్నట్లు స్త్రీ పురుషుల సమస్యలు రాజమార్గాల తీరక దొంగదార్లబడినవి.

తమాషా ఏమంటే స్త్రీ పురుషుల ఆకర్షణ అనేక సందర్భాల్లో, అనేక కోణాలమీద వుంటుంది. వీటిల్లో 'వయస్సు' ను తీసుకునేట్లయితే, సర్వసామాన్యంగా స్త్రీ కానీ పురుషుడు కానీ తనకన్నా కాస్త పెద్ద వయస్సులోవున్న విరుద్ధ

జాతి వ్యక్తితోనే కామతృప్తిని వాంఛిస్తాడు. ఇది స్వభావ సిద్ధమైన వాంఛేననాలి. దీనికి కారణం, తనపాటి అనుభవమే ఉన్న వ్యక్తినుంచి తాను పొందగలిగిన అనుభవం ఎలా వుంటుందో తెలుసాయె; పోగా తన కుతూహలాన్ని తీర్చి, అనుభవం ద్వారా పొందే ఆనందాన్ని పెంపొందించేందుకే, వయస్సులో పెద్దవాళ్ళ మీదనే మొదట్లో మనసు పోవటం స్వభావసిద్ధ మవుతోంది.

ఇందువల్ల కొంత లాభమే జరుగుతోంది. అనుభవజ్ఞురాలైన స్త్రీ, యువకుడికి కామతృప్తి నివ్వటంలోనూ, అతని మనస్తత్వాన్ని ఓపిగ్గా అర్థం చేసుకొని అనుగుణంగా ప్రవర్తించటంలోనూ ప్రజ్ఞ చూపగలదు. ఇక తనకన్నా వయసులో పెద్దయిన పురుషుని నుంచి కూడా ఆడపిల్ల దాంపత్య రహస్యాల్ని తెలుసుకునేందుకు ఉత్సాహ పడుతుంది. తన యీడు యువకునివల్ల ఆమె 'షాక్' కావొచ్చు; లేదా హానికరంగా అతను ప్రవర్తించ వచ్చు.

ఐతే ప్రతి సందర్భంలోనూ పైన చెప్పింది కాచి వడబోసిన సత్యంగా నిలవ గలుగుతుందని చెప్పలేము. ఒక శతాబ్దంక్రితం కామశాస్త్రం కూలంకషంగా, అనుభవ పూర్వకంగా తెలిసిన ఒకానొక జమీందారిణి ఇలా రాసింది: 'దాంపత్యం సుఖమయంగా ఉండటమే చాలదు; తన భావాల సౌకుమార్యాన్నీ, తాను కలిగించే ఉద్రిక్తతనూ స్త్రీ, తాను ప్రేమించిన పురుషునిలో చూడగలగాలి. వయస్సులో పెద్దవారైన వారు, ఢక్కాముక్కీలు తిని ఉండటంవల్ల, యీ చిల్లర వేషాల్ని గమనించరు; వారిలోని సౌకుమార్యం మొద్దుబారి వుంటుంది; ప్రియురాలు సృష్టించేందుకు ప్రయత్నించే కలల్ని, కలలుగానే తెలుసుకుంటూ హేళన చేసేందుకూడా సిద్ధంగా వుంటారు; ఇందువల్ల ఆమె గాయపడుతుంది; పెద్దల భావమల్లా స్త్రీ కామతృప్తినిచ్చే ఒక సాధనమని! దీన్ని వారు రకరకాలుగానూ, ఎంతో నిర్లక్ష్యంతో బైట పెట్టేందుకు సాహసిస్తారు. కనుక స్త్రీకి నిజమైన ప్రణయానుభవం, గాల్లో తేలిపోతున్న స్వర్గదృశ్యం, తన యీడు యువకుని ద్వారానే రావాలి!'

స్థూలంగా చెప్పాలంటే ప్రణయానుభవంలో అనుభవం అత్యవసరమైన వస్తువు. అందుకని వయసులో పెద్దలనుంచే ప్రాథమిక సత్యాలను నేర్చుకోవటం అత్యవసరమౌతోంది. దీన్ని గుర్తించే కొన్ని సమాజాలవారు లైంగిక విజ్ఞానాన్నీ, అనుభవాన్నీ వయసులో పెద్దలనుంచే ముందుగాపొందే ఏర్పాట్లుచేసి అమలు జరుపుతున్నారు. (చూ॥ లైంగిక విజ్ఞానం)

ఐతే ఇలా మొదట్లో సంపాయించిన యీ అనుభవమే శాశ్వత సంబంధంగా ఉండాలనే అభిప్రాయాన్ని ఎవ్వరూ ఒప్పుకోలేరు. ఆ మొదట్లో వుండే ఇబ్బందుల్ని విడిచినట్లయితే ఉత్తరోత్రా ఆ యువతీ యువకులు, తమ అనుభవాల సహాయంతో శాశ్వత సంబంధాన్ని ఏర్పరుచుకొని, కలకాలం సుఖపడే అవకాశం వుంటుంది.

## దాంపత్యం : స్థూల వివరణ : పరిణామం

పైన చెప్పుతున్నదాన్నిబట్టి ఆలోచించినట్లయితే, వివాహానికి అవసరమయ్యే మంత్ర తంత్రాలూ, వాగ్దానాలూ, ప్రేక్షకులూ, రంధోళ్లూ మొదలైన వాటి విలువ నిజానికి ఏమీ ఉండదనేది నిత్యజీవిత సత్యంగా పరిణామం చెందుతోంది. అంత రాంతరాల్లో లేని అనేక భావాల్ని బాహ్యప్రపంచం నుంచి ప్రవేశపెట్టాలని చేసే ప్రయత్నాలు ఫలవంతం కానేరవు. పైకిమాత్రం సామాజిక జీవనంలో తలొంచి నట్లు కనిపించినా, క్రమంగా ఒకేవ్యక్తి రెండురకాల విరుద్ధ జీవితాలను గడపవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. యీ పరిణామం పోను పోను చట్ట సమ్మతమైన దాంపత్యం అనేది ఏదో 'మాట వరసకు' అన్న ధోరణిలోకి లాగుతుందని తోస్తుంది. ఇంత వరకూ దాంపత్యం వ్యక్తిగత కామవాంఛలు తీరే దృష్టిలో చూస్తున్నాం.

ఇక రెండోవైపు చూస్తే కొత్త బాధ్యతలూ, కొత్త సమస్యల్ని దాంపత్యం సృష్టిస్తుంది. అదే సంతానప్రాప్తి, వంశోద్ధారణ, సమాజానికి వ్యక్తుల కామవాంఛల మీద తగినంత కంట్రోల్ లేనప్పటికీ, యీ సంతానం సమాజానికి ఒక గొప్ప సమస్యగా పరిణమించక తప్పటంలేదు. వెనక్కుచూస్తే ఆ రోజుల్లో వ్యక్తి స్వేచ్ఛను గుర్తించి, సమాజం ఎవరిష్టమొచ్చినట్లు వారు జాతి విస్తరింపు చేసేందుకు అనుమతించింది. కాని ఇప్పుడు సామాజిక జీవనం ప్రశాంతంగా ఉండాలంటే, వ్యక్తి స్వేచ్ఛల్ని అరికట్టకుండా, ఈ సంతానాన్ని ఎవరు పోషించి, ఉద్ధరించి, సమాజానికి దోహదం చేయవలసి వుంటుందనే ప్రశ్న రాకమానదు. కనుకనే సమాజం కల్పించుకొని తాను ప్రసాదించానని పొరబడే వ్యక్తి స్వేచ్ఛను అరికట్టవలసిన అవసరం స్పష్టంగా అమలు జరపబడాలి. చట్టాలమధ్య వివాహాన్ని బిగించటంవల్ల అనుకున్నంత ప్రయోజనమూ లేదు; అదే విధంగా యీ సంతానం ఎలా పోతే మనకేమని కళ్లు మూసుకోవడం వల్ల అంతకన్నా ప్రయోజనం లేదు. ప్రపంచం విడాకుల్ని గూర్చి ఆలోచించినంత తీవ్రంగా 'వివాహం; సంతానం' అనేదాన్ని గూర్చి ఆలోచించలేదు. యీ రెంటినీ సమన్వయిస్తూ క్రొత్తరకం జీవితంవైపు ప్రపంచం పోగక తప్పదని మాత్రం చెప్పగలం.

## అధునాతన భావాలు : వివాహం

ఇరవయ్యో శతాబ్దాన్ని ఎల్లెన్ కే 'శిశువుల శతాబ్దం' అన్నాడంటే న్యాయమే కనిపిస్తుంది. యీ శతాబ్దంలో నిజంగానే 'శిశువు' ఒక గొప్ప సమస్యగా పరిణమించాడు.

ఒక వైపున కలగబొయ్యే శిశువుకు తల్లిదండ్రుల్ని ఎన్నిక చేయవలసిన బాధ్యత సమాజానికి వుంది. మెడకాయమీద తలకాయవున్న ప్రతివ్యక్తీ సంతానాన్నిపొందేందుకు అర్హత వున్నవాడేననుకుంటే, అనారోగ్యకరమైన, రోగిష్టి జనంతో ప్రపంచం నిండిపోతుంది. మానవుని శాస్త్రీయ విజ్ఞానమంతా బూడిదలో పోసిన పన్నీరే

అవగలదు. ఐతే సమాజంకానీ, ప్రభుత్వంకానీ అనర్హుల్ని దాంపత్య జీవితంనుంచి తొలిగించ గలుగుతోందా అంటే, ఏ విధంగానూ 'లేదు' అనే చెప్పవలసి వుంటుంది. మరి నాగరిక ప్రపంచంలో 'డబ్బు'కు ఉండేవిలువలే వ్యక్తిగత విలువలైనవి. ధనవంతుడు మాటాడే ప్రతిమాటా—అక్షర లక్షలు! వాడి ప్రతి అనారోగ్య లక్షణమూ, ఆరోగ్య కాంతి కిరణమే కదా!

ఇది ధనవంతుల పట్ల ఎంత నిజమో, వేరొక దృష్టిలో బీదవారిపట్ల కూడా అంతే నిజం. ఇక్కడకూడ 'ఆర్థిక శాస్త్ర ప్రయోగం' స్పష్టంగా కనిపిస్తుంది; ఐతే భేదమల్లా దృక్పథంలోనే. గంతకు తగ్గ బొంతలల్లే రోగిష్టి వాళ్ళిద్దరు వివాహమాడి సంతానాన్ని పొందటం; ఆర్థికస్తోమతు లేక ఆరోగ్యకరమైన దాంపత్య జీవితాన్ని గడిపే అవకాశం లేక ఏ చెట్టు చాటునో, పుట్టచాటునో దాంపత్యాన్ని నిర్వహించి, పిల్లల్నికని సమాజంలోకి విడుదలచేయటం నిత్యా జరుగుతూనేవుంది. దీన్ని సమాజంకానీ, ప్రభుత్వంకానీ అరికట్టే ప్రయత్నాలు కనిపించవు...కాని, ఇది ఇలాగే మరి కొంతకాలం సాగేట్లయితే ఆ నరకమే భూమిమీద అవతరించటాన్ని కళ్ళారా చూడవలసే వుంటుంది.

మొత్తంమీద బిడ్డ తన తల్లిదండ్రుల్ని ఎన్నుకోవటంలో నామమాత్రుడుగానే ఉంటున్నాడు. నాగరికతను పెంపొందించుకోవాల్సిన సమాజం, జనాభా పెరుగుదలను కంట్రోల్ చేయటానికి ముందుగా, అనవసరపు, అనారోగ్యపు శిశువులు దూకకుండా కట్టడి చేసుకోవాల్సి వుంది. ఆరోగ్యసూత్రాలు వెనువెంటనే ప్రవేశపెట్టబడి, తగినంత లైంగిక విజ్ఞాన ప్రసారం జరగనట్లయితే, నాగరికత స్థాయే దిగిపోక తప్పదు.

జనాభా పెరుగుదల రెండు విధాలుగా జరుగుతోంది: ఒకటి పుటకలు ఎక్కువవటం; రెండు మరణాలు తగ్గటం. ఆరోగ్య జీవనస్థాయి పెరిగినప్పుడు, మరణశాతం తగ్గుతుంది. యీ సమస్య 19-వ శతాబ్దంలో లేదు; ఆ శతాబ్దీకులు జాతి విస్తరణ అత్యవసరమని, ఎక్కువమంది సంతానాన్ని కన్నవారిని బహూకరించి, గౌరవించారు. కాని ఆ దుష్ఫలితాలు 20-వ శతాబ్దీకులు అనుభవిస్తున్నారు. దీన్నిబట్టి జాతి విస్తరణ, దంపతులకు సంబంధించిన వ్యక్తిగత సమస్యగా కనపడినప్పటికీ, అది ముందు తరం వాళ్ళనూ, సమాజాన్నీ చాలా చిక్కులకు గురిచేస్తోంది.

మరో ఇబ్బంది ఏమంటే శాస్త్రీయ విజ్ఞానం పెరగటంవల్ల మానవుడు ప్రకృతి శక్తుల్ని నిరోధించి మరణశాతాన్ని తగ్గించుకోగలిగాడు. తీరా కన్నుమూసి కన్ను తెరిచేటంతలో జనాభా పెరిగిపోయి, నేటి ప్రపంచమంతకూ, గర్భనిరోధ ఆవశ్యకత తెలిసివొచ్చింది. మానవుడు జాతి విస్తరణలో చూపిన ప్రజ్ఞను, ఆహారోత్పత్తిలో చూపలేక పోతున్నాడు. యీ రెంటికీ సమన్వయం కుదరనట్లయితే సమాజమే కాదు, ప్రభుత్వాలు తల్లకిందులైనా ఆశ్చర్యపడవలసింది లేదు.

ఈ కొత్త సమస్యలన్నీ కలిసి వివాహ చరిత్రను అల్లకల్లోలం చేస్తున్నవి. ముసలివారు, బూజుపట్టిన తమ అభిప్రాయాల్ని మార్చుకోకుండా, ప్రకృతే వ్యాధుల రూపేణా జనాభాను తగ్గించుకుంటుంది కనుక, మనం నామమాత్రులమని అనుకో వొచ్చు. అదీగాక, వీరు త్వరలోనే ఈ ప్రపంచాన్ని విడనాడి, ముందు రాబోయే విషమ సమస్యల్నుంచి తప్పించుకున్నామనీ అనుకోవచ్చు. కాని ప్రకృతి మాట అటుంచి, ఈ సమస్య మానవుడినే మూడుచెరువుల నీళ్ళు తాగిస్తోంది.

ఇలాటి చిక్కు సమస్యలమధ్య వివాహమనే దాని అర్థం, ఆశయం మొదలైన వాటి రంగూ, అర్థాలూ తారుమారుగాక తప్పదు. మరి సంతానం ఎంత పెరిగిందని కాకుండా, ఎలాటిది అనేది ముఖ్యం ఐనప్పుడు, వివాహానికి ఏర్పడే ప్రాముఖ్యత అత్యధికం.

ప్రతివ్యక్తీ స్వభావసిద్ధంగానే తన ప్రతిబింబాలైన సంతానాన్ని పొందాలనే వాంఛను కలిగివుండు గాక. కాని ఏదోవొక సంతానం అనేది ఏ విధంగానూ, ఎవ రికీ వాంఛనీయం కానేరదు.

మరో సాధారణమైన అభిప్రాయం ఏమంటే—ధనికవర్గాల్లోని వారి సంతా నం, ఆరోగ్యంగానూ, తెలివితేటల్తో ఉంటారనీ, బీదకుటుంబాల్లోని వారు అనా రోగ్యంగా, మూర్ఖులవలె బతుకుతారనీను. దీనికి గత శతాబ్దంవారు చెప్పిన కార ణాల్లో గొప్పది—ధనికులింట తక్కువ పుటకలు, బీదవారింట ఎక్కువని! కాని నిజమేమిటంటే ధనిక వర్గాలవారు ఆరోగ్యకరంగా జీవించే అవకాశాల్ని కలిగి వున్నారు కనుక, వారి సంతానంలో ఆరోగ్యం కనిపిస్తుంది. ఇక పుటకల్ని గూర్చి చూస్తే, అంచనాల ప్రకారం ఇంగ్లండ్, స్వీడన్ దేశాల్లో ధనికుల కుటుంబాల్లోని సరాసరి పుటకలకూ, కాయకష్టం చేసుకొనే వారి కుటుంబాల్లోని పుటకలకూ ఏమంత భేదం లేదని తేలింది. మొత్తంమీద మనను ముఖ్యంగా బాధించేది, పుటకలు రేటుకన్నా, అనారోగ్య సంతానం దిగుమతి కాకుండటమే కదా!

## జనాభా పెరుగుదల : ప్రభుత్వాలు

సంతానం ఎంత కలిగిందని కాకుండా, కలిగిన సంతానం ఆరోగ్యకరంగా బతికే అవకాశాలు బాధ్యత కలిగిన ప్రభుతానికి ఒక సమస్యగానే పరిణమిస్తోంది. కనుక ఎవరు పడితే వారు సంతానాన్ని కనేందుకు ప్రభుత్వం అనుమతించరాదు. పరదేశీయుల ద్వారా జాతీయ సంతానం కలుషితమయే ప్రమాదంనుంచి కూడా ప్రభుత్వం తన ప్రజల్ని రక్షించవలసి వుంది.

ఈ విషయంలో ఒకో ప్రభుత్వానికి ఒకో అభిప్రాయం, ఆశయం ఉండటం గమనించదగ్గది. జాతీయ సంతానాన్ని కలుషితం కానీకుండటం ఫ్రాన్సు జాగర్త పడినప్పుడు, సరిగ్గా దీనికి విరుద్ధభావాలను ఇటలీ ప్రభుత్వం కలిగివుండేది. ఆ రోజుల్లో ముస్సోలినీ జనాభా విపరీతంగా పెరగటాన్ని ప్రోత్సహించాడు. 1926లో

'సంతాన నిరోధ ప్రచారం' గొప్ప నేరంగా, చట్ట నిర్మాణం కావించబడినది. యీ జనాభా పెరుగుదలకు వెనుకవున్న ఆశయం ఏమిటి? యుద్ధాలుచేసి, సామ్రాజ్యాల్ని విస్తరింప చెయ్యటమే కాని వేరుకాదు. ఇలాటి స్వార్థభావాలవల్ల నాగరికత ఎంత దెబ్బ తింటుందో, వివిధ దేశాల్లోని ప్రజలు ఎన్ని కష్టాల్ని అనుభవిస్తారో రెండు ప్రపంచయుద్ధ చరిత్రలూ చెపుతూనే ఉన్నవి కదా!

ఇక అమెరికన్ ప్రభుత్వం పరదేశీయులు స్థిరనివాసాల్ని ఏర్పరుచుకోవటాన్ని చట్టరీత్యా కంట్రోల్ చేసి, జనాభా పెరగకుండా తగిన కట్టు దిట్టాన్ని చేసింది. ఏ ప్రభుత్వమైనా కఠిన సత్యాన్ని యధాతధంగా స్వీకరించి అమలు జరిపేట్లయితే, జనాభాను గూర్చిన సమస్య చాలా గొప్పదిగానూ, ముందుగానే తొందరపడి ఆలోచించ వలసిందిగానూ ఉండక మానదు. —(ఇంకావుంది)


లైంగిక విజ్ఞానం కొరకు చదివి తీరవలసిన పుస్తకాలు.
అత్యుత్తమ శాస్త్రీయ గ్రంధాలకు సామాన్యులకు కూడా
అర్థమయ్యే తెనిగింపు.

| | | |
|---|---|---|
| 1. సిగ్గు | హావలాక్ ఎల్లిస్ | రూ. 1-0-0 |
| 2. ఋతుధర్మాలు | .... | రూ. 1-0-0 |
| 3. లైంగిక విజ్ఞానం | .... | రూ. 1-0-0 |
| 4. ప్రణయ కళ | .... | రూ. 1-0-0 |
| 5. స్వరతి | ... | రూ. 1-0-0 |
| 6. గర్భనిరోధం (సచిత్రం) | .... | రూ. 0-8-0 |

పుస్తకాల ఖరీదుకు రూ. 0-8-0 అధికంగా పంపిన వారికి, రిజిష్టర్డ్ పోష్టులో పంపబడుతవి.

అభిసారిక కార్యాలయం,
4, బాలుమొదలి వీధి, మద్రాసు, 17.




'చాలా ప్రేమ కథలకు రంగస్థలం కాలేజీ! అదృష్టవశాత్తూ — దురదృష్టవశాత్తూ అనాలనుకొంటాను! నేను చదువు పూర్తిచేసిన తరువాతగానీ, అటువంటి సర్కిల్‌లోకి రాలేదు.'

ప్రకాశరావు లోయనుంచి జ్ఞాపకాలు తోడుకొంటూ అన్నాడు. అప్పటికే ఒంటిగంట దాటింది. రోగులు పలచబడిపోయారు. కాంపౌండరు వెళ్ళిగూడా అరగంట దాటింది. ప్రకాశరావు సైతం వెళ్ళిపోయేవాడే! నేనూ గోపాలం ఆపేశాము. నిజానికి నాకంత ఇష్టంలేదుగానీ ఒకశేమోయిన గోపాలం వెంటపడుతుంటే కాదనలేక పోయాను. అతనితోపాటు నేనుగూడా గట్టిపట్టు పట్టవలసి వొచ్చింది. ఆగష్టు మబ్బులనీడలు నిద్రపోతో, మసలుతున్నాయి. మందుల వాసన, సిగరెట్ల పొగకలిసి, విచిత్రంగా ముక్కుకు తగులుతోంది.

'నన్నడిగితే, ప్రేమించుకోడానికి కాలేజీ జీవితమే అన్నివిధాలా అనుకూలమైనదంటాను. విచక్షణాజ్ఞానం అప్పుడప్పుడూ మోసులెత్తుతుంటుంది. ఒకవేపు యౌవనం తొందర పెడుతుంటుంది. అనుమానాలతో, పిరికితనంతో, గుంజాటనతో సతమతమవడం బొత్తిగా సహించని కాలమిది. ఏదో ఒకటి, చప్పున చేసెయ్యడం ఆకాలపు లక్షణం. అలాంటి సందర్భాల్లో, విశాలంగా సుఖపడినవాళ్ళూ ఉన్నారు; ఘోరంగా పతనమయి, అట్టడుగు చూసినవాళ్ళూ ఉన్నారు. ఈ రెండింటిలో ఏది జరిగినా మంచిదే! అఁహా...నన్ను చెప్పనివ్వండి. ఏమీ జరక్కుండా, రూళ్ళకర్రలా సాగిపోవడంకన్న, ఏదో వొకటి; అది చెడ్డయే కానీ-జరగడం చాలా మంచిదని ఇప్పుడనుకొంటున్నాను. అప్పట్లో ఆ ఆలోచనే నాకులేదు.

'కలలు రావడంగురించి శాస్త్రం చాలా విచిత్రమైన సంగతులు చెబుతుంది. క్రూరంగా అణచబడిన కోరికలు, ఉపబుద్ధిలోకి దొంగచాటుగా ప్రవేశించి

అక్కడ సంతృప్తిపడతాయట. సాంఘికంగానూ, నైతికంగానూ, అమలులోలోఉన్న కట్టుబాట్లు, వాంఛలను జల్లెడ పట్టడం మూలాన్ని, అవి స్వప్నాల్లోకి రావడం జరుగుతోందన్నమాట. అట్లాగే ఏదైనాసరే-తీవ్రంగా అణచబడటంవలన అనేకరెట్ల శక్తితో, మరొక రూపంలో ఆ 'అది' ప్రకృతిసిద్ధమైన తనధర్మాన్ని నిర్వర్తించుకొంటుంది.

'భగవంతుని ముఖంచూసి చెబుతున్నాను. కాలేజీలో ఉన్నంతకాలమూ, నేను చాలా 'నీతి'గా ఉండేవాణ్ణి. ఇది బలవంతానకాదు, ఇచ్ఛికంగానే ఉండేవాణ్ణి. అప్పట్లో ఏ భయాలు, ఏ అవరోధాలు, ఏ నిబంధనలు నన్నలా కట్టివేశాయో, అప్పటికీ ఇప్పటికీ నాకు తెలీదు. యం. బి. బి. యస్. పూర్తి చేశాను. జగన్నాధంగారి దగ్గర అప్రెంటిస్‌గా కుదిరాను. మొదటినుండీ, చాలా సిన్సియర్‌గా ఉండేవాణ్ణి. అప్పుడు గూడా నాకు ప్రేమ వేపు దృష్టిపోలేదు. నా స్నేహితులు చాలామంది చాలా రకాలుగా నన్నను కొనేవారు. కొందరు ముంగి వెధవనేవారు, ఇంకొందరు పిరికి వెధవనేవారు. మరికొందరు పురుషుణ్నే కాదన్నట్లు మాట్లాడేవారు. ఎంచేతో, నవ్వి ఊరుకొనేవాణ్ణి.

'నాకుబాగా జ్ఞాపకం-ఆగస్టుతొమ్మిదవ తేదీ! ఆ రోజునా నేను మామూలుగా హాస్పిటల్ కొచ్చి పనిచూసుకొంటున్నాను. యాభైయేళ్ళ నడికారు స్త్రీతోబాటు, ఇంకోపిల్లగూడా మందు కోసం వచ్చింది. నాకు బాగాజ్ఞాపకం ఆరోజు ఆగస్టు తొమ్మిదవ తేదీ!

ఇటీవల నేను చాలా ప్రణయ సాహిత్యం చదివానుగానీ, ఆనాటి నా పరిస్థితికి సరిపోయే సంఘటన ఒక్కటీ తగలేదు. కొందరు, కొందరు ఆడవాళ్ళ కళ్ళల్లో అలాంటి 'విషపు వలలు' ఉంటాయి గావును మరి! నేను పూర్తిగా పిచ్చివాణ్ణయి పోయాను. మందులు కలపడం ఆపి, ఆ పిల్లను చూడ నారంభించాను. ఆపిల్ల ఇవేమీ గమనిస్తున్నట్టులేదు.జ్వరంతో తూలిపోతున్న తల్లికి ఆసరాగా నించొంది. ముఖంమీద ఆందోళన, నన్ను ఉత్సాహపరిచింది. తల్లికి నాడిచూశాను; టెంపరేచరు చూశాను. ఏదో మందు కలిపిచ్చాను. సాయంత్రం రమ్మన్నాను.

'నిజానికి రేపుదయం వస్తేచాలు. రాజ్యాన్ని చూడాలన్న కోరిక కొద్దీ సాయంత్రం రమ్మన్నాను. ఇలారోజులు వారాలు గడిచాయి. తల్లి జబ్బుక్రమంగా హెచ్చడంమూలాన్ని, హాస్పిటల్‌కు రాలేక పోయింది. జగన్నాధంగారు నన్నే వెళ్ళిచూడమన్నారు. నాకు కావలసిందిగూడా అదే! అలానే ప్రతిరోజూ వెళ్ళి చూసి వస్తుండేవాణ్ని. మందు లిస్తూనే ఉండేవాణ్ని. కానీ జబ్బు నయం కాలేదు.

'చాలాకాలం తరువాత...మీకో భయంకరమైన రహస్యం చెబుతున్నాను. నేనాతల్లికి, ఏనాడూ సరయిన మందివ్వలేదు. ఇస్తే-నయం గాకపోవడానికి, అదేమంత పెద్ద జబ్బుకాదు. బుద్ధిపూర్వకంగానే ఇవ్వలేదు. వెంటనే రోగం నయమైతే రాజ్యాన్నిచూసే అవకాశం ఉండదన్న భయం, నన్ను మంచి మందివ్వనీలేదు. కొంతకాలానికి రాజ్యం తల్లి

చనిపోయింది. అందరితోబాటు నేనూ విచారించాను, ఇక ఏ నెపంతో రాజ్యం గారింటికి రావటమా అని. రాజ్యం దరిద్రుని కూతురు కాదు. తండ్రికట్టుకుపోయినంత సంపాదించకపోయినా, హీనమైన సంపాదనాపరుడు మాత్రం కాదు. అయినట్లయితే, కట్నం లేకుండా రాజ్యాన్ని ఎప్పుడో పెళ్లి చేసుకొనేవాణ్ణి. ఆతరువాతయినా, చేసుకొందుకు నాకేమీ అభ్యంతరం లేదు. లేదని ఎన్నోసార్లు చెబుదామని ప్రయత్నించేవాణ్ని. అంతే! ప్రయత్నం, ప్రయత్నంగానే ఉండిపోయేది.

'రాజ్యం అందగత్తె-కనీసం నాకళ్ళకలా అవుపించేది. రాజ్యాన్ని చూసినవారు, నామాటతో ఏకీభవించరు. మరి నా కళ్ళటువంటివి!

'అందాన్ని ఆరాధించాలనటం అర్థం లేనిపని. ఆరాధించడంలో నాకట్టే వివేకం కనిపించదు, క్షమించండి. నా అభిప్రాయం తప్పుకావచ్చు; అందాన్ని ఎంత తీవ్రంగా అనుభవంలోకి తెచ్చుకొంటే, అంతమేర ఆనందం పొందవచ్చు. ఆరాధించడంలో, అనుభవించామన్న సంతృప్తిరాగలదని ఇప్పటికీ నాకు నమ్మకంలేదు.

'రాజ్యంకోసం ఆమె తండ్రితో స్నేహంచేశాను. ఇది పూర్తిగా స్వార్థమే కావచ్చు. అయినా, ఏపని వెనుక స్వార్థపు ప్రోద్బలంలేదు గనక! కొన్ని రకాల స్వార్థాలు ఒకవ్యక్తికి లాభిస్తే, ఇంకొన్ని రకాలు ఒకదేశానికి లాభిస్తాయి. మొదటిది దోషమయి, రెండవదే అభిలషణీయమైనదైతే, నీకు రెండింటిని గురించీ తెలీదని నేననుకోవలసి వస్తుంది. ఒకడికి లాభించిందా, లక్షమందికి లాభించిందా అన్న ప్రశ్నే లేదు. ఎంతమందికి లాభించినా, లాభించకపోయినా, మంచిమంచే అవుతుంది. చెడ్డ చెడ్డే అవుతుంది. ఒకడికి ఉపయోగపడేది ఘోరమయినప్పుడు వెయ్యిమందికి ఉపయోగపడేదీ ఘోరమే అవుతుందిగానీ ఉత్తమంకాదు; కారాదు.

'నేను తరచుగా రాజ్యం ఇంటికి వెడుతుండేవాణ్ని. రాజ్యంనాన్న ఉండటం ఉండకపోవటంతో నాకు సంబంధం లేదు. నా రాకపోకలకు ఆయనగారి అభ్యంతరమేమీలేదని తెలిశాక, ఇక నిశ్చింత ఏర్పడింది. గంటల తరబడి రాజ్యంతో కబుర్లుచెబుతూ గడిపేవాణ్ణి. ఆనాటి మా సంభాషణల్లో ఏమేమి మాట్లాడుకొన్నామో, నాకిపుడు సరిగ్గా జ్ఞాపకంలేదు. కాలం మాత్రం సరదాగా దొర్లిపోయేది.

'నేననుకొనేవాణ్ణి: రాజ్యం నన్ను ప్రేమిస్తున్నదని. అలా అనుకొందుకు సరిపడ్డ ఆధారాలుగూడా ఆనాడు నాకుండేవి. నన్నుచూడగానే నవ్వడం, ఆప్యాయత కనబరచడం, ఓగంట ఆలస్యంగా వెడితే, నాకోసం 'ఇదయి' పోవడం నాతో సినిమాలకు రావడం, కావాలనో, పొరబాటునో, ఆమెను తాకినా, కాదనకపోవడం...,ఇంకా ఇలాంటివే నా కారణాలు. ఇవన్నీ ప్రేమించిన వ్యక్తితాలూకు లక్షణాలుగా నేను భావించాను. మరొకరిపట్ల రాజ్యం ఇలా ప్రవర్తించదని, నా అంతరాత్మ నాకు చెబుతుండేది. నిజమో కాదో నన్ను

బుజావు నేనెపుడూ చూసుకోలేదు. కానీ, నా అంతరాత్మ పప్పులో కాలు వేసిందన్న విషయం, చాలా కాలానికి గానీ నాకు తెలియలేదు...

'నాకిప్పటికీ తేలనిసమస్య, ప్రేమ దైహికమా మానసికమా అన్నది. ఈ రెండింటిని విడదీసి చూడటం ఆరోగ్యమైన లక్షణంకాదని నా అభిప్రాయం. నిజంగా మానసికమే అయితే, నేను చాలా దూరంలోవుండి రాజ్యాన్ని ప్రేమిస్తూ కూచోవచ్చు. శారీరకమే అయితే, రాజ్యాన్నిమించిన అందగత్తెలు అంతక్రితమూ, ఆ తరువాతా నాకు సందర్భపడ్డారు; వారందరిపట్లా నాకుప్రేమ పుట్టుకురాలేదు సరిగదా, ఏ అభిప్రాయమూ కలగలేదు. ఏదెట్లా చావనీ, నేను మాత్రం రాజ్యాన్ని కోరకుండా ఉండలేకపోయాను. అదీగాక - ప్రేమకు తురీయావస్థ స్త్రీ పురుషుల సంగమంకన్నా మించి మరిలేదు...మరోలా అనుకోకండి. ఇవన్నీ నా స్వీయాభిప్రాయాలు. వీటిని మీరు విశ్వసించనక్కరలేదు. మీ ఉద్దేశ్యాలు వేరుకావచ్చు. నావి నాకెంత నిజమో, మీవి మీకు అంతే నిజం! ఇందులో మనం వాదులాడుకోవలసిందేమీ లేదుగదా?

'ఓ రోజు సాయంత్రం నేను రాజ్యం ఇంటికెళ్ళాను. మధ్యాహ్నం మేమనుకొన్నట్లు-షికారుకు సిద్ధంగా ఉన్నది రాజ్యం! ఆ నాటి రాజ్యం, భువనమోహనంగా ఉన్నది. లేత నీలిరంగుచీర, స్నఫ్ కలరు జాకెట్టు, వదులుజడ, స్నో వాసన, కాటుక తీర్చిన కళ్ళు, పళ్ళు తెల్లగా కనపడే నవ్వు, నన్ను ప్రోత్సహించాయి. మరో మాటలేకుండా రాజ్యాన్ని కౌగలించుకొన్నాను. ఎంత గాఢంగానంటే, నా ఆలింగనంలో ఆవిడ ముక్కలయి ఉంటుందనుకొన్నాను. రాజ్యం వ్యతిరేకిస్తుందనిమీరూ అనుకోలేకోరు గదా! కానీ వ్యతిరేకించింది. మంమొఖంమీద కొట్టింది. పెనుగులాడింది. గింజుకొంది. లాభం లేకపోయేసరికి, ఏడవనారంభించింది. నాకు జాలికలగలేదు. ఇంకా ఆమెను దగ్గరికి లాక్కొంటున్నాను. కాటుక చెరిగి, వికృతంగా బుగ్గలమీదికి జారింది. గుడ్డలు చాలాభాగం చిరిగిపోయాయి. సంవత్సరాల తరబడి, దారుణంగా అణిగిపోయిన నా కోర్కెలు, తీవ్రంగా మేలుకొన్నాయి గావును; రాజ్యాన్ని తిరిగి నా కౌగిలిలోకి తీసుకొందుకు ప్రయత్నిస్తున్నాను. క్రింద ఎవరో తలుపు కొడుతున్న ధ్వనితో, 'మైకం' వీడిపోయింది. రోజుకుంటూ గదిలోంచి బైటికొచ్చాను. రాజ్యం ఏడుపు దిగమ్రింగి, వేరే గుడ్డలు కట్టుకొని తలుపు తీసేందుకు వెళ్ళింది. నాకెందుకో చెప్పరాని భయమేసింది. ఎందుకైనా మంచిదని దొడ్డివాకిలి గుండా వచ్చేశాను.

'రెండు రోజులు వారింటికి వెళ్ళలేదు. మూడోనాడు రాజ్యం తండ్రి వచ్చాడు. ఏమి కొంప మునుగుతుందో ననుకొన్నాను. ఎన్నడూ చేయని వాణ్ణి, అలాంటి పాడు పని ఎందుకు చేశానా అనుకొన్నాను. ఈ గండంగడిస్తే, ఇక జీవితంలో ఇటువంటి పని చేయనే చేయనని ఒట్టు వేసుకున్నాను.అనవసరంగా భయపడ్డాను గానీ ఏమీ జరగలేదు. రాజ్యం రెణ్ణాళ్ళుగా జ్వరపడ్డదిట. మందు కోసం

వచ్చాడు. పిచ్చి వెధవను గాకపోతే, నా మీది విరహంతోనే రాజ్యం మంచం పట్టి ఉంటుందని అనుకొంటానా మరి?

'జగన్నాధంగారు పని తొందరవల్ల నన్నే పొమ్మన్నాడు. జ్వరం! అంతే మరేం లేదు. తండ్రి కళ్ళల్లో భయం కదులుతోంది. తండ్రితో బాటే తనూ క్రింది కెళ్ళాలని ప్రయత్నించింది గానీ, నేనే ఆపాను. తిరిగీ నేను నా కోరికను వెల్లడించాను. సజావుగా తీర్చకపోతే, బలవంతంగానైనా తీర్చుకోక తప్పదన్నాను. అటువంటి స్థితికి నన్ను తీసుకురావడం ఉభయత్రా క్షేమంకాదన్నాను. రాజ్యం ఎంత భయంగా నా వేపు చూసిందో తలుచుకొంటే, ఇప్పటికీ నాకు జాలివేస్తోంది. నేను ఏ మరుపాటుగా ఉండటం చూచి క్రిందికి పరుగెత్తింది...

'ఆ తరువాత నేనెన్నో అనుకొన్నాననుకోండి-ఆడది దుర్మార్గురాలనీ, మగవాణ్ణి మోసం చేస్తుందనీ ఆజాతినే నమ్మరాదనీ, ... ఇలాంటి సదభిప్రాయాలు చాలా కలిగాయి. నాకూ అభిమానం వేసింది. నన్ను నేను రెండే రెండు ప్రశ్నలు వేసుకొన్నాను. ఒకటి: వారింటికి ఎందుకు వెడుతున్నాను? జవాబు సులభమే! రాజ్యంకోసం!! రెండు ఆవిడ లేకుండా - అంటే- చూడకుండా ఉండలేనా? ఉండగలను. నేను కబుర్ల పోగునే కాదు, కార్యవాదిని కూడానూ.

'ఆ నాటినుండే వారింటికి వెళ్ళడం మానేశాను. చాలామంది చాలారకాల అనుకొన్నారట. మరి అనుకోరా?

'రాజ్యం పశ్చాత్తాప పడుతుందని నేనాశించలేదు. పడినట్లయితే, ఆమెమీది గౌరవం - పోనీ అలానే అనుకొందాం- నాకెంత మాత్రం మిగిలేదికాదు. ఓ రకంగా రాజ్యం మంచిపనే చేసిందని ఇప్పు డనుకొంటున్నాను. కొద్ది రోజుల తరువాత ఆవిడకు పెళ్ళయిందట. పెళ్ళికి వెళ్ళక పోవటానికి చాలా కారణాలున్నవి. ఒకటి చూస్తూ చూస్తూ రాజ్యాన్ని మరొకడు పెళ్ళాడు తుంటే ఊరుకోలేను. ఏదో ఓ గొడవ చేస్తాను. దాని వల్ల చాలా చిక్కు లున్నాయి. అంతర్జీవితం ఎలా తగలడ్డా, పైకి 'మర్యాద'గా లేకపోతే, ఈ సంఘంలో విలువ ఉండదు గదా చచ్చి! వెడదామన్న ఆలోనను బలవంతాన తొక్కి, అణిచేశాను...

'రెండు వంవత్సరాల తర్వాత, గాంధీ నగరంలో రిక్షాలో వెడుతుండగా రాజ్యాన్ని చూశాను. అప్పటి కంటే మనిషి ఏపుగా ఎదిగింది. రవంత లావుగూడా అయింది. నేనూ రిక్షామీద పడి ఆవిణ్ణి వెంబడించాను. చిన్న మేడ. పై అంతస్తులో ఉంటున్నారు రాజ్యం వాళ్ళు. నేనూ వెళ్ళాను. నన్నుచూసి ఎంత ఆశ్చర్య పడ్డదని! ఇరవై నాలుగు నెలలు, మనిషిలో మార్పులను తీసుకొస్తాయనే రాజ్యం అనుకుంటే, ఆవిడ పొరబాటుగా ఊహించి ఉంటుంది. అప్పటికీ ఇప్పటికీ నేనేమీ మారలేదు. ఇనుమడించిన రాజ్యం సౌందర్యం, నన్ను సవాలుచేస్తున్నట్లు ఫీల్ అయ్యాను. నా అసమర్థతను వేలెత్తిచూపి, వెక్కిరిస్తున్నట్లు భావించాను. ఆ సౌందర్యం—నాకు అందని ఆ సౌందర్యం— ధ్వంసం కావాలి. ఇలా నన్ను రెచ్చగొడుతూ, కవ్విస్తూ, అందకుండా, తొలిగిపోతూ ఉంటే

నేను సహించలేను. ఒక్కసారి, నా అనుభవంలోకి రానన్నా రావాలి. లేదా, నా కళ్ళకా అందం కనపడకుండా పోవన్నా పోవాలి. రాజ్యం మొగుడు క్లబ్బునుండి వచ్చేందుకు చాలా టైముంది. తిరిగి నేను అభ్యర్థించాను. ఇప్పుడు రాజ్యం, మామూలు రాజ్యం కాదు. ఓ ఉన్నత ప్రభుత్వోద్యోగి భార్య. ఆ సంగతి ఆ విడ నోటంటే విన్నాను. ఈ మాట చెప్పి నన్ను బెదరగొడదామని, రాజ్యం ఉద్దేశమయి ఉంటుంది. నేను బెదరలేదు. నన్ను నానా మాటలూ అని తలుపు దఢాలున మూసుకొన్నది. నే నేమయి ఉంటానో ఊహించండి!

'తిరిగీ నా మనస్సు స్వాధీనం తప్పుతున్నది. ఎలాగైనా రాజ్యం బ్రతుకు బ్రద్దలు కావాలి. లేక పోతే ... ఎలా సాహసించానో ఇప్పుడు చెప్పలేను. వయస్సుకూ సాహసానికీ చాలా సన్నిహిత సంబంధ ముంటుందను కొంటాను. ఈనాడైతే అలాంటి సాహసం ఊహించలేను. ఆ రోజులే వేరూ!

'అర్థరాత్రి దాటింది. నేనిక స్థిమితంగా పడుకోలేకపోయాను. ఎలాగైనా ఆ రాత్రి రాజ్యంమీద పగతీర్చుకోవాలి. అంత దాకా నాకు శాంతి లభించదనిపించింది. గదికి తాళంవేసి బయలుదేరాను. ఇల్లు కనుక్కోవడం నాకాట్టే కష్టమనిపించలేదు. ఎవరన్నా చూస్తారేమో, చూస్తే ప్రమాదమేమో నన్న ఆలోచన గూడా కలగలేదు. సరాసరి మెట్లెక్కాను. రాజ్యం గదితలుపు లోపల గడియవేసి ఉంది. కిటికీలోంచి చూశాను. భార్యభర్త పడుకొని ఉన్నారు. ఏకాంతం గనుక, అందునా నిద్రావస్థ గనుక, చాలా నిర్లక్ష్యంగా పడుకొని ఉన్నది రాజ్యం. శరీరంలోని కొన్నిభాగాలమీద ఆచ్ఛాదనం లేదు. నేనా? ఏమని చెప్పను?

'అలానే కొన్ని గంటలు గడిపి ఉంటాను. రాజ్యం - ఎంతో అమాయకంగా నిద్రపోతున్నది. నిద్రలో నే భర్తను పెనవేసుకుని ఉన్నది. అదృష్టం కలిసివస్తే, ఆ హస్తాలు నన్నలా పెనవేసుకొని ఉండవలసింది. ఆ సౌందర్యం నా అనుభవంలోకి వచ్చి ఉండవలసింది. కాలం కలిసిరాలేదు. నా రాజ్యం మరొకరి మనిషయి పోయింది. వాడు లేక పోతే, నన్ను పెళ్ళాడి ఉంటుందని, అప్పుడనుకొన్నాను గానీ, ఆ పనీ చెయ్యాదు. నన్ను కాదన్న తరువాతగదా ఈ వివాహం జరిగింది! వాడు ఉండటం, ఉండక పోవటం అన్న ప్రసక్తే లేదే!

'ఏమి చేయాలన్న నిశ్చయంతో బయలుదేరిందీ జ్ఞాపకం వచ్చి, వణికిపోయాను. మెల్లిగా మెట్లుదిగి వచ్చాను. నా రాకపోకలు ఎవ్వరికీ తెలియవనుకొంటాను. ఆ తరువాతగూడా ఆ విషయమై నన్నెవ్వరూ అడగలేదు.

'ఇది జరిగిన కొద్దిరోజులకే, నేను బెజవాడనుండి మకాం మార్చాను. ప్రతిరోజూ కాకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు రాజ్యం కనిపించక మానదు. అలా కనిపించినప్పుడు నే నేమయినా చెయ్యగలను. ఎందుకయినా మంచిదని నేనీ తెనాలి వచ్చేశాను...

'ఇక నా పెళ్ళివిషయం. ఇప్పటికి నలభైఏళ్ళు పైబడ్డాయి. యౌవనం దాటి

పోతోంది. ఇప్పుడు పెళ్ళాడి ఇంకో స్త్రీని హింసించటం నాకిష్టంలేదు; ఒక స్త్రీ యౌవనం, వయస్సు, నాకనసరం! జీవితంలో చాలాభాగం రాజ్యం సంస్కరణతో గడిచిపోయింది. మరోలా అనుకోకండి- ఇప్పటికీ నా మనస్సు రాజ్యం మీదనే ఉన్నది. ఇది మంచిపనికావచ్చు, కాకపోవచ్చు. ఇంకో స్త్రీని పెళ్ళాడలేను. అయినప్పుడు నేనెందుకు పెళ్ళాడాలి? నలుగురూ నాలుగు రకాలుగాఅనుకోవచ్చు. నిజమే! కాదనను. ఆ నలుగురికీ సమాధానం చెప్పేముందు, నాకు నేను చెప్పుకోవద్దా? నా జవాబు నాకే సంతృప్తి నివ్వనప్పుడు, ఇంకొకరిని సంతృప్తి పరచగలదని నమ్మలేను.

'కాలేజీ రోజుల్లోనే, ఇటువంటి ఢక్కా-మొక్కీలు తిన్నట్లయితే, నా జీవితం మరొకలా ఉండేది. అప్పుడురాజ్యం కోసం ఇంత 'యావ' నాకుండేదికాదు. రాజ్యం గాకపోతే, మరో గీజ్యాన్ని చేసుకుని సుఖపడేవాణ్ణి. ఎంతో ఆదరంతో, అనురాగంతో, ప్రాణాలుపోసి పెంచుకొన్న ఓపువ్వు, నా ఎదటనే ఇంకొకరు అనుభవిస్తుంటే చూస్తూ కూచోవడం సాధ్యమా? ఏదో ఓ ప్రయత్నం చేస్తాము గదా? ఫలితం సరే-ప్రయత్నం విరమించంగదా? ఆ పువ్వుమీద మనకు నిర్లక్ష్యమన్నా కలగాలి, ఆ పువ్వులేకుండానన్నా పోవాలి. ఇంతవరకూ ఈ రెండూ జరగలేదు. ఇప్పుడు చెప్పండి. నన్నేం చెయ్యమంటారు?'

ఏం చెయ్యమంటాడోనని నేను గోపాలంవేపు చూశాను. అతనేమీ అనలేదు. ఓ నవ్వు నవ్వాడు.

'నాగరికత బలిసి, మనం బొత్తిగా చెడిపోతున్నాం ప్రకాశరావ్! అందుకు ఉదాహరణ నువ్వే! పాతివ్రత్యాన్ని, బూర్జువా నియమమంటున్నాం. ఏకపత్నీత్వం అర్థంలేనిదంటున్నాం. కానీ మనం ఆచరణలో అవే ఆచరిస్తున్నామన్న సంగతి స్పృహకు తెచ్చుకోడం లేదు. వెధవముండలు పెళ్ళాడకపోవడం అనాగరకమంటూనే, ఓ బొమ్మలక్కకోసం, పెళ్ళి మానెయ్యడాన్ని ఏమనాలో తోచకుండా ఉన్నది. ప్రేమప్రసక్తి తీసుకురాకు. తెస్తే వితంతువులకీ అది వర్తిస్తుంది. అలా నడుచుకొంటూపోతే, సహగమనం సమర్థనీయం కావాలి మరి! ఆ భర్తమీద ఎంత ప్రేమ ఉండి, ఆవిడ సహగమనం చేస్తానన్నదో మనకు తెలీదు. అయినా మనం దాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఈ సహగమనాన్ని ఎలా ఒప్పుకోడమా అని—'

డాక్టరు ఏదో చెప్పబోయి ఆగాడు. వాకిట్లో ఓ కారు ఆగింది. ఒకతను రొజుకొంటూవచ్చి, చాలా ప్రమాదమనీ, ఎలాగైనా రక్షించమనీ, ప్రాధేయపడుతున్నాడు. మరొక నిమిషానికల్లా, ఇద్దరు మనుష్యులు ఓ స్త్రీని దాదాపు చేతులమీద మోసుకొస్తున్నారు.

ప్రకాశరావు ఆ స్త్రీ వేపు ఓమారు చూసి 'జబ్బేమిటి?' అన్నాడు. అన్నాడేగాని సమాధానం విననేలేదు. ఎవరో కొట్టినట్టు తుళ్ళిపడి లేచి నిలబడ్డాడు. ప్రకాశరావును చూస్తే నాకే 'ఇది' గా ఉంది. వాళ్ళు రోగిని బల్లమీద పడుకోబెట్టారు. రోగిని పరీక్షించాడు డాక్టరు. అతని ముఖం ఎర్రబడ్డది. మనిషి వణికిపోతున్నాడు. బహుశః అదేదో ప్రమాదకరమయిన జబ్బయి ఉంటుంది.

'ఆ గదిలో బల్లమీద పడుకోబెట్టండి' అన్నాడు ప్రకాశరావు, 'పిలిచిందాకా మీరు రావద్దు'

ఆ గదిలో దూరాడు ప్రకాశరావు. నేను గోపాలంవేపు చూసాను. అతగాడు ఓ నవ్వు నవ్వి 'ప్చ్' అని చప్పరించాడు. గది లోపలి నుండి అవిడ మూలుగులు బరువుగా వినిపిస్తున్నాయి. ఏవో సామానులు కదిలిన చప్పుడు......

గంట దాటినా లోపలి నుండి ఏ కబురూ లేదు. నాకే భయమేసింది. గోపాలం గూడా ప్రమాదం శంకించిన వాడులా అదిరి పోతున్నాడు. ప్రాణాలుగ్గబట్టి గదితలుపులు నెట్టాం. రోగి అలానే బల్లమీద పడుకొని ఉన్నది. డాక్టరు క్రింద పడివున్నాడు. అతని చేతిలో 'పాయిజన్' పీసా ఓ ప్రక్క కు వరగి ఉన్నది.

'ఎందుకలా ఆశ్చర్య పడతావ్?' అన్నాడు గోపాలం నా భుజం తడుతూ,' ఎన్నోరకాల రోగాలను మనవాడు కుదిర్చి ఉంటాడు. కానీ తనకున్న ప్రణయ రోగాన్ని కుదుర్చుకోలేక పోయాడు. ఇక కుదురుతుందన్న ఆశకూడా అతనికి లేదు. దానితో బాధపడలేక ఆత్మహత్య చేసుకొన్నాడు. జబ్బులు కుదరని వాళ్ళు, కుదురుతుం దన్న గ్యారంటీ లేనివాళ్ళు, అది పెట్టే హింసను తట్టుకోలేక, బలవంతాన చావడం సహజమని నువ్వనుకొంటే, ఇదీ సహజమే! ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదే!'

గోపాలాన్ని చూస్తే నాకిప్పటికీ చావు భయమేస్తుంది. ★

---


# 1956 ఫిలిం డైరి

తెలుగు ఫిలింపరిశ్రమ, దానికి అనుబంధముగాయున్న ఇతర వ్యాపారాలకు సంబంధించిన వ్యక్తులయొక్క సంస్థలయొక్క వివరములు తెలుపునటువంటి పుస్తకము. స్టుడియోలు, సినిమాలు, ముడిఫిలిం, డిస్ట్రిబ్యూషన్, ఫిలిం చట్టం పన్నుల విధానము మొదలగు అనేక విషయాలను సమగ్రముగా తెలియ బరచునటువంటి గ్రంథము.

సినిమా తారలు, ప్లేబాక్ గాయకులు, నృత్యదర్శకులు, సంగీత దర్శకులు, దర్శకులు, స్క్రీన్ రైటర్లు, టెక్నీషియన్‌ల ఫొటోలు వార్ల అడ్రసులతో సర్వాంగసుందరముగా తయారవు తున్నది.

విడి కాపీ - రూ. 1-0-0. (పోస్టేజి ప్రత్యేకము)

ఏజంట్లకు నూటికి 25% వంతున కమీషను ఇవ్వబడును. 12 పుస్తకములకు తక్కువ ఆర్డరు అంగీకరించము.

కాపీలకు, ఇతర వివరములకు

## సుందరి పబ్లికేషన్సు

**17, ఉస్మాన్‌రోడ్డు, మద్రాసు-17.**


---

ప్రధానాంధ్ర కేంద్రాలలో, మద్రాసు ప్లాజా,
ప్రభాత్ లలో దిగ్విజయంగా నడుస్తోంది!



ఆర్ కె. ఫిలింస్

# శ్రీ 420

మహోన్నత భావాలు, విశాల దృక్పథాలు గలిగిన యువకుడు జీవితంలో ఎందుకూ కొరగానివాడుగా ఎలా తయారయ్యాడో నూత్న పోకడలతో చిత్రించబడింది చిత్రంలో.

నర్గీస్, రాజ్ కపూర్, నదీరా, నీమో,
లలితా పావర్ నటించారు.

| కథ | పాటలు | మ్యూజిక్ |
| --- | --- | --- |
| అబ్బాస్ | శైలేంద్ర, హసరత్ | శంకర్, జైకిషన్. |

దర్శకుడు: రాజ్ కపూర్.

ఆలిండియా ఫిలిం కార్పొరేషన్ విడుదల.



# పురాతన లైంగిక ఆచారాలు

ఆధునిక మానవుడు ఎంతో శాస్త్రీయ విజ్ఞానాన్ని సంపాయించి, తన నమ్మకాలకు ఒక కారణమంటూ ఏర్పరుచుకున్నాడు. కాని పురాతన మానవుడికి ప్రకృతి సహజ కర్మకాండ అంతా ఆశ్చర్యంగాతోచి,అర్థంగాక అనేక అంశాల్ని ఆచారాల్ని అనుసరించ సాగాడు. యీనాడు అవన్నీ మనకు హాస్యాస్పదంగా కనిపించటం సహజమే! వారినమ్మకాలూ, ఆచారాలూ ఎలా ఉండేవో చూద్దాం:

స్త్రీ గర్భధారణను పొందేందుకు పురుషుడే కారణమనే చిన్న సంగతి కూడా తెలియని స్థితిలో పురాతన మానవుడుండే వాడు. గర్భధారణ కేవలం ఏవో దివ్యశక్తులవల్ల జరుగుతోందనీ, సంతానమనేది మానవుని వశంలోది కాకుండా దైవనిర్ణయమేననే అభిప్రాయంలో ఉండేవాడు.

పెనుగాలికి ఎదురుగా నడుస్తేనూ, వేగంగా ప్రవహించే నీటిలో జలకాలాడుతేనూ స్త్రీ గర్భవతి అవుతుందనే నమ్మకం కొన్ని తెగల్లో ఉండేది. ఆస్ట్రేలియాలోని అనాగరిక జాతుల స్త్రీలు, గర్భధారణ అవసరం లేదనుకుంటే ఒంటరిగా అడవుల్లో తిరగటమూ, ఎత్తయిన ప్రదేశాల్లో నిలబడటమూ చేయరు; అక్కడ దివ్యశక్తులు పాపలుగా పారాడుతూ, చప్పున తమ గర్భకోశాల్లోకి ప్రశిస్తవని వారినమ్మకం.

ఐతే మరికొన్ని తెగలకు ప్రకృతి సత్యం తెలుసు. పురుషుడు స్త్రీకి దేన్నో ప్రసాదిస్తాడనీ ఆకారణంగా ఆమె గర్భవతి అవుతుందనే అభిప్రాయం వారికి ఉండేది. కాని ఆమె విడుదల చేసే గుడ్డును, పురుష వీర్యకణం పొదగటం వల్ల గర్భవతి అవుతోందని వారికి తెలియదు.

మొదటినుంచీ స్త్రీ బిడ్డల్ని కనాలనే ప్రకృతి వాంఛకు లోబడే వుంది. ఒక పక్క కాపరం చేస్తున్నప్పటికీ, దివ్యశక్తుల ప్రోద్బలం లేకుండా తాను గర్భాన్ని ధరించలేననే నమ్మకం ఆమెకు ఉండేది.ఇందుకు గాను పూజా పునస్కారాలూ, మంత్ర తంత్రాల సహాయం అపే

క్షించటం పరిపాటి. ఇలాటి నమ్మకం, యీనాటికీ మనం చూస్తూనే వున్నాం... కోడిగుడ్డు ఆకారంలో వుండే గవ్వల తావళాన్ని మంత్రించి, మెడలో ధరించటం ద్వారా గర్భ ప్రాప్తి అవుతుందని ఆ రోజుల్లోని స్త్రీ నమ్మేది.

పోర్చుగీస్ పశ్చిమ ఆఫ్రికాలోని ఓవిమ్బండూ తెగలో స్త్రీ గర్భవతి నని నిర్ధారణగా తెలుసుకోగానే తెగ పురోహితుని దర్శిస్తుంది: అటు మంత్ర తంత్రాలే గాకుండా, ఇటు మందు మాకులు కూడా అతనికి తెలుసు. మంత్రించిన విభూతితో ఆమె మొహం మీద ఎరుపు తెలుపు చుక్కలు పెడతాడు; ఇందు వల్ల భూత ప్రేతాలు కానీ, కంటికి కనిపించని దుష్ట శక్తులు కానీ, దరిజేరవని నమ్మిక. కాన్పు సమయంలో మాయ అంతా బైటికి వొచ్చేందుకు సహాయపడే నిమిత్తం ఆ విభూతి కొంత పొట్లాం కట్టి ఇస్తాడు. పురుడు పోసుకునే వరకూ ఆమె అనుసరించవలసిన విధులను, ఆమె ఆరోగ్య రక్షణకు ఉపకరించే సూత్రాలను బోధించి పంపుతాడు.

గర్భిణీ స్త్రీని గూర్చిన కొన్ని నమ్మకాలివి: గర్భవతి దొంగతనం చేస్తే ఆమె కాన్పు కష్టమౌతుంది, కుందేలు మాంసం తిన్నట్లయితే, లోని బిడ్డ పెదవులు చీలి వుంటవి. గుడ్లగూబ మాంసం తింటే బిడ్డ కళ్ళు చాలా పెద్దవిగా ఉంటవి. ఇలాటి చిల్లర నమ్మకాలు అన్ని తెగల్లోనూ రకరకాలుగా ఉన్నవి. నాగరికుల మనుకునే మనలో కూడా గర్భవతిని గూర్చిన నమ్మకాలు అనేక విధాలుగా ఉండటం నిత్య జీవితంలో చూస్తూనే వున్నాం కదా!

గర్భవతిగా ఉన్నప్పుడు స్త్రీలు విసుగుతోనూ, నరాల బలహీనతతోనూ, బాధపడతారనే సత్యం పూర్వీకులకు బాగా తెలుసు. ఏదన్నా గృహ కలహం వొస్తే ఆమె జొన్న చేలల్లో తిరిగివొచ్చే ఆచారం వుంది; ఇలా తిరగటం వల్ల జొన్న కంకుల తాలుకు చిన్న చిన్నముళ్లు చీర నిండా గుచ్చుకుంటవి. యీ స్థితిలో ఇంటికి తిరిగి వొచ్చాక, భర్త దయతలచక తప్పదు; ఆ ముళ్ళను తీయటంలో భర్త నిమగ్నుడవటమే వారిద్దరి కలయికకూ సహాయ పడుతుంది.

తను గర్భం ధరించి ఉండగా, భర్తకు ఇంట కామతృప్తి కలగని కారణంగా అతడు ఇతర స్త్రీలపొత్తును ఆశిస్తాడనే నమ్మకం అన్ని తెగల్లోగాని స్త్రీలకూ వుంది. అలా జరగకుండా ఉండేందుకు మంత్రించిన చెట్టువేళ్ళను అతని ఆహారంలో కలపటం ద్వారా తన పట్ల చూపే అనురాగానికి చలనం ఉండదనే నమ్మకం.

కడుపున పడిన వాళ్ళందరూ ఆడపిల్లలేవి, ఒక్క మొగపిల్ల వాడన్నా ఉండాలనే కోర్కె వున్న స్త్రీ, అందరూ మగపిల్లల్నే కంటూ ఒక్క ఆడపిల్లకోసం మోహం వాచివున్న స్త్రీ సహాయాన్ని అర్థిస్తుంది. ఉభయులూ తమ వొడ్డాణాలను మార్చుకోటం ద్వారా ఆశయసిద్ధి పొందుతామనే నమ్మకం ఉంది. లేదా ఒకరికొకరు భోజనాన్ని ఇవ్వటంకూడా కద్దు. లేదా కానుకలద్వారా, కావలసిన జాతి బిడ్డనే కనమని ఆశీర్వదించటం జరుగుతుంది. మొగపిల్లల్నే కన్న తల్లి, మొగపిల్లవాడికోసం మోహం

వాచిన ఇల్లాలికి ఒక కత్తి, బాణం, గొడ్డలి - బహుమతిగా ఇస్తుంది; యీ మూడు ఆయుధాలూ పురుషత్వ చిహ్నాలు కనుక, ఆమె మొగబిడ్డను కనగలుగుతుందనే నమ్మకం వుంది. ఇదే విధంగా ఆడ బిడ్డకోసం మొహంవాచిన ఇల్లాలికి, ఆడ పిల్లల తల్లి - ఒక చేటనూ, పొలంలో పని చేసేందుకు వీలుగా వున్న బుట్టనూ బహూకరిస్తుంది. ఇవి స్త్రీకి సంబంధించిన చిహ్నాలు కనుక ఆడపిల్ల కలుగుతుందని నమ్మబడుతోంది.

ఇక పురిటి సమయమంటే అనేక దుష్టశక్తుల సమీకరణ కనుక, ఎంతో జాగర్తగా ఉండాలనే భావన, భయం కలకాలంగా వుంది. పురుడు పోసుకొని బతికిన స్త్రీని పునర్జన్మ ఎత్తినట్లు భావించుతూండటం కద్దు.

యీ జాగ్రతల్లో కొన్ని ఇవి: పురిటి సమయంలో భర్త ఉండరాదు. ఓవింబండూ తెగవారు, భర్త ఇంట్లో ఉన్నట్లయితే బిడ్డ ప్రపంచంలోకి వొచ్చేందుకు సిగ్గు పడిపోతాడని అంటారు.

నెప్పులు ఎక్కువకాలం సాగినట్లయితే సహాయపడేందుకు వొచ్చిన స్త్రీలు, తమ వొడ్డాణాలను వొదులు చేస్తారు; లేదా తీసివేస్తారు. పురిటి గది తలుపు తెరిచి, గట్టిగా కట్టబడిన వస్తువులన్నిటినీ వొదులు చేస్తారు. యీ విధంగా వాతావరణంలో ఉండే వొత్తిడిని తగ్గించటం వల్ల పురుడు తేలికవుతుందనే నమ్మకమే ఇందుకు కారణం.

అప్పటికీ కాన్పు రాకుంటే, మంత్రసాని, గర్భిణి తన పాతివ్రత్యాన్ని కాపాడుకున్నదో లేదో అనుమానించి, ఆమె ప్రియుని పేరు చెప్పవలసిందిగా, అధికార పూర్వకంగా ప్రశ్నిస్తుంది. ఆమె నిజం చెప్పినట్లయితే, పురుడు తేలికవుతుందనే నమ్మకం వుంది. స్త్రీ శీలానికీ, ఆమె కాన్పుకూ సంబంధం వుందనీ, పురిటి సమయం ఒక అగ్ని పరీక్షలాటిదనే నమ్మకం స్పష్టమౌతోంది.

ఆడపిల్ల పుట్టినట్లయితే, బొడ్డు తాడును కొంకి తిరిగివున్న కత్తితో కోస్తారు; ఇది స్త్రీ చిహ్నం కనుక, ఉత్తరోత్ర ఆమె పొలం పనిలో నిగ్గుతేరగలదని నమ్మకం. మొగబిడ్డ బొడ్డుతాడు, బాణంతో కోస్తారు; ఇందువల్ల అతను మంచి వేటగాడవుతాడనే నమ్మకం.

ఓవింబండూ తెగలో ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలు కలిగినట్లయితే, వారిలో ఒక మొగబిడ్డను, తెగ పెద్ద ఇంటికి కానుకగా పంపాలి. ఆ బిడ్డ మొదట్లో సేవలు చేస్తూన్నప్పటికీ క్రమంగా పాలకుల కుటుంబీకుడుగానే పరిగణింపబడుతాడు.

కవలలు కలగటాన్నిగూర్చి ప్రపంచంలోని వివిధ అనాగరిక తెగల్లో వివిధ రకాలైన భావాలున్నవి. ఏదో దుష్టశక్తుల వల్లనే కవలలు జన్మించారనే నమ్మకం కొన్ని తెగలవారికి వుంది. కొన్ని ఆఫ్రికన్ తెగలవారు, కవలలు పుట్టటం గొప్ప దుర్ఘటనగా భావించి, తమ తెగకే ఏదో ప్రమాదం వాటిల్లుతోందనే భయంతో, ఆ కవలల్నీ, వాళ్ళను కన్నతల్లిని కూడా చంపెయ్యటం కద్దు. మరికొన్ని సందర్భాలలో ఒక బిడ్డను దేవుడికి బలివ్వటం ద్వారా దుష్టశక్తులు శాంతిస్తవనే నమ్మకమూవుంది.

మరికొన్ని తెగల్లో తల్లీ, పిల్లలు, పవిత్ర మయేందుకు కొంత కర్మకాండ జరపట మంటూ వుంది; మొత్తంమీద అనాగరికులు కవలలు కలగటాన్ని చెడుగానే భావిస్తారు.

వికృతాకారులుగానూ, అంగవైకల్యంతోనూ జన్మించిన శిశువుల్ని చంపెయ్యటం పురాతన మానవుల్లో విరివిగా కనిపిస్తుంది. ఇలాటి శిశువులు పెరిగి పెద్దయాక, సమాజానికే బరువు కనుక, పుట్టగానే వొదిలించుకునే పద్ధతిని వారు ప్రవేశపెట్టారు. కేవలం వేటాడి జీవించే తెగల్లో శిశు జననాలు అత్యధికమైనప్పుడూ, కరువుకాటకాలువొచ్చినప్పుడూ శిశు హత్యాకాండద్వారా జనాభాను తగ్గించుకునేవారు.

బహు భర్తృకత అమల్లో వున్న సమాజంలో, స్త్రీకి ఎంతమంది భర్త లున్నప్పటికీ కలిగిన సంతానానికి ఆమె మొదటి భర్తే తండ్రిగా భావించబడేవాడు. యీ భర్తలు ఏక కుటుంబీకులైన అన్నదమ్ముల యేట్లయితే, వారిలో పెద్దవాని సంతతిగానే, పిల్లలు వ్యవహరించబడుతారు.

గర్భవతిగా ఉన్నప్పుడూ, బిడ్డను రొమ్ముపాలమీద సాకుతూన్నప్పుడూ స్త్రీ దాంపత్యంలో పాల్గొనటంవల్ల సంతానానికి కీడు జరుగుతుందనే నమ్మకం వుంది. కనుక భార్యాభర్తలు ఆ కాలంలో దూర దూరంగా ఉండాలనే నియమమైతే వుంది కాని, నిత్య జీవితంలో అది ఎంతవరకూ ఆచరించబడేదో చెప్పటం కష్టం. ఐతే యీ వొత్తిడి తగ్గించి దుష్టశక్తుల్ని పారదోలేందుకు కొంత కర్మకాండ జరుపుకునే అవకాశం వుంది.

యీ విధంగా బాధల్లోనూ కష్టాల్లోనూ పడిన వారికి. తెగపౌరోహిత్యం జరిపే వాడు ఎప్పుడూ ఏదో విధంగా సహాయ పడుతూనే వుంటాడు.

లైంగికమైన కట్టడుల్ని ఛేదించుకునేందుకు పురుషుడు మొదటినుంచీ పోరాడి, సాధిస్తూనే వున్నాడు. పైన చెప్పుకున్న పరిస్థితిల్లోకూడా కామతృప్తి కోరకు పురుషుడు బహు భార్యాత్వాన్ని అవలంబిస్తూనే వున్నాడు. యీ విధంగా భార్య గర్భవతిగా ఉన్నప్పుడూ, లేదా బిడ్డను రొమ్ముపాలమీద పెంచుతూ న్నప్పుడూ, పురుషుడు ఇతర స్త్రీలద్వారా, లేదా చేసుకున్న ఇతర భార్యల ద్వారా కామలీలలు జరుపుకుంటూనే ఉన్నాడు.

ఒకరి కన్నా ఎక్కువ భార్యలున్న ఇంట్లో గృహ కలహాలు ఎక్కువనుకునేందుకు వీల్లేదు. ఎందుకంటే యీ తెగల వారు కేవలం కాయకష్టంతో బతకాలి, ఒకరి కొకరు సహాయంగా ఉంటేనే తప్ప, గృహజీవనం సాఫీగా సాగదు. కనుక స్త్రీ లందరూ కలిసికట్టుగా ఉండం డే కుదరదు. అన్నిటికన్నా పురుషుని ది నిరంకుశత్వం కనుక, అతని అధీనంలో స్త్రీలందరూ అణిగి మణిగి పడి ఉండేవారు.

ఐతే మరీ ఎక్కువ మంది భార్యలున్న భర్త అందర్నీ తృప్తి పరచ గలిగే వాడా అనే సందేహం సహజంగానే మనకు కలుగుతుంది. తాను భరించలేనంత మంది భార్యల్ని చేసుకోవటం, మొయ్యలేని బరువును నెత్తి కెత్తుకోవటమే అవుతుంది. ఏ పాలక వర్గంలో వారికో అధిక సంఖ్యాకులైన భార్య లుంటారు. వీరి

శీలం కడు జాగ్రతగా కాపాడబడేది. అంటే ఆ భర్తకూడా తన శక్తిసామర్థ్యాలమీద అనుమానమే! వారు నీతి తప్పితే కఠిన శిక్షలుంటవి.

ఓవింబండూ తెగలో బహు భార్యాత్వాన్ని అమలుజరిపే భర్తలు, తమభార్యలకు న్యాయాన్ని చేకూర్చేందుకు ఒక పద్ధతి అనుసరించబడుతుంది. కుటుంబానికి సంబంధించిన కాంపౌండ్ లోనే ప్రతి భార్యకు వేరువేరు గుడిసెలు లేదా వేర్వేరు వంటగదులూ, పడక గదులూ ఉంటవి. భర్త ఒకో భార్య ఇంట ఒక నిర్ణీతకాలం వరకూ, నాలుగు రోజుల పాటు, లేదా ఒకవారం పాటు ఉంటూండటమే యీ పద్ధతి.

పురాతన సమాజాలవారు బిడ్డలకు చాలాకాలంపాటు తల్లిపాలు అవసరమనే నమ్మకంలో ఉంటున్నారు; యీ సమయంలో దాంపత్యం నిషిద్ధం. అలాటి పాపకార్యం జరుగుతే, బిడ్డకు కీడు కలుగుతుందని భావించబడుతోంది. తను పితృత్వాన్ని వహించాక, తండ్రి కొద్దికాలం వరకూ మంచం దిగకుండా ఉండే ఆచారంకూడా ఉంది. అతను వేటకు వెళ్ళరాదు; అసలు బైటికే పోరాదు. అలా వెళ్ళినట్లయితే, దుష్ట శక్తు లేవన్నా అతనితోపాటే ఇంట ప్రవేశించి, శిశువును చుట్టు ముట్టుతవని నమ్మబడుతోంది.

ఆఫ్రికాలోని కొన్ని తెగల్లో బిడ్డ 3, 4సం॥ ల. వయస్సువచ్చేవరకూ తల్లిపాలమీదనే పెంచబడుతూండటం కద్దు. యీ లోగా ఆమె తిరిగి పురుడు పోసుకోవటం జరిగినా, అప్పుడు ఇద్దరు పిల్లల్నీ రొమ్ములమీద సాకటంకూడా జరుగుతుంది. మెలినీషియన్ ద్వీపవాసుల్లో కనీసం సంవత్సరంపాటు విధిగా తల్లిపాలమీదా, ఆ తరువాత మరో సంవత్సరంపాటు కొంత కొంతగా తల్లి పాలమీదా బిడ్డ పెంచబడే ఆచారం వుంది. ఆస్ట్రేలియన్ తెగల్లోకూడా బిడ్డ చాలాకాలం వరకూ తల్లిపాల మీదనే ఉండటంకద్దు; ఒక్కో సందర్భంలో ఐదేసి సంవత్సరాల బిడ్డకూడా తల్లి రొమ్ముల్ని విడవకుండటం జరుగుతూ వుంటుంది. ఒకో తల్లి ఇద్దరు ముగ్గురు బిడ్డల్నికూడా ఒకేసారి తన పాలమీదనే పెంచవలసి వుంటుంది.

కొంత కర్మకాండ జరుపుకొని సమాజం విధించిన దాంపత్య ఆంక్షలనుంచి, దంపతులు స్వేచ్ఛను పొందుతూండటం సర్వసామాన్య విషయంగా తోస్తుంది.

ఏకాంత పఠనానికి



కొక్కోక శాస్త్రం: వశీకరణము, వివిధ రతి భంగిమలు, అత్యంతోపయుక్తమైన అనేక ఇతర వ్యాసాలతో, ఇదివరకెన్నడూ మీరు చదివిఉండని విషయాలతో నిండివుంది.

పడకగది చిత్రాలు: స్త్రీత్వంలోని సౌందర్యాన్ని వివిధ భంగిమల్లో చూడదలుచుకుంటే, 50 ఫోటోల సెట్టుకు నేడే ఆర్డర్ చేయండి.

పై రెండూ కలిపి రూ 6/-

H. H. STORES (J. M.)
Post Box 51, Meerut [U.P.

ఇదంతా వారు ఊహించే దుష్టశక్తుల్ని పారద్రోలుటకేందుకే కాని వేరు కాదాయె అథవా ఏవన్నా అంతులు వున్నా అవన్నీ స్త్రీనే బాధిస్తవి కాని, పురుషుణ్ని కాదు. పురుషుడు ఏ బహుభార్యాత్వం ద్వారానో కామతృప్తి పొందుతూనే వుంటాడు. వొచ్చే ఇబ్బందల్లా స్త్రీకే.

స్త్రీ తన దాంపత్య స్వేచ్ఛను సంపాయించేందుకు మరో మార్గం కూడావుంది. బిడ్డను ఏ పెంపుడు తల్లి రక్షణలోనో వుంచి, తను యథాప్రకారం కాపరం చెయ్యవొచ్చు. సర్వసామాన్యంగా ఇంట్లో వున్న పెద్దతలలే యీ కార్యభారాన్ని వహిస్తారు. ఒకో సందర్భంలో బిడ్డ అమ్మమ్మో, నాయనమ్మో బిడ్డను తన రొమ్ము పాలమీద పెంచటం కద్దు. 60 సం॥ ల. వయస్సు స్త్రీకూడా బిడ్డకుపాలివ్వగలిగిన సందర్భాలు ఉన్నవి. ఇందుకు ఆ తెగలకు తెలిసిన కొన్ని మూలికలూ, బిడ్డ, స్త్రీలో కలిగించే సంచలనమూ అధికంగా సహాయపడుతవని అనుకోవాలి. ఆధునిక శాస్త్రజ్ఞులుకూడా తల్లిపాలు చాలకుండటానికి ఒక కారణం ఆమె మనస్తత్వమని ఒప్పుకుంటూనే ఉన్నారు.

ఇలాటి అనేక ఆచారాలు మనకు వింతగా కనిపిస్తున్నప్పటికీ, వారి సామాజిక జీవనంలో అత్యవసరమైనవిగా ఉన్నవి. కాలంతోపాటే వారూ మారవొచ్చు.


విడుదలైంది. త్వరపడి నేడే మీ కాపీలకు ఆర్డరివ్వండి.

## సినీతార దుర్మరణం

(డిటెక్టివ్ నవల)

రచన : దాసు.

వెల: 8 అణాలు మాత్రం.

సునంది గొప్ప పేరు ప్రఖ్యాతులు గల సినీమా నటి. ఆమె అందం హావ భావ విలాసాలూ, తెరమీదా, తెర వెనకా కూడా ప్రేక్షకుల్నీ ప్రియుల్నీ మత్తెక్కించి, మైమరపించినై.

ఒకనాడు, అది సుదినమో, దుర్దినమో చెప్పలేం; ఆవిడ డిటెక్టివ్ కిశోర్‌కు ఆపదలో వున్నట్టు ఫోన్ చేసింది. అంతే...ఆ తరవాత అంతా గందరగోళం గజి బిజీ.

కిశోర్ తీగలాగాడు; డొంక కదిలింది. చోరులూ, హంతకులూ, దగాకోర్లూ...సినీలో లాగా ఫేడిన్—ఫేడౌట్!

జ్యోతి కార్యాలయం, మద్రాసు_17.




వంటింట్లో పొయ్యిముందు కూర్చుని కూనిరాగాలు తీస్తోంది లక్ష్మి.

పొయ్యిమీద చారు తాలింపు కమ్మని వాసనలతో గుబాళిస్తోంది. ముఖంమీద క్రమ్మిన చిరుచెమట బిందువులు పైట చెరగుతో తుడుచుకుంటోంది లక్ష్మి.

చారు తాలింపు కాగానే ముక్కలుగాకోసిన వంకాయలూ, చిక్కుడుకాయలూ పొయిమీద కెక్కించి, టైమెంతో చూడటానికి మధ్య గదిలోనికి ఒక్క ఎగురున ఉరికింది.

లక్ష్మి 'పరికిణీ త్రొక్కొడు పదియేండ్ల బాలిక' కాదు! ఇరవై ఏళ్ళ ప్రౌఢ! యౌవన మధ్యస్థంలో ఉన్న ఆమె శరీరం, సహజ సౌందర్య కారణంగా, చూచేవాళ్ళకు మరింత అందంగా కనిపిస్తుంది. ఆమెముఖంలో, కళ్లల్లో నడకలో, సర్వత్రా సౌందర్యం వాకలు కట్టేది!

నాడు రాఘవరావుకు జీతం! ఐతే, అవాళ ఒకటో తారీఖు కాదు! ఒకటో తారీఖునకాని, లేకపోతే మరి ఒక నిశ్చితమైన తారీఖునకాని, జీతం అన్న నిబంధన రాఘవరావు పనిచేసే మ్యునిసిపల్ ఆఫీసులో లేదు! అంతా ప్రభువుల కరుణా కటాక్ష వీక్షణాలమీద ఆధారపడి ఉంటుంది. ఒకజీతానికీ, మరుచటి జీతానికీ మధ్య ఒక్కొక్కసారి నలభై, ఏభై రోజుల వ్యవధికూడా ఉంటుంది!

లక్ష్మి రాఘవరావుభార్య! వాళ్లిద్దరూ పెళ్ళిచేసుకొని మూడేళ్లయింది. రాఘవరావు అదృష్టవశాత్తూ బాల్యంలోనే తల్లిదండ్రులు లేనివాడై, ఆస్తిపాస్తులుకూడా లేనివాడై, కొంత దయా స్వభావుడైన మేనమామయింట పెరిగాడు. అక్కడనే మెట్రిక్ వరకూ చదువుకున్నాడు.

మ్యునిసిపల్ ఆఫీసులో గుమాస్తాగిరీ అయినతర్వాత, ఏమాట కామాటే చెప్పు

కోవాలి!-రాఘవరావు కళ్ళు, నడినెత్తికి ఎగబ్రాకినయ్! మనిషిలో గోరోజనం కొంత బలిసింది. నీటుగోటులు హెచ్చినయ్. ఇదంతా గ్రహించిన రాఘవరావు మేనమామ రాఘవరావును యింటినుండి బయటకు సాగనంపాడు.

ఆ తర్వాత వేరేయిల్లు అద్దెకు తీసుకుని, ప్రతినెలా జాగ్రత్తగా కొంతధనం దాచుకుని, రెండేళ్ళతర్వాత, ఒక యింటి వాడయ్యాడు రాఘవరావు. లక్ష్మి, లక్ష్మీ కటాక్షం కలవాళ్ళ యింటి పడుచు కాదు బీదకుటుంబంనుంచే వొచ్చింది.

ఆనాడు రాఘవరావుకు జీతంకదూ! ఉదయంలేచిన దగ్గర నుండీ భార్యా భర్తలు ఆజీతాన్ని ఎట్లా ఖర్చు చెయ్యాలో, ఎంత మిగల్చాలో లెఖ్ఖలు వేసుకున్నారు. అతనికి దొరికేజీతం ఏభై రూపాయలు. అందులో ఎనిమిది రూపాయలు యింటద్దెపోను - మిగిలిన నలభై రెండు రూపాయలకు నలభైనాల్గు రకాలైన లెఖ్ఖలు కట్టారు!

'ఈనెల ఒక జార్జెట్ చీర కొనాల్సిందే! ఛీ! ఎక్కడికన్నా పేరంటానికి వెళ్ళటానికి సిగ్గేస్తోంది!' అన్నది లక్ష్మి. 'మంచిదే! మరి నా షర్టులన్నీ చిరిగి వరుగులైపోయిన సంగతి మమ్మేలిన వారికి మాత్రం తెలీదా?' అన్నాడు రాఘవరావు. నెలఖర్చులన్నీ అతి కష్టంగా చేసినప్పటికీ, అయిదారు రూపాయిలు మిగల్చటం ఎంతోకష్టం! ఆ అయిదారు రూపాయలలో ఒక జార్జెట్ ఛీరకావాలి; ఒక షర్టూ కావాలి!

ఆడదానితో తగూపడి ఏ మగవాడు గెల్చాడు లెండి! ఆఖరుకు జార్జెట్ చీరకొని తీరటానికే ఒప్పుకున్నాడు రాఘవరావు. లక్ష్మిముఖం వికసించి చాటెడైంది!

అంతేకాదు! నాటిరాత్రి మొదటి ఆట సినిమా కార్యక్రమం వేసుకున్నారు ఆ దంపతులు. లక్ష్మి ఎగిరి గంతులు వేసింది.

'సాయంత్రం అయిదున్నరకు వస్తాను అప్పటికి నువ్వు స్నానంచేసి, టాయిలెట్ ముగించుకుని, రెడీగా ఉండు. నేను తెచ్చే జార్జెట్ చీర కట్టుకుందువు గాని. అన్నట్టు, నీకేరంగులో చీర కావాలీ?' అన్నాడు రాఘవరావు.

'లేత గులాబీరంగులో' అన్నది లక్ష్మి.

'అనగా? నీ చెక్కిళ్ళ రంగులోనా? లేకపోతే ఆ అధరోష్ఠాల రంగులోనా?' అని ప్రశ్నించాడు రాఘవరావు.

'పోదురూ? మీతో అంతా వేళాకోళమే!' అని చంటిపిల్లలా ముఖం ముడుచుకుని, చిరునవ్వుతో 'ఊఁ!' అనుకుని, ఓరకంట భర్తనుచూచింది లక్ష్మి

ఐసైపోయి, మందహాస కందళిత సుందర ముఖారవిందుడై, ఆఫీసుకుపోయాడు రాఘవరావు

ఇంటిదగ్గర ఆనంద మేఘ మాలికల మీద డోలిక లూగుతోంది లక్ష్మి.

ఇంట్లో అత్తా, ఆడబడుచులూ మొదలైన జంజాటాలులేని తన జీవితవైభవాన్ని చూచి తనలో తనె ఉబ్బి తబ్బిబ్బులు పడుతోంది. తను రాణి! తనభర్త, ఊఁ! రాజా!

తను కోరింది ఒక్క జార్జెట్ చీర మాత్రమే! కొసరుగా తనభర్త తనను సినిమాకుకూడా తీసుకు వెడతానన్నాడు

'ఎంత మంచివారూ? నేనంటె పడి చస్తారు! నాకోసం ప్రాణమైనా యిస్తారు!' అని తనభర్తకు తనపైకల కృతజ్ఞతను తలచుకుని, తలచుకొని మధురమైన ఊహాలలో ఉక్కిరిబిక్కిరై అమూల్యమైన కొంతకాలాన్ని వృధా చేసుకుంది లక్ష్మి.

ఉండి ఉండి మధ్యగదిలోకి వెళ్ళేసరికి గోడగడియారం తననుచూచి కళ్ళెఱ్ఱజేసింది. 'నిష్కారణంగా ఒక గంట కాలం వ్యర్థపరచావు! పోమరిదానా!' అని గద్దించింది.

రెండున్నర దాటి పోయింది.

వంటకు సిద్ధపడింది. అన్నంవండి, చారు తాలింపుపెట్టి, పొయిమీద-తరిగిన బంగాళా దుంపలముక్కలు, ఎక్కించేసరికి ఇట్టే నాలుగైపోయింది!

దిక్కుమాలిన కాలం! మెఱుపు వేగంతో పరుగిడుతున్నట్టుంది!

కూర ఉడికేసరికి నాలుగున్నర! తల దువ్వుకుని, మల్లెపూలు ముడుచుకుని, స్నానం చేసేసరికి-ఎంత తొందరగా తను పనిచేస్తున్నప్పటికీ అయిదుంబావయింది!

మరో అరగంటలో-ఊహూం, పావు గంటలో-'వారు'వస్తారు!...'వారిని' తలచుకునేసరికి ఆమె శరీరం, ఆమాంతం_ రోమాంచ కంచుకితమై పోతుంది, ఖర్మ!

అయిదున్నరకూడా అయింది! లక్ష్మి ముస్తాబుకూడా పూర్తి అయింది! 'వారు ఓ క్షణంలో వస్తారు. జార్జెట్ చీర తెస్తారు. అయిదునిమిషాల్లో మేం రాజా రాణీలమల్లే ఒయ్యారంగా నడచిపోయి, ఊఁ, సిగ్గేస్తోందమ్మా, సినిమాకుపోతాం' అనుకుంది.

అప్పటివరకూ గడియారమే విద్యుద్వేగంతో పరుగెడుతోందని అనుమానించిన లక్ష్మిమనను, యిప్పుడు ఆ గడియారంకంటె కొన్ని లక్షలరెట్ల వేగంతో పరుగెడుతోంది!

అయిదూ నలభై! అయిదూ నలభై అయిదు! అయ్యో! 'వారు' రారేం? అమ్మయ్యో! ఆరుకూడా ఆయేపోయింది. ఇప్పుడు వెళితే టిక్కట్లు దొరుకుతవా? ఇప్పటికే పేరు వచ్చి తగలడ లేదుకద! అయ్యో, రాత!

రాఘవరావుకు బదులుగా నడివయస్సులో ఉన్న ఒకవ్యక్తి పరుగెడుతూ, అలిసిపోయి, రొప్పుతూవచ్చి 'రాఘవరావుగారిల్లు యిదేనామ్మా?' అని ప్రశ్నించేసరికి, 'ఇదే!' అని సమాధానం కూడా యివ్వటం కష్టమై పోయింది, లక్ష్మికి.

'వెంటనే రా అమ్మా! గొప్ప ప్రమాదం జరిగిపోయింది!' అన్నాడు అలిసిపోయి ఎక్కువగా మాట్లాడలేని ఆగంతకుడు.

'వారికేమైంది నాయనా! చెప్పు! వారు క్షేమంగానే ఉన్నారు కద!...'

'మోటారుక్రింద పడిపోయారు. కుడి తొడ ఎముక విరిగిపోయింది. వెంటనే రావాలి! డాక్టర్ మధుసూదనరావుగారి హాస్పిటల్ లో ఉన్నారు!'

'ఆఁ!' మూర్ఛపోలేదు కాని లక్ష్మికి అంతపనీ అయింది. 'అయితే పద! వెంటనే పోదాం!' అని ఆమె ఆ వ్యక్తిని అనుసరించింది.

ఇంటి తలుపులకు తాళాలు వెయ్య లేదు, సరికదా, చేరవేసి గొళ్ళెమైనా పెట్టలేదు. ఆమెకు-అబలకు-అంత శక్తి ఎక్కడనుండి వచ్చిందో మగాడికంటె ఎక్కువ వేగంగా పరుగెత్తింది.

నిజమే! రాఘవరావు, ఎవరిదో: తెలియని ఒక మోటారుక్రింద పడిపోయి, కుడికాలి తొడ యెముక విరుగ్గొట్టుకున్నాడు. పడిపోయి రక్తపుమడుగులో తేల్తున్న రాఘవరావునుచూచి 'అయ్యయ్యో! అనేవారేకాని — ఒక్కరూ కారు నంబరు తీసుకోలేదు! ఆకారు ఏవరిదీ? డ్రైవర్ ఎవడూ?

అక్కడకు గవర్నమెంట్ ఆసుపత్రి చాలా దూరంలో ఉంది. రాఘవరావు పరిస్థితి చూడగా-అతను చావుబ్రతుకుల పొలిమేరల్లో ఉన్నట్టున్నాడు. స్పృహ లేదు. బొలెడురక్తం బయటకుపోయింది.

అంత ప్రమాదమైన పరిస్థితిలోఉన్న రాఘవరావును - ఎక్కడనో ఘుమారు రెండుమైళ్ళ దూరంలో ఉన్న గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకువెళ్ళటం దుర్ఘటం మాత్రమే కాక-ప్రమాదం కూడాను!

అందుచేత దగ్గిరలోనేవున్న డాక్టర్ మధుసూధనరావుగారి ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. డాక్టరుగారు రాఘవరావు కాలికి ఎన్ని కట్లుకట్టినా రక్తప్రవాహం ఆగేట్టులేదు. రెండు యింజక్షన్లుకూడా యిచ్చారు. ఉహూఁ! ప్రయోజనం లేకపోయింది.

రాఘవరావు కాలును, తొడ మొదటివరకూ ఆపరేట్ చెయ్యాలి! అదీ వెంటనే జరగాలి!

లక్ష్మి వచ్చింది. ఏడ్చింది. రాతి విగ్రహాలలోనూ, కొయ్యబొమ్మలలోనూ బంధింపబడ్డ భగవంతుని మనస్సు కరగలేదు.

డాక్టర్ మధుసూధనరావుగారు మంచి చెడ్డల కలయికకు ఓ చక్కని ఉదాహరణ! ఆయన శస్త్ర చికిత్సలో ఇంతింతనరాని కీర్తి ప్రతిష్ఠలు గడించారు! సాధారణంగా ఆయన పట్టిన 'కేసు' జయప్రదమై తీరుతుందనీ, ఆయన 'హస్తవాసి' మంచిదనీ ప్రతీతి! ఐతే, ఆయనకుగల ధనదాహం-గ్రీష్మ ఋతువులో సూర్యుని దాహం వంటిది!

'వెంటనే ఆపరేషన్ చెయ్యాలి! ఒక్క నిమిషమైనా ఆలస్యం కూడదు! నువ్వుబీద దానివల్లే ఉన్నావు. ఇది కనీసం రెండువందలైనా యిస్తేనేకాని పట్టకూడనికేసు! డబ్బు వెంటనే కావాలి!' అన్నారు దయార్ద్ర హృదయులైన డాక్టరుగారు.

'రెండు వందలా? ఎక్కడివి?' అని విచారంలోనే విభ్రమంకూడా చూపింది, లక్ష్మి.

'అది నన్నడగాల్సిన ప్రశ్నకాదు. ఓ అరగంట గడువిస్తున్నాను! ఆ తర్వాత నన్ను నిందించి ప్రయోజనం లేదు!' అన్నారు డాక్టరుగారు. ఆ మనోవైకల్యంలో లక్ష్మి తన భర్తజేబులో జీతం వున్నసంగతి మరచింది. 'రక్షించండి!' లక్ష్మివెళ్లి డాక్టరుగారి పాదాలమీద వ్రాలిపోయింది. 'నా పసుపుకుంకుమలు నిలపండి! నాకు దిక్కెవరూలేరు!' అని శతవిధాల మొత్తుకుంది లక్ష్మి. రాఘవరావును అక్కడకు తీసుకువచ్చిన కొందరు పెద్దమనుషులుకూడా కనికరించవలసినదిగా డాక్టరుగారిని వేడుకున్నారు.

'నిజంగా అంత పేదదానివే అయితే అందులో సగం యియ్యి! ఇందులో నాకు మిగిలేదేమీ లేదు. నా శ్రమకు నేనేమీ పుచ్చుకోవటంలేదు. వెంటనే వెళ్ళు! తెలుసునా? అరగంటలోపున యిక్కడ డబ్బుతో హాజరుకావాలి!' అన్నారు డాక్టరు.

'ఎక్కడికి వెళ్ళాలి?' అనుకుంది; బయటకువచ్చిన లక్ష్మి. ఆకాశంనిండా నల్లని కారుమబ్బులు-తన హృదయాకాశాన్ని అలుముకున్న విచార మేఘాలులా-పరుగులు తీస్తున్నాయి. దానికితోడు చల్లనిగాలికూడా వీస్తోంది. త్వరలోనే కుంభవృష్టి కురుస్తుందని ఏమాత్రం లోకజ్ఞానం ఉన్నవాడయినా చెప్పగలడు.

లక్ష్మివెళ్ళి ఒక మ్యునిసిపల్ కంట్రాక్టరుగారిని సహాయం కోరింది!

'ఎబ్బే! కంట్రాక్టరుననీ, లక్షలకు లక్షలు మూటకడుతున్నాననీ ప్రతీతేకాని, ఈ బిజినెస్‌లో మిగిలేదేమీ లేదమ్మా! కూలివాళ్ళ నోళ్ళుకొట్టి మిగిల్చినది కాస్తా-యింజనీర్లకూ, సూపర్‌వైజర్లకూ ముఖం తుడిచేందుకే చాలదు. రాఘవరావును నేనెరుగకేం? ఎంత మంచివాడు! ఎంత ఉత్తముడు! మరోలా అనుకోవద్దు! ఇప్పుడు నాదగ్గర ఎర్రని ఏగాణీ లేదంటేనమ్మా!' అని మొండిచేయి చూపారు, కంట్రాక్టరుగారు—రెండు చేతులనూ ప్రకాశవంతం చేసే ఎనిమిది పొడుల ఉంగరాలు తళతళలాడుతూండగా.

ఆతర్వాత ఒక మ్యునిసిపల్ కౌన్సిలర్‌గారిని ఆశ్రయించింది - పిచ్చి లక్ష్మి.

'ఉంటే ఇంతసేపా? ఎబ్బే! మాకు జీతాలా? భత్యాలా? గౌరవనీయమైన ఉద్యోగాలు! మనలో మనమాట! గౌరవంతో మనిషికి కడుపునిండదుకదా! వెళ్ళమ్మా! వెళ్ళు! మరోచోట ప్రయత్నించు! ఇది చాలాగొప్ప కష్టకాలం నీకు! భగవంతుడు నీ పసుపుకుంకుమలు నిలపాలనే నా ప్రార్థన!' అని అరమోడ్పు కన్నులతో భగవద్ధ్యాన పరాయణులైపోయారు-బంగారు గొలుసూ రిస్టువాచీ, బంగారుగుండీలూ మిలమిలలాడే కౌన్సిలరుగారు.

తిరిగి బయలుదేరింది లక్ష్మి. రోడ్డు మీదకు వచ్చింది.

'ఇప్పుడెక్కడికి వెళ్ళాలి?' ఈప్రశ్న ఆమె మస్తిష్కాన్ని విష కీటకంమల్లే తొలిచేస్తోంది! భగవాన్!

ఐదేళ్ళుగా తనభర్త మ్యునిసిపల్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. సంవత్సరానికి ఓ యిరవైరూపాయలు మిగిల్చినా - ఈ ఐదేళ్ళలోనూ ఓ వందరూపాయలు గడించేవారే! ఐతే, అందుకు ఆయన బాధ్యుడా? తమకు పెళ్ళయి మూడేళ్ళింది. ఈ మూడేళ్ళనుండీ యింటి ఖర్చంతా తనే చేస్తోంది! తనేం సంపాదించింది? అసలు-తనభర్త తెచ్చే జీతమేపాటిది? కాలంచూస్తే యిలా మండిపోతోంది! ఈ రోజుల్లో అప్పులేకుండా ఉంటేచాలు—ఆస్థి గడించినంత ప్రయోజనం!

నడుస్తోంది లక్ష్మి. నడుస్తూనే ఆలోచిస్తూనే ముందుకు పోతోంది.

కంట్రాక్టర్ గరుడయ్యగారూ, కౌన్సిలర్ గురుమూర్తిగారూ చాలా మంచివారని - అమాయకుడైన రాఘవయ్య

లక్ష్మితో ఎన్నోసార్లు చెప్పేవాడు. వాళ్ళ మంచితనం తెలిసేపోయింది!

ఐతే తనకు దారేది? తనకు వేరే దిక్కెవరున్నారు? 'నాదినాది!' అనిచెప్పుకోగలిగినదేమైనా ఉందా-విచారాలూ, అప్పులూ మినహాయిస్తే?

పెళ్ళై ముచ్చటగా మూడేళ్ళైనా తిరక్కముందే - తన పసుపుకుంకుమలు మటుమాయమై పోవాలా?

ఎక్కడికి వెళ్ళాలి? ఎక్కడికి వెడుతోంది?

'లక్ష్మి మనస్సులో ఓ ఆశాజ్యోతి తళుక్కుమని మెఱపుతీగెలా మెరిసింది. పోయి కమీషనరుగారి కాళ్ళ మీద పడాలి! ఆయన చాలా ఉదారస్వభావుడనీ, మంచివారనీ రాఘవరావే ఎన్నోసార్లు తనతో చెప్పాడు. అక్కడికే వెళ్ళాలి!

ఇప్పుడు టైమెంత? అరగంట దాటలేదూ? గంటకూడా దాటిపోయి ఉంటుంది! అక్కడ వారెట్లా ఉన్నారో ఆలస్యంకాకూడదు! పరుగెత్తి సాగింది లక్ష్మి.

వర్షం చినుకులు, చినుకులుగా ప్రారంభించి క్రమంగా ఎక్కువగా సాగింది.

లక్ష్మి అలిసిపోతోంది! ఆమె గుండెలు ఆగిపోయేట్టున్నాయి! ఆగిపోనీ! ఆయన లేకపోయాక తను ఉండి మాత్రం ఏం చేస్తుంది?

కమీషనరుగారి బంగళా ఊరిబయట మైదానంలో ఉంది. కమీషనరుగారు మంచివారనే అంటారు. కావచ్చును! ఆయన మంచివారైతే తనకు కావలసింది మాత్ర మేముంది! 'భగవాన్! ఆయన హృదయంలో ప్రవేశించు! నా భర్తను బ్రతికించి పుణ్యంకట్టుకో! మిలిగిన నా యావజ్జీవితమూ నీ పూజలకే వినియోగిస్తాను!' అనుకుందామె!

కమీషనరుగారు ఉదార స్వభావులు మాత్రమేకాక, మహా విజ్ఞానులు! వారు 'బ్రహ్మచర్యం' మీద రాసినన్ని మహా గ్రంథాలూ, యిచ్చిన మహోపన్యాసాలూ-కొమ్ములు తిరిగిన స్వాములవార్లు సైతం రాయలేదు! యివ్వలేదు!

బ్రహ్మచర్యంమీద ఆయన అథారిటీ! ఆ సబ్జక్టుమీద ఆయన శతాధిక గ్రంథాలు రాశారు. 'క్వాన్‌టిటీ యేనా? క్వాలిటీ కూడా ఉందా?' అని మనం ప్రశ్నించకూడదు. ఎంతచెడ్డా - పెద్దవాళ్లు పెద్దవాళ్లే! వాళ్ళు చెప్పేవి శ్రీరంగనీతులే!

కమీషనరుగారి బంగళాకు చేరుకునేసరికి-అరగంట పట్టింది. ప్రహారీగోడ సింహ ద్వారందగ్గర కాపలా కాస్తున్న బంట్రోతు 'ఎవరదీ?' అని గర్జించాడు. గొలుసులతో కట్టబడివున్న రెండు వేట కుక్కలు-తమ కొంపలు దోపిడీ అయినట్టు మొరగ సాగినయ్.

'దొరగారిని చూడాలి!' అన్నది లక్ష్మి

'ఇప్పుడా?' అని ఆశ్చర్యమూ, క్రోధమూ కనపరచాడు బంట్రోతు.

'కోపపడకు నాయనా! ఆపదలో ఉన్నాను! అవతల నాభర్త చావుబ్రతుకుల్లో ఉన్నారు! నన్ను దొరగారి దగ్గరకు తీసుకపో!' దీనాతిదీనంగా ప్రార్థించింది.

బంట్రోతు పిల్లలు గలవాడు కావటంచేత ఆమెకష్టాన్నీ, బాధనూ అవగా

పూజ చేసుకున్నాడు. తన వ్యక్తిగత సానుభూతికూడా చూపాడు.

'ఇక్కడనే ఉండు! దొరగారితో పోయి చెబుతా! వారు రమ్మంటే వద్దువుగాని!' అనిలోపలకు వెళ్ళాడు దర్వాను.

దర్వాను వెళ్లి కమీషనర్ దొరగారితో మనవి చేసుకున్నాడు. అప్పుడు దొరగారు ఖాళీగాకూర్చున్నారా? ఊహూఁ! విశ్వశ్రేయస్సు కోరి, లోకకల్యాణార్థం, 'బ్రహ్మచర్యము — స్త్రీ సాహచర్యము' అనే ఉద్గ్రంథాన్ని ఏకాగ్ర దీక్షతో రాస్తున్నారు.

అందుచేత దర్వాను మనవి విని మొదటలో కొంత చిరాకు చూపారు.

ఐనప్పటికీ ఒకానొక యువతి, అంత రాత్రివేళ, తనకోసం వచ్చింది. ఆమె మొరలు వినాలి! తప్పకుండా ఆమెకు చేతనైన సాయం చేయాలి! 'దయయు, ధర్మంబు లోనుగా తలపడేని — కలుగనేటికి! తల్లుల కడుపుచేటు!' అన్నారు పోతన్నగారు.

'అబ్బబ్బ! ఏం ఉద్యోగమో, ఏమిటో! పట్టుమని పదినిమిషాలు విశ్రాంతి చిక్కదు కదా! ఊఁ! సరే! రమ్మనవోయ్! బయట వర్షంకూడా జోరుగా కురుస్తున్నట్టుంది. లోకులు కాకుల్లాంటి వాళ్లు! నేను చూస్తే బ్రహ్మచారిని. ఆమె వయస్సులో వుందంటున్నావ్! పైగా ... బాగా చీకటి పడ్డదికూడాను! ఏం అపనిందలు వస్తాయో? రమ్మనూ!' అన్నారు ఉదారహృదయులైన దొరగారు.

బంట్రోతు వెళ్లాడు. ఆమె ఒక్కతే లోపలకు వచ్చింది. ఆ బంగళాలోని రకరకాలైన గదులూ, వింత వింత సామగ్రీ, తలుపులకూ కిటికీలకూ అమర్చబడ్డ కర్టెన్లూ, వగైరాలు, చూచి, కమీషనర్ గారిని 'సంసారి'గా ఊహించుకున్నది లక్ష్మి. అంతేకాని, ఆ చాతుర్యమంతా బంట్రోతులదే అని ఆమెకెట్లా తెలుస్తుంది?

గదిలోనికి ప్రవేశించిన వెంటనే ఆమె సాష్టాంగంగా కమీషనరుగారి పాదాల మీద వ్రాలిపోయింది. ఆ స్పర్శ దొరగారి మనస్సులో ఒక క్రొత్త చలనాన్ని సృష్టించింది.

'లేవండి! ఏం కావాలి!' మృదువుగా ప్రశ్నించారు దొరగారు.

'రక్షించాలి! మహాప్రభూ! నేనిప్పుడు గొప్ప ఆపదలో ఉన్నాను.'

'అలాగే! చూద్దాం! లేవండి!'

ఆమె లేచి నిల్చుంది. వర్షంలో తడిసి ముద్దలైన వస్త్రాల మాటున ఆమె శరీర సౌందర్యం, ఆకర్షణ, వివిధాంగాల స్వరూపాలు దొరగారు గమనిస్తూనే వున్నారు.

బయట వర్షం తగ్గలేదు. గాలి మరింత దారుణంగా వీస్తోంది. ఆ గాలి ధాటికి కమీషనరుగారు కూర్చున్న గది కిటికీ తలుపొకటి ఊడి పడిపోయింది. ఆ కిటికీలోనుండి రివ్వు రివ్వుమని గాలీ, వడగళ్లూ గదిలోకి వస్తున్నయ్. టిన్ను రేకులతో కట్టబడ్డ మోటారు షెడ్డు మీద పడుతోన్న వడగళ్ళ శబ్దాలు - ఏవో పైశాచిక గీతాలకు భేతాళుడు మ్రోగిస్తున్న మద్దెలల శ్రుతుల్లా వినిపిస్తున్నాయి.

బంట్రోతు వచ్చాడు. దొరగారు కనుబొమలు చిట్లించటం చూచి తిరిగి వెళ్ళిపోయాడు.

'మీ రెవరు?' దొరగారు ప్రశ్నించగా ఆమె ఫలానాారులం అని చెప్పింది, ఎవ రై తేనేం? స్త్రీ రత్న దుష్కులాదపి' అని స్వగతాన్ని ప్రకాశం చేశారు దొర గారు.

ఆమె వినలేదు. వినినా అర్థం కాలేదు. అర్థం కాకపోవటమే మంచిది!

'ఏం కావాలి?'

'నా భర్త మోటారు క్రింద పడిపోయా డు. కుడితొడ ఎముక విరిగిపోయింది. ఆపరేషన్ అవసరమట! వందరూపా యలు ఫీజ్ అడిగారు డాక్టరుగారు!'

'ఊఁ! ఐతే నన్నేంచెయ్యమంటారు?'

'అయ్యా! వారు అయిదేళ్లనుండి మీ క్రింద పనిచేస్తున్నారు. మీ నౌకరును బ్రతికించి పుణ్యం కట్టుకోండి! నా మాం గల్యం నిలపండి!'

కమీషనర్ గారి గుండెల రక్త మాం పాలు కరగలేదు.

'సరే! నా దగ్గర పనిచేసేవాళ్ళందరికీ అడిగినప్పుడల్లా అంతో యింతో సర్దు బాటు చేయటానికి ప్రభుత్వం నా దగ్గర 'ఫండ్' వంటి దేమీ నిలవ వుంచలేదు. ఎక్కడో అప్పో సొప్పో చేసి కార్యం గట్టెక్కించుకోవాలే కాని — యింత రాత్రివేళ నా దగ్గర కెందుకు వచ్చారూ? నేనూ నౌకరునే! నా దగ్గర డబ్బే మీ మూలగటం లేదు!' అన్నారు దొరగారు.

'అయ్యా! దయతలచండి! పోనీ మీరు నాకు ఉచితంగా యీయ నవసరం లేదు. ఇప్పటికి నా ఆపద గట్టెక్కించినట్లయి తే ఆ తర్వాత నాతలతాకట్టుఉంచి అయినా మీ రుణం తీర్చుకుంటాను. మీరు ఉచి తంగా యిచ్చారనే భావిస్తాను!'

'ఊఁ! ఐతే, పోయి ఏ వడ్డీ వ్యాపా రస్తుణ్ణో పట్టుకోండి!'

ఆమె ప్రపంచం యొక్క హృదయం బ్రద్దలయ్యేట్టుగా ఏడ్చింది! లేదు భగవం తుడు లేదు! ఉన్నప్పటికీ, అప్పటికి ఆమె కేకవిని గుండె బ్రద్దలై చచ్చి వుంటాడు!

తాను సాధ్వి. తనకు తన పతిని బ్రతి కించుకునే శక్తిలేదు.

బరువెక్కిన గుండెలను పదిల పరచు కొని, కాళ్లీడ్చుకుంటూ, నెమ్మదిగా 'శలవ్' అని ఆమె వెనక్కు తిరిగింది.

ఇంతలో ఒక వర్ష వాయుతరంగం సన్నగా, మెల్లగా, అందంగా గదిలోనికి ప్రవేశించి, కమీషనరుగారి హృదయంలో చక్కలిగింతలు పెట్టింది. అప్పుడు ఆయన లో అననుభూతమైన కోర్కె లేవో రేకెత్తినయ్. నైట్ క్వీన్ ల వాసనలూ, మైసూర్ అగరువత్తుల పరిమళాలూ ఆయనలో శృంగారభావాలను రేకెత్తిం చినయ్.

ఆయన 'బ్రహ్మచర్యం' మీద అఘా రిటి!

అకస్మాత్తుగా ఆయన హృదయం మృదువైంది. మధురమైన స్వరంతో 'వెళ్లి పోతున్నావా?' అన్నాడు. ఆ స్వరంవిని ఆమెలో తిరిగి ఆశాలత రేకెత్తింది. ఓహో! ఈ ఆశ! ఎంత గొప్పది! ఎంత శక్తివంతమైనది! ఈ ఆశ అనేదే లేని నాడు మనుష్యుడు యిన్ని బాధలతో, దుఃఖాలతో జీవించగలడా? లోకం ఏనాడో శూన్యమైపోయి వుండేది.

'మీపేరు?' మృదువుగా, మధురాతి మధురంగా ప్రశ్నించారు దొరగారు.

'అమ్మ!' ఆమెకు ధైర్యం కలిగింది. తనకు దొరగారు తప్పక సాయం చేస్తారు!

కమీషనరుగారు చిరునవ్వు ఒకటి విసిరి 'నేను వందరూపాయలు అప్పిస్తానే అనుకో! ఆ అప్పును నువ్వెట్లా తీర్చగలవ్?' అన్నారు.

'మావారు నెలకు ఏభై రూపాయలు జీతం తెస్తారు, అందులో ఎట్లాగో నెలకొక యిరవై రూపాయలు మిగిల్చి ఐదు నెలల్లో మీరుణం తీర్చుకుంటాను. కావలిస్తే, మీరు కోరిన వడ్డీకూడా యిచ్చుకుంటాను బాబూ! ఆలస్యమై పోతోంది! ఆ తర్వాత-మీరిచ్చిన ప్రయోజనంకూడా ఉండదు!'

'నేను కోరిన వడ్డీకూడా యిస్తానంటున్నావ్! లాభసాటిగానే ఉంది! ఐతే నీభర్త యికమీదట ఉద్యోగానికి పనికి రాడే! కుంటివాళ్లూ, గ్రుడ్డివాళ్ళూ మాకు అవసరంలేదు!'

ఆమె తలమీద చలిపిడుగు పడ్డదా?

'ఆఁ!' అని ఆమె నోరు తెరచింది. ఏమిటీ కష్టాలు! ప్రపంచంలో ఉన్న దరిద్రాలూ, బాధలూ, కష్టాలూ, అన్నీకలిసి దాడిచేసినట్టు, తనమీదనే విరుచుకపడాలా? — లోకంలో యింకెవరూ లేనట్టు!

'సరే! యిస్తాను!'

'నాకు తెలుసు! మీరు దైవస్వరూపులని! కొంచెం తొందరగా యివ్వండి!' ఆశ!

'తొందరపడకు! బయటచూచావా, వడగళ్ళవాన! కాస్త వర్షంతగ్గాక వెళ్ళొచ్చులే, లేకపోతే నేనే స్వయంగా నిన్ను కారులో దిగవిడుస్తాను! ఐతే, ఊఁ! ఒక్క షరతు ఉంది!'

'ఏమిటి?' ఆమె నివ్వెరపోయి అడిగింది. అతడామెనుచూచి నవ్వాడు. ఆ నవ్వులో-శివుని కంఠంలోని కాలకూటమూ, పులికోరలలోని కార్కశ్యమూ తళతళ లాడినయ్!

'ఛీ! దుర్మార్గుడా! రాక్షసుడవై పోతున్నావ్!' అని హెచ్చరించింది అతని అంతరాత్మ.

'ఇప్పుడు నువ్వు కోరినంత మొత్తమూ యిస్తాను. దానితో నీ కార్యం గట్టెక్కించుకో! పోతే, ఆ రుణం తీర్చుకునే మార్గమేదో చెబుతాను! సాధ్యమైనంత త్వరలో తిరిగి కనిపించు!' అన్నారు.

ఆ 'రుణం తీర్చుకునేమార్గం' ఏమిటో తనకూ తెలుసు! తెలిసిమాత్రం ఏం లాభం? తను స్త్రీ. ఇహ పరాలలో తన భర్తమీద ఆధార పడాల్సిన ప్రాణి. భర్తకు అవసరమైనప్పుడు ఆధారంగా నిల్చే శక్తుల్ని తనకు భగవంతుడుగాని, సమాజం కాని ప్రసాదించలేదు. ఇన్నాళ్లూ తను మహా సాధ్వినని ఎంతో ఉప్పొంగిపోయేది. ఆ మహా గుణం నేడో రేపో ధ్వంసం కావాల్సినదేనా? ఏది ముఖ్యం? తన శీలమా? తన భర్త ప్రాణమా?

'చెప్పు! ఇష్టమేనా?' దొరగారు రిమైండ్ చేశారు. ఇష్టం! ఎవడియిష్టం ఎవడిక్కావాలి! తనకు యిప్పుడు ఆపద కొద్దీ యిష్టమైంది డబ్బు! ఆ డబ్బు దొరగారివ్వాలి! ఆ దొరగారి కిష్టమైనది శీలం!

ఇది ఆలోచించటానికి బొత్తిగా వ్యవధి లేని భయంకర సమస్య!

ఆమె నిజంగానే తల ఊపిందా?

చిరునవ్వు చిందులు త్రొక్కగా — పది సరికొత్త పదిరూపాయల కరెన్సీ నోట్లు ఆమె చేతిలో ఉంచారు దొర గారు. ఉరుకుల్తో ఆమె డిస్పెన్సరీకి వెళ్ళింది.

డిస్పెన్సరీ నిశ్శబ్దంగా పాడు పడిన కోటమల్లే వుంది. ఒక్కగా నొక్క వార్డ్ బోయ్ సింహాంద్వారా ముందు కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. ఆమె అడుగులధ్వని, బరువుగా వేసే నిట్టూర్పులూ విని లేచి కూర్చున్నాడు.

'ఇంత ఆలస్యమా? ఇప్పటి వరకూ చూచి చూచి యిప్పుడే డాక్టరు గారు ఇంటికి వెళ్ళి పోయారు.' అన్నాడు వార్డ్ బోయ్.

'ఏం చెయ్యనూ? ఎక్కడా డబ్బు దొరకనిదే! ఇదిగో, ఇప్పటికి దొరికింది. బాబు! బాబు! ఈ డబ్బు తీసుక వెళ్ళి వెంటనే డాక్టరు గారిని తీసుక రా!' అంది లక్ష్మి.

'ఎందుకూ?' అన్నాడు వార్డ్ బోయ్ ఆశ్చర్యంతో నోరు పూర్తిగా తెరిచేస్తూ.

'ఎందు కేమిటీ? ఆపరేషన్ చెయ్యటానికి. బ్రతికుంటే బలుసాకు తిని బ్రతుకుతాం!

'బ్రతకడ మేమిటీ? మీరు వెళ్ళిన అర గంటకే ఆయన ప్రాణాలు వదిలాడు! శవాన్ని త్వరగా తీసుకపోండి! నాకు భయం వేస్తోంది! నాకీ ఉద్యోగం క్రొత్త కూడాను!'

ఆ మెస్వరం—ఆరోహణలో—ఎటు విన్నా ఓ మైలుదూరం వినిపించింది!

క్రమశః ఆ దుఃఖ తీవ్రత ఉపశమించింది.

నిర్జీవుడైన రాఘవరావును యింటికి తీసుకపోయేందుకని పైకెత్తినపుడు, అతని పాంటు జేబునుండి, నలిగిపోయిన నలభై నాలుగు రూపాయల కరెన్సీనోట్లు జారి క్రింద పడినయ్.

ఆ జీతం డబ్బుతోనే రాఘవరావు అంత్యక్రియలు జరిపించింది లక్ష్మి.

ఆమె కమీషనరు గారికి వంద రూపాయలు యివ్వబోగా ఆయన పుచ్చుకోలేదు.

'భగవాన్! నన్ని పతనంనుండి రక్షించావు. నా కీర్తికి ఎంతో దగ్గరపడ్డ కళంకంనుండి నన్ను కాపాడావు! ఇంకెన్నడూ నా మనస్సులో ఇటువంటి తుఫాన్ సృష్టించకు!' అని అంతరాత్మలో భగవధ్యానం చేసిన కమీషనరు గారు 'వెళ్లొస్తానమ్మా! ఇకమీదట ఈ పాపికి నీ ముఖం చూపకు! నీ కెట్టి ఆపద వచ్చినా, ఎక్కడ వున్నా ఈ పాపికి కబురంపు! చేతనైన సాయం చేస్తాను!' అని చెమర్చిన కన్నీరు జేబురుమాలుతో తుడుచుకుంటూ బయటకు వెళ్ళిపోయారు.

భయంకరమైన భవిష్యత్తు ఆమె మనో నేత్రంలో పెద్ద పులిలా కనిపించి, ఆమె కర్ణపుటాల్లో సింహగర్జనలు చేస్తోంది!

★




## నాడు : నేడు

చరిత్రకందని కాలంనుంచీ ఏదో వొక రూపంలో వ్యభిచారమనేది ప్రపంచంలోని ప్రతితావులోనూ సాగుతూనే వుంది. ప్రపంచంలోని గొప్పపట్టణాలైన లండన్, న్యూయార్క్, పారిస్ మొదలైన వాటి భావిచరిత్రనూ, నాగరికత పెంపునూ వ్యభిచారం ఒకపక్క నిర్ణయించగలదనటం అతిశయోక్తి కాదు. ఇక లండన్‌లాటి మహాపట్టణంలో నాడు, నేడు, వ్యభిచారం ఎలావుండేదో, వుంటోందో చూద్దాం:

60 ఏళ్ళక్రితం సాంగర్ అనే ఆయన 9-వ శతాబ్దంలోనే ఇంగ్లండ్‌లో వ్యభిచారం బాగా విస్తరించివుందని రాశాడు. షేక్స్‌పియర్ కాలానికి యీ వ్యభిచారం ఒకపద్ధతిలో, క్రమశిక్షణకు దిగి, ఒక వ్యవస్థగానే పెంపొంద సాగింది. కొంతమంది వ్యభిచారిణుల్తో వ్యాపారాన్ని సాగించే ఇళ్లూ, తార్పుడుగాళ్ళూ మొదలైన హంగులన్నీ అమల్లో ఉన్నవి. షేక్స్‌పియర్ నాటకాల్లో అక్కడక్కడ యీ వేశ్యాగృహాల్నిగూర్చిన దృశ్యాలు కూడా ఉన్నవి. వీటినిబట్టి ఆనాటి వ్యభిచారం, వ్యాపారదృష్ట్యా అనుసరించబడుతూండేదని అర్థమాతుంది.

18-వ శతాబ్ద చివరిభాగంలో ఒకానొక లండన్ న్యాయాధికారి అంచనా ప్రకారం, లండన్‌లో కనీసం 50,000 మంది వ్యభిచారిణులున్నారు. ఆ తరువాత జరిగిన అంచనాల ప్రకారం వీరి సంఖ్య 80,000 దాకావుంది. మరొక పోలీసు అంచనా వీరి సంఖ్యను 8,000 గానే సూచించింది; ఐతే యీ అంచనాలో కేవలం వ్యభిచార గృహాలలోనే పడివుండి, ఆవృత్తిలో ఉన్నవారే తీసుకోబడ్డారు.

ఇతర సమాజాల్లోవలెనే ఇంగ్లండ్‌లో కూడా వ్యభిచారిణికి గౌరవమేమీలేదు. ఆమె బాహాటంగా తిరిగే సావకాశం లేనందువల్ల ఒకానొక అంతర్గత ప్రపంచంలోనే తిరుగులాడుతూంటుంది. వ్యభిచారం చట్టసమ్మతం కానందువల్ల, నేరస్థురాండ్రుగాకూడా మారిపొయ్యే అవకాశం ఉంది. కనుక భయం భయం

గానే వ్యభిచారాన్ని కొనసాగించవలసి వొచ్చేది. ఐతే ప్రభుత్వోద్యోగులకు లంచాలిచ్చి యీ వ్యాపారాన్ని నిరాఘాటంగా సాగించుకోవటం పరిపాటి.మరో పెద్ద ఇబ్బంది ఏమంటే, వ్యభిచారిణి నేరస్థురాలుగా భావించబడేదే కాని, పురుషుడు వొదిలివేయబడేవాడు. ఇక వ్యభిచార నేరంకింద పట్టుబడిన స్త్రీలకు బర్ట్ వెల్ కోర్టులో కొరడాదెబ్బల శిక్ష విధించబడేది.

యీకోర్టు అధికారి అటు న్యాయాధికారీకాదు; ఇటు మేయరూకాడు, ఒక పెద్దమనిషి. కొరడాదెబ్బలు సరిపడినవన్ని తగిలినవని ఆయన అనుకుంటే, చెక్కసుత్తితో టేబిల్ మీద కొట్టటం ద్వారా శిక్షఅంతమవుతుంది. యీశిక్షతో శారీరకమైన బాధలేగాక, అవమానించబడినాననే ఆత్మసంక్షోభం కూడా కలగకమానదు.

17, 18 శతాబ్దాల్లో కొవెంట్ గార్డెన్ అనబడే ప్రదేశంలోని డ్రూరీ సందు వ్యభిచారిణులకు చాలా ప్రసిద్ధి కెక్కింది. దాంతోపాటు ఆసందు అనేక సాహసకృత్యాలకూ, నేరాలకూ, భయానక దృశ్యాలకూ పుట్టినిల్లుగా భావించబడేది. సాహసానికి అంచెవేసిన చేతులనబడే వాళ్లుకూడా ఆ ప్రాంతాల్లో నివశించేందుకు భయపడేవారు. ఇప్పుడు యీ ప్రదేశమంతా గొప్ప నాట్యశాలలుగానూ, మార్కెట్ గానూ మారిపోయి ఆ పాతవాసన తగలకుండా చేయబడింది.

సామాజిక, ఆర్థికజీవనాల పరిణామంగానే వ్యభిచారం వుండిపోతుంది. సమాజంలోని వ్యభిచారాన్నిబట్టి దాని సామాజిక స్థితిగతులు చాలావరకు అర్థం చేసుకోవచ్చు. ఐతే సమాజంలో తరగతులవారీ ప్రజలు ఉన్నట్లే, వ్యభిచారం లోకూడా తరగతులవారీగా వుండటం సహజమైంది.

లండన్ లో 17, 18 శతాబ్దాల్లోచాలా విలాసయుతమైన వ్యభిచారం అమల్లో వుంది. యీ వ్యభిచారిణులు చాలా ఐశ్వర్యవంతులవటంవల్ల, పట్టణం నలుమూలల్లోనూ మంచి మంచి బంగళాల్లో వుండి, విలాసవంతమైన జీవితానికి అలవడి ఉన్నారు. సేవకులు, ఖరీదైన దుస్తులు, స్వంత వాహనాలూ వీరికి ఉండేవి. చూడగానే ఏ గొప్పింటి పడుచులో అని తోస్తుంది కాని, వ్యభిచారిణి అని అనుమానించేందుకూడా వీల్లేని జీవితాన్ని గడుపుతూండేవారు.

వీరి యీ ఐశ్వర్యానికీ, పెద్దెత్తు జీవితానికీ కారణమల్లా వీరికి ధనవంతులైన ప్రియులుండటమే! కొంతమంది జమీందార్లకు ఉంపుడుకత్తెలుగా ఉంటూన్నప్పటికీ, ధనానికి చాటుగా వ్యభిచరించటంకూడా సర్వసామాన్యం. వీరు ఒక రాత్రి అనుభవానికి 50 పౌనులు (సుమారు రూ 650) వరకూ తీసుకుంటూండేవారు.

ఇంత ఉన్నతస్థాయియిలో జరిగే వ్యభిరానికి తోడుగా, చాలా చౌకబారు వ్యభిచార గృహాలుకూడా కనపడేవి. వీటిని అదుపాజ్ఞల్లో ఉంచుతూ, శుభ్రంగానూ క్రమశిక్షణతోనూ నడిపే యజమానురాలుంటుంది; ఇక్కడికి సామాన్యులు వొచ్చిపోతూంటారు; మరి

రౌడీమూకనూ తాగుబోతుల్నీ జేరినివ్వకుండా మధ్య తరగతి ఉద్యోగస్తుల్నీ, పనిపాటలు చేసుకొని కాస్త గౌరవంగా బతికేవారిని మాత్రమే రానిచ్చేవారు. యీ రకం వ్యభిచార గృహాలు లండన్ లోని థేమ్స్‌నది దక్షిణ తీరాన, సౌత్ పార్క్ అనబడే ప్రదేశంలో ఉండేవి. ఇవి 12-వ శతాబ్దంలోనే వృద్ధి చెందినవని చరిత్రాధారా లున్నవి. ఐతే 18-వ శతాబ్దానికల్లా ఇలాటి గృహాలు, లండన్ పట్టణములోని అన్ని ప్రదేశాలకూ విస్తరించినవి.

పై మధ్యతరగతి వ్యభిచార గృహాల కన్న చాలాచౌకబారువికూడా ఉండేవి. వీరికసలు ఇష్టాయిష్టాల్తో పనిలేకుండానే తమ ఇళ్ళకువొచ్చే ప్రతివారినీ ఆనందింపచేయటమే విధిగా జీవితాల్ని వెళ్ళబుచ్చవలసి వుండేది. వీరిజీవితం చాలా అధ్వాన్నంగా వుంటుంది. గృహ యజమానురాలే డబ్బువసూలుచేస్తుంది. అధికభాగం తను ఉంచుకొని, ఏ కొద్దో వ్యభిచారిణికి ముట్ట చెప్పటం గృహ యజమానురాలి పద్ధతి. బాగాఅందంగానూ, ఆకర్షణీయంగానూ కనిపించేందుకు, మంచిరకం బట్టల్ని గృహయజమానురాలు వీరికి ఎరువిస్తూ వుంటుంది. వీరు ఎప్పుడన్నా బైటకివెళ్తే విలువైన దుస్తుల్తో పరారవకుండా కనిపెట్టబడి ఉండేవారు. వీరు బానిస జీవితంలోనే మగ్గిపోయేవారు. కొంతమంది యీ బాధలుపడలేక, ఏమైతే అవుతుందని పారిపొయ్యేవారు.

అధమాధమ స్థితిలోవున్న వ్యభిచారిణులూ ఉండేవారు. స్వేచ్ఛగా బతుకుతారు. తమకు ఇష్టమైననాడే వృత్తి చేస్తారు. వీరికి ఒక నిర్ణీత ప్రదేశమంటూ లేదు. బజారుస్త్రీలనవొచ్చు. కాస్త చీకటిగావున్న సందుమూలల్లో నిలబడి, కాతాదారుణ్ని పట్టుకోవటంలో ప్రజ్ఞ చూపేవారు. వీరిలో చాలామంది జీవితంలో ఎన్నో ఢక్కాముక్కీలు తిన్న రకం; సర్వసామాన్యంగా తాగుడుకూ జూదానికీ అలవడి నేరాలు చేయవలసిన అవసరం కలుగుతే వెనుదీయనిరకం. వీరైతే జేబు దొంగతనాలు చేసేందుకైనా సిద్ధంగా వుంటారు. వీరి ప్రియులు దొంగలూ, జూదగాండ్రూ, రౌడీలూను. ఏఅర్ధరాత్రివేళనో తాగి ఒళ్ళు తెలియక పడివున్న యీ రసికుల మీదపడి దోచుకునేందుకు, యీరకం వ్యభిచారిణులకు అధ్యక్షతవహించే ముసలిస్త్రీలు బయలుదేరుతూండేవారు.

మంచి బంగళానుంచి, వీధుల్లోదాకా వ్యభిచారం పాకింది. బజారు వ్యభిచారిణులు చొరని ప్రదేశమంటూ లేదు. రైల్వేస్టేషన్లు, థియేటర్లు, హోటళ్లూ, పార్కులూ — ఒకటేమిటి అంతటా వీరు తిరుగులాడుతూనే వుంటారు.

తర్వాత తర్వాత యీ రకం ప్రవర్తనల్లో మార్పులు వొచ్చినమాట నిజమే! యీనాడు కనిపించక పోవచ్చు కాని, ఆ యా కారణాలూ, పద్ధతులూ మారలేదు.

ఒక యజమానురాలి దగ్గిర, యంత్రాల వలె వ్యభిచరిస్తూ జీవితాల్ని గడిపేపద్ధతి యీ నాడు కనిపించదు. ఇందువల్ల వ్యభిచారిణికన్న వ్యభిచారిణుల్తో వ్యాపారాన్ని సాగించేవారు పొందే అధిక ధన లాభాలు తుడిచివేయ బడినవి. వ్యభిచార సంస్థలో యీ 'మధ్యవర్తులు' చాలా

గొప్ప శక్తులుగా భావించబడుతున్నారు. వీరు పెద్ద యెత్తులో గృహాల్ని నడపటం కాతాదారుల్ని వెతికి ఆహ్వానించటం, వారిని ఆనందపరిచి డబ్బులాగటం, కొత్త కొత్త అమ్మాయిల్ని దిగుమతి చేస్తూండటం, యీ అమ్మాయిలు విశేషంగా తాగకుండా చూడటం, ముఖ్యంగా పోలీసుల్ని కూడ గట్టుకోవటం మొదలైన బాధ్యతాయుత కార్యాలను నిర్వర్తించటంలో మొనగాళ్లు. వీళ్ళు ఒకొకప్పుడు యీ అమ్మాయిల్లో ఒకదానికి ప్రియుడుగా ఉండటంకూడా కద్దు. వొచ్చిపొయ్యే కాతాదార్లకన్న, యీ గృహాన్ని నడిపే పురుషుడే అసలు ప్రియుడుగా గౌరవించబడటం కూడా జరుగుతుంది. పోతే గృహాధికారి తన కామ తృప్తికై యీ అమ్మాయిల్ని ప్రత్యేకించుకోకుండా, వ్యాపారం నష్టపడకుండా అందర్నీ వృత్తిలోనే ఉంచే జాగ్రతలు తీసుకుంటూ ఉంటాడు.

అమ్మాయిల్ని వ్యభిచార గృహాలకు దిగుమతిచేయటం అనేక రకాలుగా వుంటుంది. బీద సంసారాలు గడవక అవస్థపడేవారు, ఎటూ తమకూతుళ్ళకు వివాహం చేసే తాహతు లేదు కనుక, కొంత డబ్బుకు కూతుళ్ళను అమ్మెయ్యటం జరుగుతుంది. లేదా ఆమె ఏ యువకునితోనో లేచిరావటం, తెచ్చిన డబ్బు ఐపోగానే అతను పరారవటం జరుగుతుంది.

లండన్ వ్యభిచార గృహాల్లో ఒక్క ఆంగ్లేయులే ఉంటారనుకోటం శుద్ధ పొరపాటు. దేశ దేశాలనుంచీ అమ్మాయిల్ని దిగుమతి చేస్తూనే వుంటారు. పరదేశీయురాల్ని కొంత మొత్తమిచ్చి కొని, వివాహమాడటంద్వారా, వారికి ఇంగ్లండ్ పౌరసత్వం లభిస్తుంది. ఆ తరువాత వారిని వ్యభిచార వృత్తిలో దించి, డబ్బు గుంజటం పరిపాటి. అధవా యీ వ్యభిచారిణి పట్టుబడినా, ఆమెకు వివాహం ద్వారా లభ్యమైన పౌరసత్వం వుంది కనుక, స్వదేశానికి పంపబడే సావకాశం లేదు. శిక్ష పూర్తి కాగానే, మళ్ళీ వృత్తి ఆరంభమౌతుంది.

ఆ నాటికీ, యీ నాటికీ లండన్ వ్యభిచారిణిలో వొచ్చిన గొప్ప మార్పుల్లో దుస్తుల ధారణ వొకటి. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు, సంసార స్త్రీకీ, సానికీ చాలా తేలిగ్గా దుస్తుల ధారణలో భేదం కనిపిస్తూ వుండేది. మొహంమీద అరంగుళం మందాన పౌడర్ రుద్దటం, రక్తవర్ణంలో పెదవులకు రంగు పులమటం, ముక్కులు బద్దలయేట్లు సుగంధ ద్రవ్యాల్ని వాడటం, ఒళ్ళంతా కంపించేట్లు, ముఖ్యంగా రొమ్ముల సౌందర్యం ఉట్టిపడేట్లుగా దుస్తులు ధరించటం ద్వారా వ్యభిచారినిణి, తన వృత్తిని ఒక విధంగా బాహాటంగా తెలియచెప్పేది. ఇప్పుడు యీ పద్ధతులన్నీ తలక్రిందులైనవి. సంసార స్త్రీవలెనే సానికూడా జాగ్రత్తగా, ఇతరులకు అనుమానం లేకుండా అలంకరించుకుంటోంది. ఇప్పటి వ్యభిచారిణిని విడదీయటం చాలా కష్టం.

పూర్వంవలె, యీనాడు లండన్లో వీధి చీకటిమూలల్లో నిలబడి కాతాదారులకోసం వలపన్నే వన్నెలాడులు, కాన్వాస్ చేసి, బేరసారాలు కుదుర్చుకోబడుతోందనేది నగ్నసత్యం; విశేషించి వెస్టెండ్ ప్రాంతంలో యీ పద్ధతి విపరీతం. ఆయా ప్రాంతాన్నిబట్టి వ్యభిచారిణి తాహతూ, ఆమెకు ఇవ్వబడే

ప్రతిఫలమూ భేదిస్తూంటుంది. కాఫీ హోటళ్ళలోనూ జనసమ్మర్దంవున్న వీధుల్లోనూ వ్యభిచారిణి కొంత ప్రణయాన్ని జరిపి, కొతాదారుణ్ని చేజిక్కించుకోవటం సామాన్యపద్ధతి.

హైడ్‌పార్కు, పికడెల్లీ, లైసెస్టర్ స్క్వేర్, బాండ్‌స్ట్రీట్, సోహో మొదలైన ప్రదేశాల్లో 'వీధిలో ప్రణయం' ఇరవై నాలుగ్గంటలూ సాగుతూనే వుంటుంది. ఇందులో సోహో అనబడేది, పరదేశీయులుండే ప్రదేశమైనా, ఇక్కడ కూడా వ్యభిచారం వుంది.

పికడెల్లీ బాండ్‌స్ట్రీట్‌లో వుండే వ్యభిచారిణులు కొస్తనయం. వారికి అద్దె భాగమో, లేక చిన్నగదో వుంటుంది; ఐతే వీరు కొన్నిమైళ్ళ దూరంలో బీటు వేసి కొతాదారుడు తమ ఇంటికి వొచ్చేందుకు ఇష్టపడనట్లయితే, ఏహోటల్ గదిలోనో వ్యాపారాన్ని నడుపుకుంటారు.

రెండో ప్రపంచ యుద్ధానంతరం వొచ్చిపడిన గొప్పమార్పుల్లో, ఉండే నివాసాన్ని గూర్చింది ఒకటి. పూర్వంవలె చప్పున ఒకగదో, అద్దెభాగమో దొరకదు; అందులోనూ వ్యభిచారిణికంటే అసలే దొరకదు; అథవా దొరికిందా ఎంతోపెద్ద అద్దె ఇవ్వవలసి వుంటుంది. అందులోనూ రహస్యమైన స్థలంలేనిదే వ్యభిచారం కుదరదు కనుక, వ్యభిచారిణికి ఇదో గొప్ప సమస్యగా పరిణమించింది. వీరిలో కొస్త డబ్బుదస్కాలువుండి పెద్ద ఎత్తున బతికేవాళ్ళు ఎక్కువ అద్దెలిచ్చి ఉంటూనే వున్నారు. మధ్య తరగతి వాళ్ళు, ఎక్కడో అవసరార్థం ఎవరింట్లోనో వ్యభిచారంలో పాల్గొంటున్నారు. ఇక బజారు రకాలకు పెద్ద ఇబ్బందే ఏర్పడింది. గాలీ వెల్తురూలేని గదుల కూడా వారానికి 15 నుంచీ 20 పౌన్లు (సుమారు రూ 195 నుంచీ రూ. 260) వరకూ అద్దెలుండటం జరుగుతోంది.

యీ పై కారణంగా బజారు వ్యభిచారిణులు ఏ బీచివొడ్డునో, పార్కు మూలల్లోనో, జనసంచారం లేని వీధి చివర్లనో వృత్తి సాగించటం అధికమైంది. ఫలితంగా కొస్త పోలీసు బందోబస్తు అవసరమైంది. రాత్రిపూట ఒక స్త్రీ అనవసరంగా అకారణంగా తిరుగులాడుతున్నట్లు కనిపిస్తే ఆమె అరెస్టుచేయబడి తగిన సంజాయిషీ చెప్పకోనట్లయితే, ఆమెకు 2 పౌనులు (సుమారు రూ. 26) జరిమానా వేస్తారు. యీ బజారు రకాలకు ఇలాటి శిక్షలు తప్పవు.

20 సం.ల క్రితం రాలీస్కాట్ అనే ఆయన వ్యభిచారవృత్తి తగ్గుముఖం పట్టిందని రాశాడు. కాని యీ తగ్గుముఖం కొనసాగ లేదని యీనాడు అర్థమౌతుంది. గత 30 సం.లలోనూ వ్యభిచార నిరోధన చట్టంకింద శిక్షలు వేయబడిన వారిసంఖ్య నూటికి 20 వొంతులు అధికమైంది.

వ్యభిచారం కలకాలంగా వృద్ధి చెందుతూనేవుంది. పూర్వం ఏయే కారణాలున్నవో, యీనాడు దాదాపు అవేకారణాలు సరిపోతవి. రంగుమారినా, వస్తు స్వభావం మారలేదు. గత రెండు ప్రపంచయుద్ధాలూ, వ్యభిచారాన్ని తగ్గించలేదు సరికదా, పెంచినవి. దేశదేశాల స్త్రీలూ లండన్‌లో వ్యభిచరిస్తూనే వున్నారు. ముందుముందు ఇది ఏరూపాన్ని పొందుతుందనేది చెప్పటం కష్టమైనా, గతచరిత్రకు భిన్నంగా ఉండగలదనే నమ్మకమూ లేదు. ★



# శశీ... సుశీ... లూసీ

రచన
కె. పి. బాబు

శ్రీశైలంగారికి పాతజబ్బు తిరగబెట్టింది. అది అందరికీ మామూలుగానేవున్నా, ఆయనకి మాత్రం ఈసారేమో చాలా బెంగకల్గించింది. ఏదో దీర్ఘంగా యోచిస్తూ వుండటం, డాక్టర్లకన్న లాయర్లతో సంప్రదింపు లెక్కువ చేయడం అదివరకెన్నడూ పట్టించుకోని పనుల్లో ఆసక్తిచూపడం అందరికీ కొంత వింతగానే తోచింది.

ఉన్నట్లుండి ఒకనాడు నారాయణరావుని చేరబిల్చాడాయన. తండ్రి మంచానికి కాళ్లవైపున కుర్చీలో కూర్చుని ఆయన చెప్పే దాలకించడానికి సిద్ధమైనాడు అబ్బాయి. ఆ గదిలో అప్పుడు వాళ్ళిద్దరేఉండే ఏర్పాట్లు శ్రీశైలంగారే చేసుకొన్నారు. అదీ ఆయన తత్వానికి భిన్నమైనది, కనుకనే నారాయణరావు సైతం విస్మయాసక్తులతో కూర్చున్నాడు, ఓపిగ్గా! కాని, చాలసేపటివరకూ శ్రీశైలంగారు నోరు మెదపలేదు.

ఆ నిశ్శబ్దం, ప్రశాంతత ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే భరించలేక నారాయణరావే మెల్లగా 'ఏమిటి నాన్నా-ఎందుకు పిలిచావు చెప్పు?' అని కదిపాడు. అప్పటికి తేరుకొని శ్రీశైలంగారు కొడుకు ముఖంలోకి చూస్తూ 'మరేమీ లేదురా సుబ్బక్క ఇంకా రాలేదేమా అని ఎదురు చూస్తున్నా. నేను వ్రాసిన ఉత్తరం పోస్టయింది కదూ?' అన్నాడు.

తనని చేరదీయటానికీ, సుబ్బమ్మత్తరాకకూ గల సంబంధమేమిటో తెల్సుకోవాలనే ఆత్రం ఎక్కువైంది నారాయణరావుకి.

'నా చివరికోర్కె కూడా తీరిపోతే, అందరికీ ఆనందం కల్గించినట్లవుతుంది; నేనూ ఇక ఈ బంధనాలనుండి శాశ్వతంగా-సుఖంగా...' అంటూ వేదాంత ధోరణిలో పడిపోయారు శ్రీశైలంగారు.

ఆయన చివరికోర్కె ఏమిటో అర్థం కాక-'ఏమిటినాన్నా?' అనడిగాడు నారాయణరావు.

'ఏముంటుందిరా, సాధ్యమైనంత తొందరలో నీ పెళ్లి కానిచ్చేస్తే, ఇక నేనెప్పుడు ఎట్లా చచ్చినా బాధవుండదనుకో!' అన్నారాయన.

సుబ్బమ్మత్త కూతురు సుశీల గుర్తుకు రావడంతో ఇక నాన్నగారు చెప్పబోయేది తేలిపోయింది నారాయణరావుకి. అతను వివర్ణుడయ్యాడు, నిశ్చేష్టుడయ్యాడు, అంతేచాలదు-చాలక్రుంగిపోయాడు!

'కాని, నాన్నగారూ — ఈ సంగతి నాకింతకాలం ఎందుకు చెప్పలేదూ?' అనడిగాడు సూటిగా.

'ఏం?' అని ఆయన అడిగేసరికి 'మరేంలేదు, నేనవతల మరో అమ్మాయిని పెళ్ళాడ్తానని—' అని చెప్పనారంభించాడతను. కాని మధ్యలోనే శ్రీశైలంగారు ఆవేశంకొద్దీ 'అయితే, ఆ సంగతి నా కింతకాలం నీవెందుకు చెప్పలేదూ?' అనడిగేశారు!

అబ్బాయి దానికి జవాబివ్వలేక తల దించేసుకొన్నాడు. కాని, శ్రీశైలంగారికి దిగ్భ్రమ కల్గినట్లయింది. ఆయనకెంతో ఉద్రేకం, క్రోధం వచ్చాయి—కాని, గారాబాల కొడుకు కనుక తమాయించుకొన్నారు.

'నారాయణా, ఇలా చూడరా! సుబ్బక్క గతి ఇట్లా అవుతుందని ఎవరమైనా కలనైనా ఊహించగల్గామా? ఆ చచ్చినోడు పోయేవాడుఊరికే పోక దాని సొత్తిన ఇన్ని ఋణాలు పారేసి మరీ పోయాడుగదా! ఉన్నకాస్తా ఆ అప్పులోళ్ళ ముఖాన్నకొట్టి పెళ్ళీడుకొచ్చిన ఆడపిల్లతో అది ఎన్ని అగచాట్లు పడ్తుందో నీవెరుగవూ?...' శ్రీశైలంగారి కంఠంగాద్గదికమైంది—'తోడబుట్టిన వాడ్ని నేనే ఆదుకోలేకపోతే, ఇక లోకానికేం పట్టుందిరా దాని బాధ? చెప్పరా, చెప్పూ?' అన్నారు గట్టిగా.

కొడుకు మౌనం ఆయనకి కాస్త బలం చేకూర్చింది. అందుకని ఇంకా చెప్పనారంభించారు; కాదు—నచ్చజెప్పసాగారు. 'అబ్బాయ్, ఇటుచూడు! ఇద్దరం ఒకరిమీద ఒకరికిగల నమ్మకంతో మన మాశించింది జరుగకపోదనే ధీమాతో పొరబాటే చేసుకొన్నట్లు తేలిపోయింది! గతఃనాస్తి—నీసుఖమే నా సుఖంగా, నీబాధే నాబాధగా పెంచుకొచ్చాను. కాని, నా తోడబుట్టింది, నీ మేనత్త ఎటువంటి దుస్థితిలో వుందో కాస్తచూడు. అటు 'నా' అనేవాళ్ళు కరువయ్యారు! ఇటు దారిద్ర్యం పెళ్ళీడు కొచ్చినా వరులు రాకుండావున్న ఆడపిల్లబాధ! ఈ రోజుల్లో అట్టి స్థితిలోపడి బ్రతికి చెడ్డవారెంత ఆవేదనలందుతారో, ఎట్టి కష్టనష్టాలకు గురౌతారో కాస్త ఆలోచించు! చదువుకొన్నావు, సంస్కారమూ వుందిగదా — ఆలోచించి చెప్పరా!' అన్నారు.

'ఏది ఏమైనాసరే, సుశీలకోసమని నా శశికళని వదులుకోలేను నాన్నా!' కుర్చీలోనుండి లేస్తూనే చెప్పాడు నారాయణరావు.........

'ఏమిటీ? అన్నీ నీ మాటలేగాని, నా మాటొకమైనా - అందులో నా సోదరి కోసం చేయదల్చిన సాయమైనా చెల్లకూడదన్నమాట? ఇదిమాత్రం సహించలేనుసుమా!' అన్నారు శ్రీశైలంగారు సగంలేచి......

'అంటే...?'

'అంటేనా? నువ్వు సుశీలనే చేసుకోవాలి!'

'అంతేనా?'

'అంతే!'

నారాయణరావు గిర్రున తిరిగి బయటకు పోబోతూ 'అయితే ఆపెళ్ళి మీరు చూడలేరని చెప్పడానికి చాల చింతిస్తున్నాను!' అన్నాడు.

శ్రీశైలంగారికి తాళలేక పోయారు; ఉగ్ర నరశింహావతార మెత్తారు.

'అట్లాగా? అందాకా వచ్చావూ? ఇందుకేనా నాయనా-ఇంత అల్లారు ముద్దుగా పెంచి, ఇన్ని చదువు సంధ్య లబ్బించి, ఇట్లా విలాస పురుషునిగా లోకంలో వదిలింది? అహో!' అని వెటకారంచేసి 'అయితే అబ్బాయ్! బాగానే వుందికాని, ప్రస్తుతమున్న ఆస్తిపాస్తులన్నీ నా కష్టార్జితాలని నీవెరిగే వుంటావ్! నీకందులో ఇంకొక రాగిపైసా ముట్టదని తెలియ జేయడానికెంతో విచారిస్తున్నాను! ఇచ్చేదేదో ఆ అభాగ్యురాలు సుశీలకి కొంత ఇచ్చేసి, మిగతాదంతా ఏ దానధర్మాలకో ధారపోస్తాను, అంతో ఇంతో పుణ్యమైనా వస్తుంది!' అన్నారు.

గుమ్మందాకా పోయిన నారాయణ చట్టునఆగి, వెనుదిరిగిచూస్తూ 'అంటే— మీ ఆస్తితో నన్ను బంధించాలను కొంటున్నారన్నమాట? ఆ పిచ్చిభ్రమలనుండి మేల్కొనండి! ఇక ఈ గుమ్మమే తొక్కదిలేదు! ఏదో దేవుడిచ్చిన రెక్కలున్నాయ్, మీ దయాధర్మం మూలంగా కల్గిన విజ్ఞానసంపదా వుంది. చాలు బ్రతకడానికి! ఇక శెలవ్!' అని చకచకా సాగిపొయ్యాడు.

## 2

'శశీ, శశీ!'

'ఆ-ఆ! ఏమిటా సంబరం?'

'ఇన్నాళ్ళకి నాజన్మ తరించిందిగదా, శశీ!'

'ఏమిటోనబ్బా!'

'ఏమిటని ఇంకా మెల్లిగా అడుగుతున్నావ్? ఎప్పుడా, ఎప్పుడా అనిఎదురు చూస్తున్న అవకాశం ఇప్పటికి లభించింది. అంతరాయాలన్నీ తీరి పోయి ఎంత హాయిగా తేలిగ్గా వుందిప్పుడూ...!

'ఇంతకీ సంగతేమిటో చెప్పలేదు-' అని శశికళ చిరాకుపడగా, తేరుకొని నారాయణరావు జరిగినదంతా చెప్పాడు.

ఎంత ఉషారుతో అతనదంతా చెప్పాడో, అంత నిరుత్సాహ మందిందామె, అంతా విన్నతరువాత!...

చాలసేపామె మౌనంగా, నీరసంగా వుండి పోవడంచూచి వింతచెంది నారాయణరావు 'ఏమిటాలోచిస్తున్నావ్ శశీ?' అనడిగాడు మెల్లిగా.

'ఏమీలేదు నారాయణ్! ఇంత అమాయకుడివీ, అర్భకుడివీ, నీవిక ఎట్లా జీవిస్తావోగదా అని విచారిస్తున్నానంటే!'

నారాయణ నవ్వాడు—'ఓ - అదా! ఆబెంగ ఇంక వదిలేయ్‌శశీ! ఇటుచూడు నీ వర్ధాంగివై ఉండగా నేనెన్ని పర్వతాలైనా ఇట్టే ఎత్తిపారేయగలను! ఎన్ని సముద్రాలనైనా ఈదివేయగలను; ఇంకా—'

'అపావు నీకవిత్వం! లోకజ్ఞానం, జీవితానుభవం లేనివాళ్ళతో వచ్చి

చిక్కులే ఇవి!' అని ముఖం చిట్లించు కొన్న శశికళనిచూచి, నారాయణ కృంగి పోయాడు.

'అదేమిటి శశీ! అలా బాధపడ్తావ్? నీకేం నాకేం? ముందుకి పోవాలేగాని, కళ్ళు కద్దుకొని ఉద్యోగాలివ్వరా? ఇంకేం కావాలంట?

'హుఁ! వినడానికే భీభత్సమైన కష్టాలని, ఇకకోరి తెచ్చుకోమంటావ్? భలే వాడివే!'

'అదేమిటి శశీ! ఆదర్శంగా జీవించా లనుకొన్న మనబోటి వారికెన్నో అడ్డంకులూ అవీ కల్గించి, బాధించ ప్రయత్నించడం సంఘాని కలవాటేగదా?

'ఆదర్శం! అడ్డంకులు! సంఘం! హుఁ! పుస్తకాలు కాదోయ్ జీవితమంటే!'

'అంటే__?'

'ఇందులో ఆదర్శమేమిటండి? అది లేనప్పుడిక సంఘమేమిటీ, అడ్డంకులేమిటీ? నామాటవిని శుభ్రంగా వెంటనే వెళ్ళి మీవాళ్ళకి కల్సుకో!'

'కల్సుకొని__?'

'కల్సుకొని సుఖంగావుండు!' అని సలహా ఇచ్చిందామె.

'శశీ__ఏమంటున్నావ్ శశీ! ఇంతేనా మనప్రేమ!'

'ప్రేమ! అంటే ఏమనుకొన్నావ్ మిత్రమా? నేను నీకూ, నీవు నాకూ ఇష్టమైనాం. అన్నీ కలిసివస్తే ఇద్దరం దంపతులమై హాయిగా కాలం గడప వచ్చునని ఆశించాం! ప్రయత్నించాం కూడా!...మన ప్రయత్నాలు సఫలం కావడంలేదు కనుక, ఇక అట్టి ఊహాలు విరమిద్దాం. అంతేగాని, అలాకాకుండా పిచ్చి భ్రమలతో ఉన్న కాస్త సుఖశాంతుల్ని సైతం భగ్నంచేసుకొని వీధికెక్కి ఆకలితో అవమానాలతో దిక్కులేని బ్రతుకు బ్రతకాలని ఎవరూ ఆశించరు! ఎవరేమో, నేనొప్పుకోను!'

'శ__శీ!'

'నారాయణ్! నామాటవిను - మీ వాళ్ళతో అలా ఘర్షణపడి ఇలావచ్చి, నాదగ్గర బాతాఖానీకొట్తూ కూర్చుంటే ఎవరన్నాచూస్తే బాగోదు; అపార్థాలూ పుట్టవచ్చు!'

'బాతాఖానీ! అ పా ర్థా లు!...' నారాయణరావుమతి చలించినట్లయింది. ఏమీతోచక ఏమేమో గొణుక్కొంటూ లేచి వెనుదిరిగి పోనారంభించాడు.

## 3

ఏటి ఒడ్డున, వెన్నెట్లో ఇసుకలో కూలబడి ప్రపంచంలో తానింతకాలం ఎరుగనట్టి విశేషాలెన్ని ఇప్పుడెరుగగల్గాడో తేల్చుకోసాగాడు నారాయణరావు. ఇంకా ఎన్నెన్ని ఇటువంటివి ఎరుకపడకుండా వున్నయ్యో అదీ ఆలోచించ సాగాడు!

కాని ఇటువంటి విశేషాలు నూతనమైనవి తెల్సుకొంటున్నకొద్దీ ఉత్సాహం, ఆనందం కలుగవలసింది పోయి__ నిస్పృహ ఆవేదన ఉద్భవిస్తుంటాయ్ కారణం ఏమిటా? అన్న ఆలోచన ఒకటి మధ్యలోకలిగి, మనస్సుటు మళ్ళిపోయింది

అంతలో కొందరా ప్రాంతానికొచ్చారు. 'వచ్చినవాళ్ళం ఎట్లాగూ వచ్చాంగదా! కాస్త ఈ ఏటిఒడ్డునా వెతికి పోదాం!...అయినా, ఇక దొరకదులే, అభిమానంగలబిడ్డ! కాని పాపం

ఆయనేనై పోతాడో గదా!' అనుకొంటున్నారు వారిలో వారు. అదివిని చటుక్కున లేచి కూచున్నాడు నారాయణరావు.

అక్కడ అట్లా హఠాత్తుగా నారాయణరావు కన్పించేసరికి వారిలో కలిగిన సంతోషానికి అంతులేదు!

'బాబూ! నీవల్లా వెళ్ళిపోయావ్-మీ నాన్న ఇలా విరుచుకు పడిపోయాడు బాబూ!' అని వాళ్లు చెప్తుంటే, వింటున్న నారాయణరావు గుండెలొక్కసారి గొల్లుమన్నాయ్!

'డాక్టర్లువచ్చి నానా తంటాలుపడితే ఎట్లాగో స్పృహ వచ్చింది. కాని, ఆయన మాత్రం 'నారాయణా — నాయనా' అనే పలవరిస్తున్నారింకాను. నిన్నెట్లాగైనా తెచ్చి చూపెట్టాలనీ, లేకపోతే—'

'లేకపోతే-?' అనడిగాడు ఆదుర్దాగా నారాయణరావు.

'మరేం లేదు బాబూ! ఆయన జీవించడం కష్టమని చెప్పారు డాక్టర్లు! అందుకనే, నమ్మకం లేకపోయినా, నీకోసం ఆశగా నలుగురం నాలుగుమూలలా వెతుకులాడ్తున్నాం అప్పటినుండీ!'

నారాయణరావుకి కళ్ళవెంట నీళ్లు జలజలా రాలాయ్! 'మనం వెళ్ళేదాకా ఆయన—ఆయన-' అని ఇంకేమీ అనలేక 'నాన్నా' అని అరచి గబగబా ఇంటిదిశకు నడువసాగాడు.........

ఇల్లు చేరేసరికి సుబ్బక్కా సుశీల కూడా వచ్చివున్నారు. అంతా గంద్రగోళంగావుంది! నారాయణరావు మాత్రమేమీ లక్ష్యపెట్టకం, తిన్నగా వాళ్ళ నాన్నపడకని చేరుకొన్నాడు.

'నాన్నా! వచ్చాను నాన్నా! ఇలా చూడు. నన్నుచూడు - నారాయణ్ణి, నీ నారాయణ్ణే నాన్నా! నిన్ను కాదని, బయటకిపోయి ఎన్నో తెల్సుకొచ్చాను! ఇంతకాలం నా ఇష్టమే నీఇష్టంగా జరుపుతూ వచ్చావు, ఇక నీ యిష్టమే నా యిష్టంగా చేస్తానుక్షమించవూ?' అంటూ భోరున ఏడ్చాడాయన మీద పడి.

అతనిరాక సుగుణమే కల్గించింది; డాక్టర్లశ్రమ ఫలించినట్లయిది! పర్యవసానంగా శ్రీశైలంగారు తిరిగి కోలుకొన్నారు-అంతేకాదు, తన చేతులమీదుగానే ఒక్కగానొక్క కుమారుడి వివాహాన్ని తన అభాగ్యసోదరి కుమార్తెతో అద్భుతంగా జరిపి బంధుమిత్రుల అభినందనలు చూరగొని, శ్లాఘనీయుడైగాని ఆయన కన్నుమూయలేదు!......

పితృవాక్య పరిపాలకుడై ప్రియురాల్ని సైతం ఒదులుకొన్న నారాయణరావుకి అందమైనభార్య, అరలక్షరొఖ్ఖమూ, పొలంపుట్రా, ఇల్లూవాకిలీ గొడ్డూగోదా ... మంచి వ్యాపారం చేజిక్కాయ్! కాని... తా... ఆశించిన సుఖం, శాంతి మాత్రం కరువైపోతూ వచ్చాయి!

నారాయణరావుకో ప్రియురాలుందనీ, కాని శ్రీశైలం మామ మాత్రం సహృదయుడు కనుక తమ నుద్ధరించడానికి నడుం బిగించి, చివరికి కొడుకుని ఇంటిలోనుండి తరిమెయ్యడానికైనా తెగించాడనీ, కట్టుబట్టల్తో పోయిన నారాయణరావు తన్ను ప్రియురాలు నిరాకరించగా, గతిలేకనే ఇష్టంలేకున్నా విధిగా ఈ పెళ్ళి కొప్పుకున్నాడనీ సుశీల అభిప్రాయ పడ్తూ వచ్చింది.

ఆ అభిప్రాయంతోనే ఆమె నారాయణరావుని పరీక్షిస్తుండేది. అతని కిప్పటికీ తనమీద అణుమాత్రమైనా అనురాగం లేదని ఆమె అనుకొంటూ తానూ అతనిపట్ల అదే విధంగా ప్రవర్తించనారంభించింది!

'గత జలసేతు బంధనెందుకు? ఇక ఈ విధంగానైనా కుదురుకొని చక్కగా వ్యాపారం చేసుకుంటూ, సుఖంగా సంసారాన్ని నడుపుకొందా' మనే నిర్ణయాని కొస్తున్న నారాయణరావుకి సుశీల చాలా చీకాకుగా రూపొందసాగింది.

ఇంటికి కొంచెం ఆలస్యంగా వస్తే చాలు — తానే ప్రియురాలింటికో పోయి వస్తున్నట్టే సుశీల పరిగణించేస్తుంది! పోనీ, అనుకొని వేళకి ఇంటికొచ్చేస్తుంటే — 'ఎవరూ కన్పించనందువల్లో, లేక దరి చేరనివ్వనందునో, గతిలేక ఇట్లా—' అంటూ ఏమేమో నోటికొచ్చినట్లు, వినీ విన్పించనట్లు విసుక్కోవడం, సణుక్కోవడం— ఒకటే గొణుగుడు!

క్రమేణా వ్యాపారంకూడా మందగించసాగింది. 'అవును— దానిమీద శ్రద్ధాసక్తు లుంటేనా?' అంటూ అమ్మలక్కలతో తానే చెప్పుకుంటుండేది సుశీల. 'అయితే దేనిమీద మీ వారి దృష్టి?' అన డిగితే 'దేనిమీదో! దానిసంగతి ఖచ్చితంగా తెలిస్తే ఇంతకాలం ఊరుకుంటానూ'. అని కాళికారూపం దాల్చి,అప్పుడే నడుంకి కొంగుచుట్టేసేది!

పెదవిదాటితే పెన్న దాట్తుందన్న పెద్దలసూక్తిని దృష్టిలో వుంచుకొని, నారాయణరావెంతో సహనంతో అన్నీ సహించుకొంటూ వచ్చాడు, కాని, అటు వ్యాపారంలో నష్టాలు, ఇటు సంసారంలో కష్టాలు అతన్ని దుర్బలుడ్ని చేసేశాయ్...

ఒకనాడింటికి రాగానే, ఏదో అవసరంవచ్చి 'సుశీ!' అని కేకేశాడు.

దగ్గర్లోనే వుండికూడా ఆమె పలకలేదు. తన్ను కాదనట్లే ఊరుకొంది!

'నిన్నే — సుశీ!'

'ఎందుకలా చిర్రూబుర్రూ? — ఇక్కడలేదని తెలియదామాత్రం? అంత మతిమరుపైతే ఎట్లా?' అన్నది కటువుగా.

నారాయణరావు తెల్లబోయి 'ఏమిటంటున్నావ్?' అన్నాడు.

'ఏమంటానూ? — మీ 'శశి' గారిక్కడ లేరని మనవి చేసుకొంటున్నాను!' ఎంతో వెటకారంతో అంది.

అంతే! ఆ వెంటనే ఆమె చెంప 'ఛెళ్ళు' మంది!......

జీవితంలో ఒకరిమీద చేయి చేసుకోవడాని కదే ప్రథమం అతనికి!

— ఒకరితో దెబ్బతినడాని కదే మొదలామెకి!! ఇద్దరూ అనుకోకుండా జరిగి పోయిన ఆ సంఘటనకి బిత్తరబోయి తలలు దించేసుకొని కంపించిపోయారు, కొన్ని క్షణాల సేపు...

తత్ఫలితంగా సుశీల నుండొక జాబు సుబ్బమ్మగారిక్కి పోయింది. నారాయణరావు ఇంటికి రావడం తగ్గించుకొన్నాడు!

జెట్ఫైటర్‌లా వచ్చేసింది —సుబ్బమ్మ! రావడమే 'ముండ మోజులోపడి, మా అమ్మాయిని చావగొట్టి చెవులు మూస్తున్నాడమ్మా!' అంటూ ప్రచారం చేసుకుంటూ మరీ వచ్చింది. సుశీల పుట్టింటికి ప్రయాణమైంది!

ఏదైతే జరుగరాదని ఆశిస్తూ, అంత కాలం ఓర్మితో కృషిచేస్తూ వచ్చాడో-, అదంతా జరిగిపోయాక, ఇక నారాయణ రావు దేనికీ అడ్డు చెప్పలేదు.

కాని, సుశీలని తీసుకుపోయే ముందు మాత్రం అత్తగారితో ఇలా చెప్పాడు గట్టిగా— 'ఇదిగో — జరిగిపోయిం దేదో జరిగిపోయింది! ఇప్పటికీ మించి పోయిం దేమీ లేదు. గుట్టుగా, అను గుణంగా కాపరం చేసుకొని సుఖపడ దల్చిందా, మీ అమ్మాయిని ఇక్కడేవుండి పొమ్మను. అంతా చెప్పినా, ఊరికే ముఖంమీదే తిట్టడం తప్ప మరేమీ తెలి యనట్లు సుబ్బమ్మ కూతుర్ని తీసుకు పోయింది!...

అలా కొంతకాలం జరిగిపోయింది... కులపెద్దలు కొందరు మధ్యవర్తులుగా వచ్చారు. 'అబ్బాయ్! జరిగిపోయిందేదో జరిగిపోయింది! నీవేమో చదువుకున్న వాడివి, లోకజ్ఞానం తెలిసిన వాడివి! నీవూ ఇట్లాచేస్తే ఎట్లా చెప్పు?' అన్నారు. నారాయణరావుకి చాలా ఆశ్చర్యంవేసింది. అయినా, దూరం ఆలోచించాడు. 'సరే-తప్పొప్పు లేమిటో ఎవరివో అదంతా వదిలేస్తానిక! మీరంతా వచ్చి ఇంతగా చెప్పుతున్నారు గనుక- ఒకటే పరిష్కారమార్గముంది. అదే చెప్తాను, చూడండి వీలైతే!' అని వాళ్లకు వాళ్లే వెళ్లిపోయారు గనుక, సుశీలని వాళ్ళే తెచ్చి నాకప్పగించి వెళ్లమనండి! చక్కగా ఏలుకొంటాను. అంతేగాని, నేనుపోయి తెచ్చుకొని ఏలుకోవడ మన్నది ఇక కలలోకూడా జరుగదు. అంతేకాదు, వారలా చేయలేనప్పు డిక మీదట ఏమిజరిగినా వాటికి పూచీ నాదే మీ ఉండదనీ చెప్పేస్తున్నాను-అంతే!'

అతని మాటలన్నీ సమగ్రంగానూ, సవ్యంగానూతోచి, సంతృప్తితో పెద్దలు వెళ్లిపోయారు. కాని, సుశీల తనకుతానై ఎన్నడూ తిరిగిరాలేదు! నారాయణరావు సైతం ఆడినమాట తప్పలేదు!......

అటువంటి దాంపత్యంతో కంటే, ఇటువంటి వ్యాపార వ్యాపకాల్లోపడి జీవించడమే చాల తేలిగ్గానూ, హాయి గానూతోచి, చాలాకాలం అట్లానేవుండి పోయాడా అభాగ్యుడు!

## 5

ఒకసారి నారాయణరావు వ్యాపా రార్థం మదరాసుకు వెళ్ళాడు. అక్కడ ఒక సాయంత్రం సెంట్రల్ స్టేషన్ ముంగల్లో బస్‌స్టాపింగ్‌వద్ద నిలబడి ఏదో ఆలోచిస్తున్నాడు.

హఠాత్తుగా అతని వీపుమీద ఎవరో పొడిచినట్లన్పించి, కంగారుగా వెనుదిరిగి చూచాడు. ఎదురుగా 'కిలకిల' నవ్వుతూ 'లూసీ' కన్పించింది!

'నువ్వా? ఎన్నాళ్లకెన్నాళ్లకు!' అని పరామర్శించాడు నారాయణరావు.

'అవున్లే-ఇన్నాళ్లకి నీవు కన్పించా వన్నది మరిచిపోయి, పైన ఆనింద నాపైకి తోస్తున్నావే? అంతేలే - మగాళ్లు ఏం చేసినా చెల్లుబడి అవుతుంది. బాగా కూడా వుంటుందీ లోకానికి!' అంటూ దెప్పి పొడిచింది లూసీ, గొడుగునాడిస్తూ

'అదేమిటి లూసీ, అట్లా అంటున్నావ్ మనిషితోబాటు మనసులూ మారి పో తున్నట్లున్నాయే!' అని నవ్వాడతను.

'ఆహా!...అదిసర్లేగాని, శశినలా

అన్యాయం చేయడం బాగుందా-చెప్పు అనడిగేసిందామె. నిర్ఘాంత పోయాడతను. 'ఏమిటి లూసీ! ఏమంటున్నావ్ నీవు!' అన్నాడు.

'ఏమనుకోవాలింక!' అంటూనే టైం చూచుకొని 'అరె...చాల టైం అయిపోయింది! సారీ, డ్యూటీలోకి పోవాలింక. రేపు ఉదయంగానివస్తే, చాల మాట్లాడుకోవచ్చు. తప్పకరా, ఇదిగో నా ఎడ్రస్!' అంటూ ఆమె చిరునామా తెల్పింది.

'ఇవ్వాళ తప్పకుండా నేను ఊరికి పోవాలి, క్షమించు ఈసారికి - లూసీ!'' అంటున్న నారాయణరావు మాటలు లెఖ్ఖ చేయకుండానే లూసీ, గొడుగాడిస్తూ పోతూనే — 'మిస్టర్! శశికళ ఇప్పుడిక్కడేవుంది, తెలుసా? రేపునన్ను తప్పక కల్సుకో!' అని చెప్పి మరీ ఎదురుగావున్న జనరల్ హాస్పిటల్ లోకి పోయింది.

ఆమాటలు విన్నతరువాత, ఇక నాటి రాత్రి స్వగ్రామానికి పోలేక పోయాడు నారాయణరావు. ఆరాత్రి నిద్రలోనే కాలక్షేపం చేశాడు.

ఉదయాన్నే కాఫీత్రాగి తిన్నగా లూసీ ఇంటికి పోయాడు...

లూసీ, నారాయణరావు శశి కళల స్కూల్ మేట్! ఒకప్పుడు వారందరి మధ్య స్నేహబంధాలు బలీయంగా వుండేవి...తరువాత్తరువాత ఎవరికి వారు చీలిపోతూ వచ్చారు! లూసీ ఆంధ్ర క్రైస్తవ కన్య! ప్రస్తుతం నర్సుగా జీవిస్తున్నది.

నారాయణరావు రాగానే లూసీ అన్నా, చెల్లెలూ-తల్లీ తండ్రీ ఎదురై, ఆప్యాయంగా ఆహ్వానించారు.

వారందర్నీ పరామర్శించాక గాని, లూసీని ఒంటరిగా కలసి మాట్లాడే వీలు కలుగక పోయింది.

చివరికి లూసీ చెప్పింది—'నీ వంతగా శశిని ప్రేమించీ, చివరి ఘట్టంలో మీ నాన్నకి లోబడిపోయి, మీ బంధువు అమ్మాయిని చేసుకోవడానికి నిశ్చయించుకొని, దీన్ని తప్పించుకోవడానికి కని భలే ప్లాన్ వేశావటే—?'

నారాయణరావు నోరావలించాడు! 'నిన్ను పెళ్ళాడితే మా నాన్న దమ్మిడీ దక్కనివ్వనంటున్నాడు. పైగా ఇంట్లోంచి తోలేస్తా నంటున్నాడు. ఏం చేద్దాం చెప్పు అన్నావట! పాపం, దానిలో గల కీలకం కనిపెట్టిన వాడివిగనుక, చక్కగా నాటక మాడావ్!'

'నాటకమా?'

'కాక?—కష్టాలంటే దానికి కంపర మెత్తుతుందనీ, పెద్దమేడ, చిన్నకారు— వినోదాలు విలాసాలతో జీవింప చేయగల స్తోమత గలవాడిని మాత్రమే అది పెళ్ళాడాలని ఇష్టపడ్తుంటుందనీ పసిగట్టిన వాడివి కనుకే, తమాషాగా తేలిగ్గా దాన్ని తప్పించుకొని, నీ క్కావలసిన పిల్లని పెళ్లాడేశావన్నమాట!' అని లూసీ నిట్టూర్చి, అతన్ని చూస్తూ 'కాని, నారాయణ్! నీ వెంతో ఆదర్శప్రాయుడివీ, బుద్ధిమంతుడివీ అని నేను నమ్ముతూవుండే దాన్ని; కాని, నీ విటువంటి పనిచేస్తావని కలలోకూడా—' అనబోతుంటే, నారాయణ ఇక ఉండలేక పోయాడు. చట్టున లూసీ చేయిపట్టుకొని, తడైన కళ్ళతో

ఆమె ముఖంలోకి చూడలేక, తలొంచుకొని, 'లూసీ! ఆమె నలా మోసంచేసి, నే నిలా సుఖిస్తున్నాననే గదా, శశికళ మీ అందర్నీ నమ్మిస్తోంది!' అన్నాడు గాద్గదికంగా.

'నమ్మించడమా, అంటే—?' అని లూసీ విస్మయం ప్రకటించేసరికి అతనిలో ఆవేదన కట్టలు తెగి ప్రవహించినట్లయింది. ఆవేశంతో, సమగ్రంగా జరిగిన కథంతా నారాయణరావా మెకు చెప్పేశాడు..

అంతా విని లూసీ తన మిత్రురాలి స్వార్థప్రచారానికి విస్తుపోయింది. స్నేహితుని అభాగ్య చరిత్రను తెలుసుకోకుండా అతన్ని అనుమానించి ఆ విధంగా అవమానించినందు కనేక క్షమాపణలు తెలియజేసుకొని—అతని ఎడల ఎంతో సానుభూతి ప్రదర్శించింది!

ఆ తరువాత చాలసేపు వాళ్లిద్దరూ మౌనంగానే వుండిపోయారు...

చాలాసేపటికి మొదట లూసీయే తలెత్తి సాలోచనగా ఇట్లా అంది. 'చూడు నారాయణ్! నీకేంలోటు? సిరిసంపద లున్నాయి, మంచి హృదయం గలవాడివి, చదువుకొన్నావు, సంస్కార వంతుడివి! కాని ప్రేమించిన ప్రేయసికి ఎడబాటు కావల్సి వచ్చింది! పెళ్ళాడినదట్లా బాధించి బాధించి పోయింది! పాపం' అన్నీవుండీ ఆవేదనామయంగావున్న నిన్ను చూస్తుంటే నాకెంతో జాలికల్గుతుందోయ్' అని ఆవెంటనే ఆమె 'ఒక పనిచేస్తే చాల బాగుండేటట్లుందోయ్, అందరికీ!' అన్నది.

'ఏమిటది లూసీ!'

'మరేంలేదు నారాయణ్! శశీ ఇంత కాలం పెళ్ళి చేసుకోలేదు తెలుసా! నీవలా వదిలిపోయావ్...అదిసగం! తరువాత ఇప్పుడిక్కడే ట్రైనింగవుతోంది. ఇప్పటికైనా మీరిద్దరూ కల్సుకొని పెళ్లి చేసుకొంటే—'!

ఆమె ఆలోచనకు చకితుడు కావడం వినా మరెట్టి భావం వెలిబుచ్చ లేదతను.

'చెప్పు నారాయణ్! నీ కిష్టమేనా? నీ కిష్టమైతే, దాన్ని ఇట్టే సమాధాన పర్చుకొస్తానుగా! నీ సంగతి ముందు తేల్చు!' అంది ఉత్సాహంగా.

'లూసీ! శశి ఒప్పుకోవాలే గాని, పువ్వుల్లో పెట్టి పూజించనూ?. అన్నాడు.

లూసీ ఎగిరి గంతేసినంత పనిచేసింది! 'తప్పక దాన్ని ఒప్పిస్తా! మీ రిద్దరూ పెళ్ళాడితే చిలకా గోరువంకల్లా కన్పిస్తారు. నిసలైన జీవిత మాధుర్యామను భవిస్తాను! నేను చరిత్రకో నూత్న చిత్ర కథ అందించిన దాన్ని అవుతాను-ఏం? అంది ఉషారుగా.

విషాదంతో ఆరంభమైన ఆదినం ఆనందంతో అంతమైంది...

## 6

ఆ మరునాడే లూసీ శశికళను కల్సుకొంది. శశి ఒంటరిగా ఏదో పుస్తకం చదువుకొంటూ, తన నివాసంలోనే వుంది.

కుశల ప్రశ్నలనంతరం లూసీమెల్లగా 'నారాయణరావు గురించి నీవు చెప్పిందంతా నిజంకాదటగదా?! అనడిగింది.

శశికళ ఒకసారి లూసీ ముఖంలోకి చూచి 'అంటే-నేనబద్ధాలు చెప్పాననా అంది.

'కాదులే! కాని జరిగింది అసలు-' అంటూ క్రమంగా - నారాయణరావు తనతో చెప్పిన కథంతా చెప్పుకొచ్చింది లూసీ.

శశికళ ఇక నోరెత్తలేక పోయింది. కాని ఉక్రోషం పట్టలేక' ఇదంతా నీ కెవరు చెప్పారేం?' అని అడిగింది.

'నారాయణరావే చెప్పాడు! మొన్ననే కలిశాడు, ఇప్పుడు మా ఇంట్లోనే వున్నాడు.'

అని లూసీ చెప్పగానే శశికళ తెల్లబోయింది. మరుక్షణంలోనే తేరుకొని, ఒళ్ళు విరుచుకుంటూ మందహాసంతో, 'అయితే, ప్రస్తుతం వారు తమర్ని ఆరాధిస్తున్నారన్న మాట? ఇంకేం, ఫర్వాలేదులే!' అన్నది.

ఆమె అలా ప్రవర్తిస్తుందని లూసీ తలచి వుండక పోవడంచేత చకితురాలైనా, మరుక్షణంలోనే తేరుకొని మృదువుగానే ఇలా చెప్పింది.—

'వేళాకోళాలి కిదా సమయం? ఇటు చూడు శశీ! విధి వశాత్తు జరిగిపోయిన వాటి గురించి బాధ పడ్తూ కృంగిపోయే కంటే, జరుగవలసింది దూరం యోచించి, జరుపుకుంటుంటే ఎంతో మంచిదికదా, ఎవ్వరికైనా! చూడు, మీ ఇద్దరకూ ఒకరిపై ఒకరికి మనసుంది; ఇద్దరూ తగిన ఈడూ జోడూ కూడాను. ఇప్పుడు మాత్రమేమీ మించి పోలేదు గదా! గతమంతా మర్చిపో గల్గితే ఏ క్షణంలో కావలిస్తే, ఆ క్షణంలో తేలిగ్గా దంప

ఘనతవల్లనే అగ్రస్థానం




ప్రతీ షాపులలోను దొరకును

తులు కాగలరు; ఆదర్శంగా హాయిగా జీవించగలరు!'

లూసీ మాటలు వింటూ తన ముఖ కవళికలు మార్పు చేసుకో సాగింది శశికళ. అంతేకాదు, అంతా విన్నాక- 'లూసీ! అతగాడికంటే ఒకమాట, వొక నీతి లేదుగాని, నాకు లేవనుకొంటున్నావా?' అంది. 'ఇందులో మాట,నీతి, ఏముంది శశీ?' అని లూసీ నిగ్గదీయగా 'లేవామరి? నేను మా ప్రొఫెసర్ గారిని పెళ్లాడ్తానని మాట ఇచ్చేశాను. అంతే! ఆరు నూరైనా అది జరిగి తీరవల్సిందే! ఈ నెలాఖరులోనే, మా వివాహం, ఇక్కడే, మీ కళ్ళముందే జరిగిపోతుంది. ఇంకేం చెప్పాలి?' అంటూ లేచింది నిరసనగా, ఠీవిగా.

లూసీ వింత చెంది, అటు నారాయణ

రావుస్థితి స్ఫురణకొచ్చి చాలా జాలి కల్గింది, అతనిపై. అందుకనే — 'శశీ! నిజంగా ఇప్పుడు అతనున్న స్థితిచూస్తుంటే ఎంత హృదయ విదారకంగా వుంటుందో తెలుసా?' అంది సానుభూతితో. శశి తిరిగి వెటకారంగా నవ్వుతూ 'నీవు జాలి చూపుతున్నావు గదా, చాలు! ఇంకేమి కావాల తనికి?' అంది.

లూసీ దిగ్గున లేచింది. కాని, ఏమనటానికి తోచలేదు. తనలో తన్నే 'ఛి... ఛీ!' అనుకొంది. ఒంచిన తలెత్తకుండానే, వెంటనే ఇంటిదారి పట్టింది...

★

'లూసీ! నన్ను క్షమించు. నీ కంత అవమానం జరగటానికి నేనే కారణం!'

'దాని కేముందిలే నారాయణ్! అదీ ఒక స్నేహితురాలే గదా? అది అన్నా, నేను పడ్డా మరేం ఫర్వాలేదు గాని, నీ జీవితం చూస్తుంటేనే నా కెంతో బాధగా వుంది....'

'అదంతా నా దౌర్భాగ్యం! లేకపోతే మొదట్లోనే మా ప్రేమ అలా చెడిపోవటమేమిటి? ఆ తరువాత అర్థాంగి అయినదట్లా తయారవడ మేమిటి? తిరిగి ఇప్పటికీ దాంపత్య విషయంలో, నా గతి ఇక ఇంతే నని రాసిపెట్టినట్లనిపిస్తోంది — అంతేలూసీ!'

అతని స్థితికి లూసీ మనస్సల్లాడిపోయింది. ఆలోచించి, ఆలోచించి హఠాత్తుగా లూసీ నారాయణరావు చేతుల్ని గట్టిగా పట్టుకొని, అతని కళ్ళల్లోకి సూటిగా ఉత్సాహంగా చూస్తూ 'ఆగు—ఆ శశి, గాలికి కల్పించిన సంబంధాన్ని మనం నిజం చేసుకుంటే?' అన్నది.

క్షణకాలం నారాయణ మతి పోయినవాడల్లే అయ్యాడు. తేరుకోగానే అతని నిరాశ క్షణంలో విచిత్రంగా ఆశగా మారింది. హృదయాన్ని అర్పించిన లూసీని దగ్గిరికి లాక్కున్నాడు.

★

అభిసారిక

ముఖచిత్రాలుగా వెలువడిన త్రివర్ణ చిత్రాల తాలూకు ట్రైకలర్ బ్లాకులు, దాదాపు 30 సెట్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నవి. అతి సరసమైన వెలకు విక్రయించబడుతవి. క్యాలెండర్లకు కానీ, పుస్తకాల ముఖ చిత్రాలుగా కానీ ఉపయోగించుకోవొచ్చు.

వివరాలకు :

అభిసారిక కార్యాలయం,

మద్రాసు-17.

**1955** డిసెంబరు ఆఖరువారంలో జనవరి సంచిక

వస్తోంది.

అత్యుత్తమ సినిమా మాస పత్రిక

# చిత్రసీమ

ఎడిటర్: ధనికొండ హనుమంతరావు.

చిత్రసీమకు సంబంధించిన అనేక విషయాలు, సరిక్రొత్త స్టిల్సు, నూతన ఫక్కీలో తారల పరిచయం, శంఖారావం, లోకోభిన్నరుచిః, విజ్ఞాన విశేషాలు, చిత్రసీమలో సంచారం యింకా అనేక ఆకర్షణీయమైన శీర్షికలతో త్రివర్ణ ముఖ చిత్రంతో వెలువడుతుంది.

¼ క్రౌన్ సైజులో 48 పేజీలు; 8 అణాలు

డిపాజిట్ కట్టగల వారి ఏజన్సీలే

ఖాయం చేయబడుతవి.

వివరాలకు:

## జ్యోతి కార్యాలయం,

మద్రాసు-17.

# జ్యోతి

ఎడిటర్ : ధనికొండ హనుమంతరావు

## దీపావళి సంచిక

త్రివర్ణ ముఖచిత్రంతో ఆర్టుప్లేట్లతో 240 పేజీలతో,

వెలువడింది.

ఇందులో – వజ్రపాణి, భరద్వాజ, కె. సభా, ఇంద్రజిత్, బులుసు, జి. ప్రకాష్ ఉషశ్రీ, రాధాకృష్ణ, పన్నగపతి, ఎన్. ఆర్. నంది, దాసు, ప్రజాపతి, రామబ్రహ్మం, సుధ, జె. సత్యన్నారాయణ మొదలైనవారి రచనలూ,

నవ్వుపువ్వులు, వ్యంగ్యచిత్రాలు, గ్రంథ సమీక్షలు, లోకసంచారం, చిత్రసీమ, సినిమా బొమ్మలు, అవీ, ఇవీ ఇంకా ఎన్నో—

విడి ప్రతి : 12 అణాలు.

సంవత్సర చందా : రూ. 6.

చందాదారులకు యీ సంచిక అదనపు వెల లేకుండానే పంపబడుతుంది.

జ్యోతి కార్యాలయం, మద్రాసు_17.




రచన : సులోచన

సాయంత్రం అయిదు గంటల నుంచీ ఏకధారగా వర్షం కురుస్తోంది.

ఆనందరావుకు ఏం తోచడం లేదు. డ్రాయరుమీద కాళ్ళు పెట్టుకొని కుర్చీలో కూర్చున్నాడు. ప్రక్కన టేబుల్ లైటు వెలుగుతోంది. కిటికీలోంచి చల్లగాలి విసరి కొడుతోంది. ఆ చలిని భరిస్తూ అలానే కూర్చున్నాడు. బీరువాలోంచి వులెన్ స్వెట్టరుతీసి తొడుక్కుందామనుకున్నాడు.— కాని, కుర్చీలోంచి లేచి మూడు గజాలదూరంలో ఉన్న బీరువా వరకూ నడిచి, స్వెట్టరు తొడుక్కోవాలిగా! కిటికీ తలుపులు బిగిస్తే - చలి తగ్గుతుం దనుకున్నాడు. కాని కిటికీ తలుపులు బిగించవద్దూ! ఎనిమిది గంటలకు భోజనంచేసి— అట్లా కుర్చీలో కూర్చున్నాడు. పదినిముషాల కొక సిగరెట్టు చొప్పున కాలుస్తూ, ఆలోచిస్తున్నాడు.

ఇంట్లో భార్య పద్మ లేదు. బంధువుల ఊరు శుభకార్యానికి వెళ్ళింది. ఆమె ఇంట్లో ఉంటే — యీ వానాకాలపు రాత్రి తనకు ఇంత వూపిరాడకుండా వుండేది కాదని ఆనందరావు ఎన్నోసార్లు అనుకున్నాడు. బయట జోరుగా వర్షం కురుస్తోంటే, ఎంత నరాలు కొంగర్లు పోయే చలిగాలి లోపలకు తీసుకువచ్చినా — ప్రక్కన కమ్మగా కబుర్లు చెబుతూ కిలకిల నవ్వించే భార్య, చదరంగం, పేక, క్యారమ్స్ మొదలైన ఆటల్లో పాల్గొని కాలాన్ని మరపించే భార్య, బాహువుల మధ్య విలాసంగా యిమిడి పెదాల వొత్తిడితో, కౌగిలింతల బరువుతో, వెచ్చదనాన్ని కలిగించేభార్య — వుంటే వాన కురిసే రాత్రుళ్ళు ఎంత మధురంగా గడిచి పోతాయి! ఆనందరావు అట్లానే ఆలోచిస్తున్నాడు....

సినిమాకు వెళదామన్నా వీలును కలిగించకుండా కురుస్తోంది, వాన నిద్ర.

వొచ్చేవరకూ చదువుకుందామని సోమర్సెట్ మామ్ పుస్తకం తీశాడు. నిద్ర రాకపోగా, విసుగు జాస్తి కాసాగి, మనస్సు పరధ్యాసలో పడింది. హాఫ్ ఇయర్లీ ఎగ్జామినేషన్సు తాలూకు బి. ఏ. వాళ్ళ పొయట్రీ పేపర్లు దిద్దకుండా అట్లానే షెల్ఫ్‌లో పెట్టివున్నాయి. వాటిని వ్యాల్యూ చేద్దామనుకోని కట్ట విప్పాడు. ఒక పేపరు వ్యాల్యూ చేశాడు. పదిహేడు మార్కులు వేశాడు. మనస్సు ఎక్కడనో వుంచి పేపర్లు దిద్దితే—రేపు కాలేజీ విద్యార్థులు తనమీద పడి ఏడుస్తారు. మళ్ళీ పేపర్లు కట్టకట్టి షెల్ఫ్‌లో యథాస్థానే అట్టే పెట్టాడు. అతనికి నిద్ర వొచ్చే మార్గం దొరకలేదు. నిద్ర రాకుండావుంటే— మతి భ్రమించేట్టు ఉంది ఎట్లా?

పావుగంటసేపు గదిలో పచార్లు చేశాడు; కిటికీ తలుపులు మూశాడు; బీరువా తెరచి ఉలెన్ స్వెట్టరు ధరించాడు. —చలి తగ్గిందా? మనస్సులోని వెలితి సమకూడిందా? లేదు. పద్మను నిందించాడు. ఆమెను పిలిచిన బంధువుల్ని తిట్టుకున్నాడు.

రాజేశ్వరి ఏం చేస్తోందో!

రాజేశ్వరి పద్మ చెల్లెలు. అంటే ఆనందరావు మరదలు. కాలేజీలో ఇంటర్ సెకండు ఇయర్ చదువుతోంది. ఆమె బంధువుల ఇంట్లికి వెళ్ళలేదు. ఆమెకు కాలేజీ ఉంది. అదీ గాక పద్మ ఆపిల్లను, బావకు భోజన వసతులు సక్రమంగా చూడటానికి గాను ఇంట్లోనే ఉండమన్నది. రాజేశ్వరే ఉదయం కాఫీ, పన్నెండు గంటలకు భోజనమూ, మూడు గంటలకు మళ్ళీ కాఫీ ఫలహారమూ, రాత్రికి భోజనమూ - తయారు చేసి పెట్టింది. ఆ ఇంట్లో - వానకాలపుచలి రాత్రి వాళ్ళిద్దరే!

'రాజేశ్వరి ఏం చేస్తోందో?' అనుకున్నాడు మళ్లీ ఆనందరావు.

బాత్ రూమ్‌లో స్నానంచేస్తోంటుందా? లేకపోతే టాయిలెట్ చేసుకుంటో వుంటుందా? వంటగదిలో భోజనం చేస్తూందేమో! ప్చ్... గదిలో తలుపులు బిగించుకొని, చలి కోర్వలేక క్లాసులో ఏ కుర్రవాడ్నో తలచుకొంటూ దిండును కావలించుకొని పడుకొని వుంటుందేమో? ఛీ...ఏం ఆలోచనలు! ఆ అమ్మాయి ఎట్లా వుంటే తనకేం? వంటగదిలోనే వుండి వుంటుంది. తను వెళ్ళి చూసివస్తే? ఛీ... తను వెళ్ళి చక్కారావడం ఏమిటి? దేనికి?... నిజమే! తను వెళ్ళి చూడటమేమిటి? తనలో నవ్వుకున్నాడు ఆనందరావు.

ఏం చూస్తే!

రాజేశ్వరి ఎంతో బావుంటుంది. అసలు ఆ పిల్లని తను పెళ్లాడవుండవలసింది. పెళ్ళికి ముందు ఆమెను చూసి వున్నట్లయితే తను అట్లానే చేసి వుండేవాడు. కాని పెళ్ళి అయినాక కానీ తెలియలేదు.— తనకు అట్లాంటి తామర పువ్వులాంటి మరదలు పిల్ల ఉన్నదని. రాజేశ్వరి అందమంతా ఆ కళ్ళలోనే ఉంది. అంత నలుపూ, అంత నిర్మలత్వమూ, అంత ఆకర్షణా — తను ఏ స్త్రీ కళ్ళలోనూ చూసి వుండలేదు. ఆ కళ్లే ఆమె రూపానికి ప్రాణం పోశాయి, స్త్రీ జన్మకు సార్థకతను చేకూర్చాయి. ఆమె

శరీర నిర్మాణం మటుకు - ఎంత మనో హరంగా వుంటుంది! ఆ అవయవాల పొందికా, ఎత్తుకు తగిన లావూ, లావుకు తగిన ఎత్తూ — గులాబీరంగు మైసూరు క్రేప్ సిల్కు పరికిణీ ధరించి, అదేసిల్కు పట్టురంగు వోణీ - జార్జెట్ వాయిల్ సిల్కు పచ్చజాకెట్టు మీద ధరించి, రెండు జడల అగాధంమధ్య పువ్వులు విలాసంగా అమర్చి - హైహీల్సు టక టకలాడిస్తూ, కొండమీదనుంచి నీళ్ళు జారి పడుతోన్నట్టు, నడుస్తోంటే ఆ సౌందర్యాన్ని ఎట్లా వర్ణించటం?

ఒక రోజు మధ్యాహ్నం భార్యకోసం రాజేశ్వరి గదిలోకి వెళ్ళాడు తను. ఆగది లో తన భార్యలేదు. బెడ్ మీద రాజే శ్వరి నిద్రపోతోంది. నిద్రలో ఆమె పైట తొలగింది. కిటికీలోంచి మల్లెపూల పందిరి మీదుగా వొచ్చే మధ్యాహ్నపు వేడిగాలికి ఆమె నుదురుమీద ముంగురులు అందంగా ఆడుకుంటున్నాయి. నిద్ర మత్తులో అవ్యక్తంగా ఆమె పెదాల మీద దరహాసం నాట్యం చేస్తూంది. స్తం భించిపోయి రెండునిమిషాల పాటు మం చం ప్రక్క నిలబడి రెప్ప వాల్చకుండా ఆమె వంక చూశాడు. ఆ రెండు నిము షాల్లో తన శరీరంలో హఠాత్తుగా ఎంత విద్యుచ్ఛక్తి ప్రవహించింది! మోహావేశం తో వొణికిపోయాడు. ఆమె ప్రక్కనే కూర్చుని, ముందుకు వంగి, ఆమె పెదాల్ని తనివి తీరా ముద్దు పెట్టుకోవాలనీ ... ఆమె నడుం చుట్టూ చేయివేసి ఎంతో గాఢంగా దగ్గరకు లాక్కోవాలనీ... అనుకున్నాడు. కాని ఆ పని చేయడానికి ఎంత సాహసం కావాలి! ఏం చేయలేక మరో రెండు నిముషాలపాటు ఆమె సౌం దర్యానికి లొట్టలు వేసుకుంటూ చూసి నిలవ తొక్కుకొని ఎలాగో యివతల కొచ్చాడు! అటువంటి దృశ్యాన్ని జన్మ లో చూస్తాడా? రాజేశ్వరే తన భార్య యివుంటే...

రాజేశ్వరి గదిలోకి వొచ్చింది.

గులాబీ రంగు మైసూర్ క్రేప్ సిల్కు పరికిణీ మీద, మబ్బురంగు అదే సిల్కు వోణీ ధరించింది. చిలకపచ్చపట్టు జాకె ట్ వేసుకుంది. రెండు జడలమధ్య మల్లె, చామంతి పువ్వులు తురిమింది. ముఖానికి పాండ్స్ స్నో, టాల్కం పౌడరూ పులి మింది. సహజసౌందర్యానికి అవి తోడ్ప డగా — ఫిలిప్స్ లైటు కాంతిలో ఆమె మిరుమిట్లు గొలిపే కాంతి రేఖగా తయారైంది. ఆనందరావు స్తబ్ధుడై —ఆమె కేసి అట్లానే చూస్తూ వుండి పోయాడు. ఆ చూపులకు ఆ పిల్ల పులిని చూసిన లేడిపిల్లవలె బెదిరింది.

బయట జోరుగా వాన కురుస్తోంది. చల్లగాలి లోపలికి మహాప్రవాహంమల్లే వొచ్చి పడుతోంది.

రాజేశ్వరి మంచినీళ్ళ మరచెంబూ, గ్లాసూ— బెడ్ ప్రక్క కిటికీలో పెట్టేం దుకు బెడ్ దగ్గరకు వెళ్ళింది.

ఆనందరావులో అగ్నిపర్వతం బ్రద్ద లైంది.

కుర్చీలోంచి లేచాడు. గుండెల్లో దడ, కాళ్ళల్లో వొణుకు, ముఖంలో స్వేదం —రాజేశ్వరి దగ్గరకు నడిచి వెళ్ళాడు.

బావ రాకనూ, రాకలోని తీరునూ, చూసి భయపడింది రాజేశ్వరి. చేతిలోని మరచెంబును క్రిందకు జార్చింది.

బయట జోరుగా వాన, లోపల జాస్తిగా చలీ, రాత్రి, పడకగదీ, పందిరి మంచంపైని పట్టుపరుపూ, ఫిలిప్స్ లైటు కాంతీ, ఏకాంతమూ, గులాబీ పువ్వు వంటి ఆడదీ, ... ఆహా! ఏం అనుభవం!

ఆమెకు దగ్గరగా వెళ్ళాడు ఆనందరావు. అటు కిటికీ చువ్వలూ, ఇటు పందిరి మంచపు పట్టుపరుపూ - మధ్యలో ఇద్దరూ ఉన్నారు.

'రాజేశ్వరీ!'

ఒకచేత్తో ఆమె చెయ్యి పట్టుకొని, మరో చేత్తో ఆమె నడుం చుట్టూ చేయి వేసి దగ్గరకు లాక్కున్నాడు. రాజేశ్వరి వొణికి పోతోంది. ఆనందరావు ఆవేశం కొద్దీ-ఆమెనుపందిరిమంచం మీదపట్టుపరుపుపై కూర్చోబెట్టాడు. ఆమె భుజాల చుట్టూ చేతులు వేసి నవ్వుతూ ఆమె ముఖం మీదకు వాలాడు.... ఆమె పెదాలు వొణుకుతున్నై. ఏవో మాట్లాడాలని, తనకు యీపని బొత్తిగా ఇష్టం లేదని, తను అట్లాంటి అవినీతికి పాల్పడ లేననీ, — చెప్పాలని మనస్సులో ఎంత ఆవేశం వుంటేమాత్రం ఏం లాభం? మాటలు బటికి రావద్దూ?

పెళ్లికాని పిల్ల - వయస్సులోఉన్నది. మగవాడి సౌఖ్యానికి, 'నీతి - అవినీతి' అనే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయిన పురుషుని మోహానికి, బలి కాబోతోంది. మూగవోయిన ఆమె గుండెలోని బాధని విప్పి చెప్పే అవకాశం లేదా? అవినీతిని ద్వేషించే ఆమె హృదయ ఘోషను వినే అగత్యం లేదా? జన్మ కంతటికీ 'మచ్చ' గా నిలిచే ఆ అవినీతి కార్యాన్నుంచి ఆ కన్యను రక్షించే వాళ్లు లేరా? ఆమె తాత్కాలిక మోహానికి గురై, అనిర్వచనీయమైన ఆనందానికి ఎరయి— లోకం తన జీవితాంతమూ 'పతిత' గానే పరిగణించబడాలా? వేరేమార్గం లేదా? ఏ భగవంతుడూ యీ పాపకార్యాన్నుంచి ఆమెను రక్షించలేడా? చదువూ, విజ్ఞానం, వివేకమూ, విచక్షణా అన్నీ కలిగి, మెరుపు లాంటి తాత్కాలిక మోహానికి లొంగి, పెళ్ళికాని ఓ పిల్లను తనకీ అనుభవాన్ని యిచ్చే వస్తువుగా ఉపయోగించుకొని, ఆమె బ్రతుకుయొక్క భవిష్యత్తులోని అంధకారానికి కారణభూతుడయ్యే అతని దుర్మార్గాన్నీ, అవినీతినీ ఎవ్వరూ అరికట్ట లేరా?

ఆమె పెదాలమీదకు వాలాడు ఆనందరావు.

ఆమె కళ్ళల్లో నీళ్ళు చిమ్మాయి. ముఖంలో విషాదం నలుపైంది.

ఆనందరావు టక్కున ముఖం పైకి ఎత్తాడు. ఆమె కళ్ళవెంట రాలిన నీళ్ళు చెంపలమీదుగా క్రిందికి జరజర జారినయ్. ఆ కన్నీటిచారలవెనుక దాగిఉన్న విషాదం క్షణంలో అర్థమైంది ఆనందరావుకు.

అతనిలో మోహం గాలి తీసివేసిన బెలూన్ చందమైంది.

ముఖంకిటికీ ప్రక్కకు తిప్పుకున్నాడు. ముఖం ఎర్రనైంది. జుట్టు పీక్కున్నాడు. చేతులు నులుముకున్నాడు. మెడ సవరించుకున్నాడు.

బయట జోరుగా వర్షం కురుస్తోంది.

'రాజేశ్వరీ—!' మంచం ప్రక్కకు తిరిగాడు.

మంచంమీద రాజేశ్వరి లేదు.

రాజేశ్వరి భయంతో వొణికిపోయింది. ఎట్లాగో గదినుంచి బయటపడింది. ఏదో గొప్ప తప్పు చేసినట్టు గుండె విపరీతంగా కొట్టుకుంటోంది. నడిచే ఓపిక లేదు. అటూ ఇటూ తూలుతూ తన గదిలోకి వెళ్ళి మంచంమీద కూలబడింది, కన్నీటి ముద్దయి.

ఆ సంఘటన తలుచుకున్న కొద్దీ గుండె తరుక్కుపోతోంది...

బావ ఎంత సాహసంచేశాడు! తనని చూడగానే అకస్మాత్తుగా బావలో ఆ పాడు బుద్ధి పుట్టిందా? ఛీ...అసలు తను ఇంతగా ఎందుకు అలంకరించుకుంది? తనకి యీ రాత్రివూట యీ మైసూర్ క్రేప్ సిల్కు పరికిణీ, వోణీ ఎందుకు? పట్టు జాకెట్టు ఎందుకు? మామూలు వాయల్ దుస్తులు వేసుకుంటే పోలేదూ? ఇంట్లో బావ ఒక్కడే ఉన్నాడు గదా! అక్కయ్యకూడా లేదుకదా...తను ఇంత అందంగా తయారు కావడ మెందుకు? ఛీ...తనకే బుద్ధిలేదు. తనను చూడగానే బావ మనసు చలించిందా? లేకపోతే అంతకుముందే బావకు తనమీద మోజు ఉందా? ఇట్లాంటి ఏకాంతమైన రాత్రి కోసం వేచిఉన్నాడా? బావ అంత అవినీతి పరుడా? అక్కయ్య ఉండగానే బావ మరో స్త్రీకోసం, మరో స్త్రీతోడి అనుభవం కోసం ప్రయత్నిస్తున్నాడా? ఏం సబబు? ఏం నీతి? ఏం న్యాయం? కట్టుకున్న భార్యకు ద్రోహంచేసి, దాంపత్యంలో ఆమెకు ఎంతో విశ్వాసమూ, సౌఖ్యమూ కలిగించి, భవిష్యత్తులో సుఖజీవితానికి హామీయిచ్చి,—పరాయి స్త్రీని పొందేందుకు సాహసంచేస్తాడా? ఎం.ఏ. చదివిన చదువు తాలూకు విజ్ఞానమూ, ఉద్యోగం చేస్తూన్నప్పటి విచక్షణా జ్ఞానమూ—ఏమైనాయి? పెళ్ళికాని ఒక పిల్లను తన ఆనందానికి బలిచేస్తే—జీవితాంతమూ ఆమె బ్రతుకుమీద కప్పబడే అవినీతి తాలూకు 'తెర'కు బాధ్యతను ఎవరు వహిస్తారు? ఆ పిల్ల 'విధి'కి ఏడ్వవలసిందేనా? అటువంటి అతి సామాన్యమైన విషయాన్నే ఆలోచించలేకపోయాడా?

...బావ తనని ఇన్నాళ్ళనుంచీ అటువంటి దృష్టితోనే చూస్తున్నాడా? తన చేత ఎన్నిసార్లు మంచినీళ్ళు తెప్పించుకోలేదు? ఎన్నిసార్లు కొంటెగా చూడలేదు? ఆ కొంటెచూపు వెనుక కొంత గూఢార్థం ఉన్నదా? తనకి అప్పుడప్పుడూ ఇంగ్లీషు పొయిట్రీ ప్రైవేటు చెప్పేవాడు. ఆ చూపులో ఏదో ఆశ, ఆనందం ఉండేదా? అక్కయ్యతోపాటు తనని ఎన్నోసార్లు సినిమాలకు తీసుకెళ్ళాడు. ఒకటి రెండుసార్లు సరసన కూర్చున్న తన భుజంమీద చేయివేశాడు. ఏదో పొరపాటున వేశాడేమో ననుకుంది తను. కాని అందులోకూడా 'ప్రయత్నం' ఉన్నదన్నమాట! తను యీ నాటివరకూ తెలుసుకోలేక పోయింది. బావకు తనమీద మొదట్నుంచీ మనస్సు ఉన్నదన్నమాట! ఈ విషయం తను ఇదివరలోనే గ్రహించివుంటే—తను ఇవాళ ఇక్కడ ఉండేది కాదు. అక్కయ్యతో పాటే బంధువుల ఊరు వెళ్ళేది కదా!

బావ ఇంత దుర్మార్గుడని...

బావ దుర్మార్గుడా? అట్లా తన హృదయమే తలపోస్తోందా? తల్లీ తండ్రీ లేని

తనని బావ పోషిస్తున్నాడు. బావ తనకి చదువు చెప్పిస్తున్నాడు. తనకి యీ పట్టు జాకెట్టులూ, సిల్కు వోణీలూ బావే కొని యిస్తున్నాడు. బావ డబ్బుతోనే ఏ సినిమాకు వెళ్ళినా, ఏ రిక్షాలో కాలేజీకి వెళ్ళినా! అటువంటి బావని తను దుర్మార్గుడని భావిస్తోందా! తనకి బావ రెండు పార్లు ఇంగ్లీషులో ఫస్టు మార్కులు తెప్పించాడు. తెలీని పాఠాలు చక్కగా చివరకు తెలుగులోనైనా చెబుతాడు. అటువంటి బావని తను దుర్మార్గుడిగా, నిర్ణయించింది.

మరి బావచేసిన పనేమిటి?

—తనని అనుభవించాలని ఉబలాట పడతాడా? తనకి పెళ్ళి కానక్కర్లేదూ? తనకీ జీవితంలో ఒక భర్త ఉండొద్దూ? తనూ 'స్త్రీ'గా సంఘంలో గౌరవంగా తిరగవొద్దూ? తనకీ హృదయమూ, నీతీ, జ్ఞానమూ—లేవూ?

మరి బావ ఏం ఆలోచించి తనని కోరాడు? వయస్సులో ఉన్న కన్య మీదకు మనస్సు మళ్ళడం సహజమా? ఆ మనస్సుకు నీతీ, నియమమూ, కట్టుదిట్టమూ అక్కర్లేదూ?

బావ తనని కోరాడు—ఆ కోర్కె ఏం సబబు?

తను నిరాకరించింది. ఏం చేయలేక ఏడ్చింది. బావ ఏమనుకున్నాడో? హృదయం ఎంతగా తల్లడిల్లిందో? ఎంతగా బాధపడుతున్నాడో? ఛీ, తను పాపిష్టిది. భగవంతుడు తనకీ అందం ఎందుకు ఇచ్చాడో?

...రేగిన కోర్కెల్ని అణచుకోలేక బావ—ఎంతగా ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడో? తను నిరాకరించటం—బావ అవమానంగా, అప్రదిష్టగా తలుస్తాడేమో? ఎప్పటికైనా తనని అనుభవించాలని ప్రతిజ్ఞ పడతాడేమో?

తను ఏం చేయగలుగుతుంది?

.....................

బావ హృదయంలోని కోతకు తను కారకురాలు! చదువుకున్నవాడు, అన్నీ తెలిసిన వాడు, పరువూ ప్రతిష్ఠలు గల వ్యక్తి—తన జీవితంలోని ఎత్తు పల్లాలకు బాధ్యుడు, తననికోరితే—తను నిరాకరించడమా? బావకు కోపం కలిగించి, బావలో పగ రగిలించి, బావలో ద్వేషం హెచ్చుజేసి—తను ఈ ఇంట్లో ఉండగలదా? తన జీవితం ముందుకు సాగే విధం ఏమిటి? బావే తనకి చదువు చెప్పించాలి. ఎప్పటికైనా బావే తనని ఒక ఇంటిదాన్ని చేయాలి! అట్లాంటి పరిస్థితుల్లో బావను ఎదిరించి తను ఎట్లా బ్రతకగలుగుతుంది?

ఈ ఇంట్లోంచి పారిపోతే, ఈ అర్థరాత్రిలో.. / పిచ్చి యోచన. పారిపోయి—ఏం చేయగలుగుతుంది తను? ఏం సాధిస్తుంది? పద్ధెనిమిదేళ్ళ పడుచుపిల్ల యీ దేశంలో, సంఘపుతీరులో-స్వతంత్రంగా, పవిత్రంగా జీవించ గలుగుతుందా? సాధ్యమేనా? ఎవరో ఒకళ్ళ ఆసరా క్రిందనే స్త్రీ జీవితం తాలూకు 'పాతివ్రత్యం' పవిత్రంగా కాపాడబడ గలుగుతుంది కానీ, మగదిక్కు లేక పోయిం తరవాత—తెల్లవారిలేస్తే ఇందరి కళ్ళల్లోని మోహపు పొగల చీకటికీ, సరదానవ్వుల పోకిళ్ళకూ, చేష్టలకూ, ఎకసక్కాలకూ, యీసడింపులకూ-తను స్వతంత్రంగా బ్రతక గలుగుతుందా? తను

ఏమైనా ఇంట్లోంచి పారిపోయే తెలివి తక్కువ ప్రయత్నానికి గురి కారాదు.

బావ కోర్కెను తను తీరిస్తే——?

అమ్మో!

ఏం?...బావలో కోపాన్ని తను చూడగలుగుతుందా? బావలో ద్వేషం పెరగటం తనకు క్షేమమా? అందుచేత ...నీతినీ, హృదయాన్నీ న్యూనత పర్చ టమా? ఆత్మను వంచించుకోవడమా? తరువాత——తన బ్రతుకుయొక్క విలువ ఎట్లా పరిణమిస్తుంది? ఎట్లాగైనా పరిణ మించనీ...

బావ కోర్కెను నిరాకరించడం తనకి శ్రేయస్కరం కాదు. బావే తెలుసుకుంటాడు——ఎప్పటికైనా. ఏది నీతో? ఏది సమంజసమో? తన బ్రతుకు ఎట్లాగైనా తెల్లవారనీ,

తనని సంఘం ఎట్లాగైనా చూడనీ,

తను నీతి విషయంలో ఎంత క్రింద కైనా దిగజారనీ,

——యీ వానాకాలపు రాత్రి, బావ సౌఖ్యానికి బలికాక తప్పదు!

ఆ నిర్ణయానికి రాజేశ్వరి వొచ్చింది. ఆ నిర్ణయానికి రావటానికి రాజేశ్వరి లేత గుండెలో ఎంతఘోరంగా సంఘర్షణ జరి గిందో, ఆమె ఎట్లా ఆత్మను పరిస్థితుల పరంగా వంచించుకుందో, భవిష్యత్తులోని భయంకరాన్ని సయితంఅనుభవించేందుకు తల వొగ్గిందో చెప్పలేం.

చెమట పట్టిన ముఖాన్ని చక్కగా తుడుచుకుంది; అద్దంలో ముఖాన్ని చూసుకుంది; చెదిరిన తలను సరిచేసు కుంది; గదిలోంచి బయలుదేరింది - కాని గుండెలో దీపం 'టప్ - టప్' అంటూనే ఉంది. కాళ్ళు వెనక్కు లాగుతోనే ఉన్నాయి - కళ్లు బెదురు తూనే ఉన్నాయి. వొళ్ళంతా ఏదో ఆవరించినట్టు వొణుకు -

ఉత్తర దిక్కున మెరుపు మెరిసింది.

ఉరుము ఉరిమింది - భీకరంగా.

గాలి, వాన, చలి!

ఆనందరావు గది ముంగిట అడుగు పెట్టింది. భూమి కదులుతోందా? భూకంపం రాబోతోందా?

ఆనందరావు గది తలుపులం వేసి ఉన్నాయి. తలుపులు మెల్లగాత్రోసింది. గదిలో చీకటి; ఆమెలోని భయం - చీక టిని చూడటంతో అంతకు రెండింతలు అయింది. గదిలో ప్రవేశించడమా? గది వెలుపల కూర్చుని ఏడ్వటమా? కళ్ళు మూసుకొని, పళ్లు బిగబట్టి - ఆలోచిం చింది: తను చేయబోతూన్న సాహసం తాలూకు మంచిచెడ్డల్ని-

గదిలో అడుగుపెట్టింది. గదినిండా చీకటి. టేబుల్ మీద ఉన్న రేడియమ్ డయల్ వాచ్ 10-45 గంటలు చూపిస్తోంది. ఆనందరావు మంచం దగ్గరకు వెళ్ళింది. మంచంమీద కూర్చుం ది. చీకట్లో - గుండెను రాయి చేసు కుంది. జారిపోతోన్న సత్తువను కూడ గట్టుకుంది.

'బావా!' అంటూ, ఆనందరావు మీదకు వాలింది ఆ చీకట్లో.

'రాజేశ్వరి! ఏమిటీ సాహసం?' చివుక్కున లేచాడు ఆనందరావు. గబు క్కున లైటు వేశాడు.

రాజేశ్వరి ముఖం మసిబూసి నట్ల యింది.

'రాజేశ్వరీ! పెళ్ళికాని పిల్లవు. పెళ్ళి చేసుకొని జీవితంలో సుఖంగా, సంఘంలో గౌరవంగా బ్రతకవలసినదానవు. క్షణికమైన సుఖాలకు ఆశించి, మెరపు లాంటి ఉద్రేకాలకు లోనై, జీవితపు విలువలకు మూలాధారమైన నీతి విషయంలో క్రిందకు దిగజారి, - భవిష్యత్తును ఎందుకు పాడుచేసుకుంటావు? వెళ్ళు! రాజేశ్వరీ! ఈ సుఖంలోని మత్తు శాశ్వతంకాదు. స్త్రీకి తన పాతివ్రత్యం శీలాన్ని పవిత్రతే ముఖ్యం. క్షణికానందం కోసమని యీ బురదలో దిగితే - ఆ మచ్చ, జీవితాంతమూ బాధిస్తూ వుంటుంది. వెళ్ళు - రాజేశ్వరీ!' అన్నాడు ఆనందరావు, ఎంతో బాధగా బోధిస్తూ-

రాజేశ్వరికి ముఖంమీద ఛెళ్లున కొట్టినట్లయింది.

ఆమెకు ఆ సమయంలో కనురెప్పలు క్రిందికి వాలలేదు. బావవంక ఆశ్చర్యంతో అలానే చూస్తూవుండి పోయింది. బావలో హఠాత్తుగా కలిగిన మార్పు, మార్పుయొక్క తీవ్రతా ఆమెకు అర్థం కాలేదు.

బిగ్గరగా ఏడ్వాలనిపించింది.

తడబడుతూ వొచ్చి తనగదిలో మంచంమీద పడుకొని - దిండుమీద తల పెట్టి నిజంగా ఏడ్చింది.

పిచ్చిపిల్ల! తన ఆనందంకోసం - మనస్సు మార్చుకొని, హృదయాన్ని రాయిచేసుకొని చీకట్లో తన గదిలోకి వొచ్చింది. కాని జీవితంలో అతి జాగ్రత్తగా వుండవలసిన యీ వయస్సులో కాలుజారుతే - బ్రతుకు బండలు కాక, ఇంకేమన్నా ఉందా? కాని బావకు ఆనందం ఇవ్వడంకోసం, బావలో కోపం కలగడం తనకి క్షేమంకాదని ఆలోచించి సాహసం చేయటానికి ఆత్మను వంచించుకుంది. ఇంకానయం; క్షణంలో కాలు జారి అగాధంలోకి తలక్రిందులుగా పడేది. బావలో వొచ్చిన మార్పు తననూ, బావనూ, ఆ కుటుంబాన్నంతనూ పతనావస్థనుంచి కాపాడింది.

యీ గదిలో ఆనందరావుకూడా ఆలోచిస్తున్నాడు.

తను నీచుడు, బుద్ధిహీనుడు. లేకపోతే ఆమెను తను కోరటమేమిటి? రాజేశ్వరి పరిస్థితి ఏమిటి? ఆమె జీవితాన్ని చక్కబర్చవలసిన బాధ్యత ఎవరి మీద ఉంది? అటువంటి తనే తాత్కాలిక ఉద్రేకాలకు లోనై ఇంతచదువూ చదివిన విజ్ఞానాన్నీ, ఇంత లోకం చూసిన విచక్షణా జ్ఞానాన్నీ మరిచి అవివేకియై, మూఢుడై, ఆమె శరీరాన్ని వాంఛించితే - ఆమె బ్రతుకు ఏం కావాలి? ఆపిల్లపట్ల అట్లాంటి తన ప్రవర్తన తన జీవితానికీ, తన పరువుకూ, తన గౌరవానికీ - ఆమె జీవితానికీ, ఆమె పరువుకూ, ఆమె గౌరవానికీ ఎంత న్యూనత? అందుచేతనే తను ఆడిపోసుకొని చెంపలు వాయించుకొని, పాడు మనస్సును మార్చుకున్నాడు: మార్చుకో గలిగాడు! ఇక ముందెప్పుడూ ఇలాటి ప్రమాదంలో పడకూడదని బాస చేసుకున్నాడంటే, ఆశ్చర్యమేమిటి?

★




'జెమినీ స్టుడియోలో చాల కాలంనుండీ ఎక్‌స్ట్రా వేషాలేస్తున్నాను. త్వరలోనే నన్ను పైకి తేవాలని కొంతమంది పెద్దలే ప్రయత్నిస్తున్నారు. వారందరికీ నేనంటే ఎంతో ప్రేమలెండి!' అని చిలకలా నవ్విందామె.

అతనూ మందహాసంతో ఆమెను మీదికి లాక్కుంటూ, 'అవును, నీకేం? రంభలాగుంటావ్ మరి!...నాకూడా వాహినీలో మంచి ఛాన్సే దొరికేట్లుంది, త్వరలోనే!' అన్నాడు....

అంతలోనే ఆటోరిక్షా తేనాంపేటలో ప్రవేశించింది. ఆమె తన ఇంటికి దారి చెప్పింది. రిక్షా తిన్నగా పోయి, ఆమె చెప్పిన ఇంటిముందాగింది. ఆమె ఛెంగున దిగి, తాళంతీసి తలుపులు తెరుస్తుండగా – అతను డబ్బులిచ్చి రిక్షావాడిని పంపేశాడు.

ఆ యిల్లుకూడా ఏమంత అన్యాయంగా లేదు. కాని, రెండే గదులు! ముందుగది – పడకగదీ, పదిమంది కూర్చునే గదీ అంతా అదే. దాని నానుకొనే చిన్నగది. అదేవంటకీ, స్నానానికీను....

అతను మంచంమీద కూర్చున్నాడు; ఆమె తలుపువేసి వచ్చి, అతనిప్రక్కన చేరి ఏవో కబుర్లు నాల్గు చెప్పసాగింది. అతను ఆవలిస్తూ 'ఇంక లైటార్పివేద్దూ, తర్వాత మాట్లాడుకోవచ్చు గాని,' అన్నాడు. ఆమె లేచివెళ్ళి లైటార్పివచ్చి, అతనిమీద ఒరిగిందో

లేదో – బయటనుండి ఎవరో తలుపు తట్టినశబ్దం అయింది.

చట్టున ఆమె లేచిపోయింది. అతనాత్రంగా 'ఎవరది?' అన్నాడామెతో మెల్లగా. 'ఉస్!' అని, ఆమె చెవొగ్గి ఆలకించి, 'అమ్మో. మా అన్నయ్య!' అంది.

అతనూ దిగ్గున లేచి కూర్చుని 'అరె! ఊరెళ్ళాడన్నావుగా?' అన్నాడు.

'అవును, వెళ్తాననే పోయాడు ప్రొద్దుట. మరేమయిందో గాని, ఇప్పుడెట్లా దేముడా?'

బయట – తలుపు తట్టడం పోయి, బాదడంలోకి వచ్చింది వ్యవహారం. 'తీయ్! తలుపు తీయవేమే!' అని అరిచిందో మగ గొంతుక.

అతను 'వద్దు వద్దు–ఆగాగు' అంటున్నా. విన్పించుకోనట్లే పోయి ఆమె తలుపులు తెరిచేసింది.

బక్కపల్చని, ఎర్రని యువకుడొకడు గభాలున లోనికి ప్రవేశించి, లైటువేశాడు. ఆ యిద్దర్నీ చూచి కొయ్యబారి పోయాడు. మరుక్షణంలోనే క్రోధావేశంతో ఆమెపైకి లంఘించి, కొప్పుపట్టుకొన్నాడు. 'ఎంత చెడ్డా, ఇంత వరకూ దిగుతావనుకోలేదే, లం—! కూటికి లేకపోతే, నీతికి తక్కువవుతామంటే—ఛీ!' అంటూ చెడామడా నాల్గు కేకలేశాడు. ఆమె ఊరికే, ముఖం రెండుచేతుల్లో దాచుకొని దుఃఖిస్తూ నిల్చుంది. 'ఆగు. నీ పని ఇట్లా కాదు!' అంటూ, ఏదో చేయబోయాడు ఆమె అన్న.

'అవును, ఇటువంటి వాళ్ళకి ఇట్లా కాదు–' అని అందుకొని అతను ముందుకొచ్చాడు. నిబ్బరంగా. ఆ యువకుణ్ని రెక్క పట్టుకొని 'కాస్త, మీరవతలకు పోయి నలుగురు పెద్దమనుషుల్ని పిల్చుకు రండి. ఈలోగా దీనికి తగినశాస్తి నేనే చేస్తాను. మీకాశ్రమ ఎందుకంట?' అన్నాడు. తెల్లబోయినా, పైకి కన్పించకుండా తిప్పలు పడ్తున్నట్లు తేలిపోయాడు. 'సార్, మా మానాన్నమమ్మల్నింక వదలి మీ దారిన మీరు వెళ్ళండి. పుణ్యముంటుంది!' అన్నాడు.

కాని, అతను వదలక 'అదేంటి, అల్లాగ వదిలేస్తేనే వీళ్ళిట్లా తయారయ్యేది! ముందు నీవు కాస్త బయటకి వెళ్లు' అంటూనే ఆ యువకుణ్ని బలవంతాన బయటకి త్రోసి తలుపులు బంధించాడు.

అతను ఒక నిట్టూర్పువిడిచి, వెనుదిరిగి గంభీరంగా ఆమెవద్దకు నడిచాడు. దగ్గరగాపోయి, ఆమె ముఖం పైకెత్తి ఆమె ముఖంలోకి చూస్తూ తీవ్రంగా 'అరిచావా, చచ్చావే సుమా!' అని, కుడి చేతిలోవున్న పదునైన పిడికత్తిని చూపించాడు. నిలువునా నీరైపోయినట్లామె బయటపడిపోయింది....

'ఏదీ, ముందు నాదగ్గర తీసుకొన్న పదిరూపాయలూ కక్కు. ఊఁ! త్వరగా!'

గప్‌చుప్‌గా ఆమె జాకెట్టులో నుండి మనీపర్సు తీసింది. అతను దాన్ని లాక్కుని చూచాడు. తానిచ్చిన పదిరూపాయలకాగితం, కొంత చిల్లరావుంది. తన నోటు మాత్రమేతీసుకొని మిగతా పర్సు పక్కమీదికి విసిరేస్తూ 'ఎందుకులే

ఈ క్రిందికథనుబట్టి, 'ఇనుప కచ్చడాలు' పూర్వం ప్రపంచమంతటా సామాన్యంగా అందరూ ఉపయోగిస్తూ వచ్చినవే అని తెల్సుకోవచ్చు...

పురాతన రోం నగరంలో ఒక వీరుడు వుండేవాడు. అతనొకసారి యుద్ధానికి పోవలసి వచ్చింది. అది గొప్పయుద్ధం, తాను పోక తప్పని సరి అయింది. కాని, అందాల కుప్పయిన క్రొత్తపెళ్ళాన్ని వదిలిపోలేక పోయాడు. చివరికిక .చేసేదిలేక ఆమెకు ఇనుపకచ్చడ మొకటి బిగించి, ప్రాణమిత్రుడొకడ్ని పిలిచి దాని తాళంచెవి ఇస్తూ 'ఒరే! ఆరు నెలల వరకూ నా భార్యను నీ సోదరిలా చూస్తూ కాపాడు. అప్పటికీ నేను తిరిగిరాకపోతే నీ భార్యగా చేసుకో! ఇదిగో తాళంచెవి!' అని చెప్పాడు.

ఆ మిత్రుడు 'ఆహా! ఇంతగా చెప్పాలా నీవు? క్షేమాన పోయి లాభాన రా!' అని సాగనంపాడు.

ఆ యోధుడు గుర్రంఎక్కి పది, పదిహేను మైళ్ళు పోయాడో లేదో, తన్నెవరో వెంబడించి వస్తున్నట్లు అనుమానం కల్గింది. వెనుతిరిగి చూడగా తనమిత్రుడే గుర్రం మీద వేగంగా స్వారీ చేస్తూ ఒగరుస్తూ వస్తున్నాడు. వస్తూనే 'ఆగు మిత్రమా! ఆగు, నీవిచ్చిన తాళంచెవి సరైంది కాదు సుమా!' అని అరిచాడు!

ఏడుస్తారు. నోటికాడి కూడు!' అన్నాడు దయగా. అని, హఠాత్తుగా ఆమెని తన కౌగిలిలోకి లాక్కున్నాడు.

బలంగా, కరువుదీరా-కాదు, కాదు - కసిదీరా నలిపి ముద్దాడి 'చాల్లే' అని వదిలేసి, గబగబా దొడ్డిదారి పట్టాడు.

కాని, ఆమె వెంటనే అతన్ని వాటేసుకొని, దీనంగా 'ఇదిగో, వాడు నా అన్నా కాదు, ఏ పాడూ కాదు - ఛస్తూన్నా, ఇట్లా గే రోజూ వాడితో అవస్థపడలేక! నన్ను నీతో తీసుకుపోరాదూ, హాయిగా -' అంటూ ఏమో చెప్పుకో సాగింది.

కాని, అతను జాలిగా నవ్వి, 'నీవు చెప్పిందేమీ నేను నమ్మనే లేదులే! కాని, నేను చెప్పిందల్లా నమ్మేసినట్లున్నావే? పిచ్చిదానా, నిన్ను తీసుకుపోయి నేనుమాత్రం ఏం చేయగలను? నేను కూడా మీ 'అన్నయ్య'కు 'అన్నయ్య'నే అని ఇప్పటికైనా తెల్సుకో లేక పోతే, అంతే నీ ఖర్మ' అంటూ ఆమెను తోసుకుని, తప్పించుకొని ఉరికాడు... —కె. పి. బి.



Edited & Published by Dhanikonda Hanumantha Rao at Abhisarika Office, 4, Balu Mudali St., Madras-17. and Printed by M. Venkateswarlu at M. V S. Press, 72, Govindappa Naicken St., Madras-1

Regd No. M. 6516 ABHISARIKA (Telugu Monthly) Dec. '55

# అభిసారిక

సచిత్ర విచిత్ర మాసపత్రిక

సంపాదకుడు :

ధనికొండ హనుమంతరావు

★

శాస్త్రీయమైన లైంగిక వ్యాసాలతో, అత్యుత్తమ కథలతో, మనస్తత్వ వివరణలతో, శారీరక శాస్త్ర చర్చలతో, మీరు తెలుసుకోదగ్గ అనేక విషయాలతో, అందాలు చిందే త్రివర్ణ ముఖచిత్రంతో నెలనెలా వెలువడుతుంది.

ప్రతి సంచికా ఒక ప్రత్యేక సంచికే!

★

| | |
|---|---|
| సంవత్సర చందా : | రూ 6–0–0 |
| 6 నెలలకు చందా: | రూ 3–8–0 |

★

లేనిచోట్ల ఏజెంట్లు కావాలి.

వివరాలకు :

అభిసారిక కార్యాలయం,

4, బాలుమొదలి వీధి,

మద్రాసు-17.

Wrapper Printed at the Asian Printers, Madras-5.